# ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక

## విజయ సంవత్సరం మార్గశిర — పుష్య మాసములు


1. నెల్లూరి తెలుగు వార్షిక మహాసభ 1-6
2. ప్రబంధనములు — వర్ణనలు — కాకర్ల వెంకట రామ నరసింహం 1-25
3. వ్యక్తి వివేకము — భాగవతుల కుటుంబ రామ శాస్త్రి 67-78
4. భవిష్యోత్తర పురాణం — కావ్యత్వము — చిలుకూరి పాపయ్య శాస్త్రి 57-80
5. కళాసమీక్ష 40-48
6. [illegible] పరిణామము — రంగాజమ్మ 1-8
7. [illegible] — [illegible] 65-72

శ్రీ

# ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక

కాకినాడ

(Journal of the Telugu Academy)

చందా సంవత్సరమునకు మూఁడు రూపాయలు.

సంపుటము ౪౨ { విజయ సంవత్సరము / మార్గశిర—పుష్యమాసములు } సంచిక ౫

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

## నలువది రెండవ వార్షిక మహాసభ

దైవానుగ్రహమువలన 1954 జనవరి 30, 31 వ తేదీలలోఁ బరిషద్వార్షిక మహాసభలు చాల జయప్రదముగ జరిగినవి. వివిధమండలముల నుండి కవులును బండితులును విచ్చేసి తమకవితాకౌశలమును బాండితీవైభవమును బ్రకటించిరి.

30 వ తేదీ యుదయము 8 గంటలకు పుష్పతోరణాలంకృతమై పరిషద్భవనపురోభాగవర్తియైయున్న కాయమానముక్రిందఁ గవిపండిత సమావేశము జరిగినది. వేదగానముతోఁ బ్రార్థనలతోఁ బరిషద్వ్యవహారసభ ప్రారంభమయ్యెను. ఈవార్షిక సభకు స్వాగత సంఘాధ్యక్షులు శ్రీ దంటు సూర్యారావు గారు. పరిషదధ్యక్షులును మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణేత్యాది బిరుదాంకితులును, ఆస్థానకవులు నగు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులవారు అధ్యక్షులు; సభాప్రారంభకులు సుప్రసిద్ధులగు ఉమర్ అలీషా కవిగారి పుత్రులగు జనాబ్ కబీర్ షా గారు.

సభాప్రారంభమునకు ముందు శ్రీ దంటు సూర్యారావుగారు తమ స్వాగతోపన్యాసమును జదివిరి. పిమ్మట జనాబ్ కబీర్ షా గారు సభాప్రారంభ మొనర్చుచు నాంధ్రభాషకు నాంధ్రసాహిత్యపరిషత్తు

గావించిన సేవ నుగ్గడించి జాతిమత విభేదములు లేక యాంధ్రు లందఱు, ఈ పరిషత్తును బోషింపవలెనని హెచ్చరించిరి.

అనంతరము పరిషత్కార్యదర్శులు శ్రీ చతుర్వేదుల సత్యనారాయణ గారు 1946 నుండి నేటివఱకుఁ బరిషత్తు గావించిన భాషాకృషిని సంగ్రహముగ వివరించి యాంధ్రదేశమునఁ గల నిఖిలపత్త్రముల వారు తమకుఁ గల స్వల్పాభిప్రాయభేదముల నెడఁ బట్టుదలలు చూపక పరిషత్తుతోఁ గలిసి పనిచేయుటకై యుద్బోధ మొనర్చిరి.

అంతఁ బరిషదధ్యక్షులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు తమ యధ్యక్షోపన్యాసమున నాంధ్రభాష నేఁ డెట్టి హీనస్థితిలో నున్నదో వివరించి యాంధ్రులందఱుఁ దమ భాషోన్నత్యమునకై నడుము కట్టవలె నని యుద్బోధించిరి.

పిమ్మట అవధానిశేఖర శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి గారు పరిషత్ప్రశంసాత్మకమగు పద్యముల బహురమణీయముగాఁ బఠించిరి. విద్వాన్ శ్రీ దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రిగారు పరిషదధ్యక్షులగు శ్రీ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారి భాషాసేవ నుగ్గడించుచుఁ బద్యములఁ జదివిరి. ఇంతటితో నుదయము సభ ముగిసెను.

మరల మధ్యాహ్నము 2½ గంటలకు సారస్వత, భాషా-వ్యాకరణ, చరిత్ర-సంస్కృతి, శాఖలుగా త్రిధావిభక్తమైన యీమహాసభలను మన యాంధ్ర రాష్ట్రమున నార్థికామాత్యు లగు శ్రీ తెన్నేటి విశ్వనాథము ఎమ్. ఎ. బి. ఎల్. గారు ప్రారంభించిరి. వారు తమ గంభీరోపన్యాసమున ఫ్రెంచి సాహిత్య పరిషత్తువంటి యధికారయుత మైన యొక మహాసంస్థ యాంధ్రరాష్ట్రమున కవసర మని వాక్రుచ్చిరి. ఆంధ్ర భాషకుఁ దగిన సంక్షిప్తలేఖన మవసర మనియు రోమను లిపిని ననుసరించినచో 'టైపు' చేయుటకు నెక్కువ సుకరముగ నుండు ననియు నుడివిరి. నాఁటి సారస్వత మహాసభాధ్యక్షులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు. వారు తమ యధ్యక్షోపన్యాసమున మనకు స్వరాజ్యము లభించుటయు, ఆంధ్ర రాష్ట్ర మేర్పడుటయు, మరల నాంధ్రసాహిత్యపరిషత్తు పునరుజ్జీవిత మగుటయు ఆంధ్రజాతికి, ఆంధ్రభాషకు శుభోదయమును సూచించు

చున్నదని నుడివిరి. మొదటినుండియు మనవారు సారస్వతమునకంటె శాస్త్రమున కెక్కువ ప్రాధాన్య మొసంగుచున్నారనియు, ఒకజాతి నాగరికత పెంపొందవలెనన్న సారస్వతపోషణ మత్యవసర మనియుఁ దెల్పిరి.

ఆంధ్రవిశ్వకళా పరిషదాంధ్ర శాఖా ప్రధానాచార్యులు శ్రీ గంటి జోగిసోమయాజులుగారు పరిషత్తులను ప్రభుత్వము పోషింపవలసిన బాధ్యతలనుగుఱించి యుపన్యసించిరి. నరసాపురము కళాశాలాంధ్రభాషా ప్రధానోపన్యాసకులు శ్రీ దేవరకొండ పేరయ్య, ఎమ్. ఏ. గారు 'ఆముక్తమాల్యద-కథాశిల్పమును' గుఱించి తమ యుపన్యాసము పఠించిరి. విశాఖపట్టణమందలి ఏ.వి. యన్. కళాశాలాంధ్రభాషాప్రధానోపన్యాసకులు శ్రీ దివాకర్ల రామమూర్తిగారు "అవహేళన కావ్యములు" అను తమ యుపన్యాసమును పఠించిరి. కోనసీమ కళాశాలా ప్రధానాంధ్ర పండితులు శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు "ఆంధ్రభాషాప్రాశస్త్యమును"గుఱించి యుపన్యసించిరి. బందరు జాతీయ కళాశాలాధ్యక్షులు శ్రీ మత్తిరుమల గుదిమెళ్ళ వరదాచార్యులుగారు "నేటివిద్యావిధానమున సంస్కృతమున కీయవలసినస్థానము"నుగుఱించి యతిగంభీరముగ నుపన్యసించిరి. శ్రీ అనుముల వెంకటశేషకవిగారు (కర్నూలు) రామాయణమునందలి కొన్ని సంశయములనుగూర్చి వివరించిరి. శ్రీ బందా కొప్పులింగేశ్వరరావుగా రాంధ్రభాషాభివృద్ధికై ప్రభుత్వకర్తవ్యమునుగుఱించి యుపన్యసించిరి. శ్రీ శిష్టా వెంకటజోగారావుగారు "తిరుమలకవి గీతరఘువంశమును"గూర్చి వ్యాసముచదివిరి. శ్రీ భమిడి సత్యనారాయణశర్మగారు "రామాయణమునందలి హాస్యరసమును"గుఱించి వ్యాసమును పఠించిరి. శ్రీ మల్లాది శివరామ్‌గారు 'కవితాకంఠాభి' అను విషయమునుగూర్చి తమపద్యములు చదివిరి. శ్రీ కేతవరపు వేంకటరామకోటిశాస్త్రిగారు "దేవయాని పాత్రి చిత్రణమును"గూర్చితమ యుపన్యాసమును పఠించిరి. అనివార్య కారణములచే నీసభకు రాజాలకుంటి మని తెలుపుచు శ్రీ దివాకర్ల వెంకటావధాని గారు "ఆముక్తమాల్యద-రాయలవారి యాంతరభావములు" అను

విషయమునుగూర్చి వ్యాసమును బంపిరి. దీనితో ఆనాఁటిసభ రాత్రి 9 గంటలకు ముగిసెను.

31—1—54 నాఁటియుదయము సరిగా 8 గంటలకు భాషా-వ్యాకరణ మహాసభ ప్రారభమయ్యెను. శ్రీ మత్తిరుమల గుదిమెళ్ళ వరదాచార్యులవారీసభను బ్రారంభించిరి. ఆంధ్రవిశ్వకళాపరిషదాంధ్రశాఖా ప్రధానాచార్యులు శ్రీ గంటి జోగిసోమయాజులుగా రధ్యక్షత వహించిరి. వీరు తమ యధ్యక్షోపన్యాసమున భాషాభివృద్ధికై ప్రభుత్వకర్తవ్యమును గుఱించియు, వ్యాకరణ రచనావిధానమునుగూర్చియు విపులముగాఁ జర్చించిరి. పిమ్మట విద్వాన్ శ్రీ రాఁభొట్ల లక్ష్మీనారాయణగారు (ఎ. వి. యన్. కళాశాల, విశాఖపట్టణము.) "ఆంధ్రభాషయందలి వికృతిపదస్వరూప నిరూపణము" అను విషయమునుగూర్చి తమ వ్యాసము వినిపించిరి. రాజమహేంద్రవరము, ఆర్యసేవాసదనమున నుపాధ్యక్షులగు శ్రీ ఎరసూరి మల్లికార్జునరావుగారు 'కావ్యభాష' గుఱించి తమ వ్యాసము పఠించిరి.

పిమ్మట "ఆంధ్రభాషకు సర్వసమ్మతము పర్యాప్తమునగు వ్యాకరణము" అనువిషయమును గుఱించి చర్చ ప్రారంభమయ్యెను. ఈచర్చను శ్రీ పీఠికాపురమహారాజులుంగారి కళాశాలా పండితులగు శ్రీ కోపల్లి శివకామేశ్వరరావుగారు ప్రారంభించిరి. వీరు ఆంధ్రభాషకు వ్యాకరణావశ్యకతను నిరూపించి తద్రచనావిధానమును విపులముగా విమర్శించిరి. పిమ్మట ఆంధ్రవిశ్వకళాపరిషత్తునందు ఆంధ్రభాషోపన్యాసకులగు శ్రీ దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు "నేఁడు వ్యాకరణము నెట్లు సంస్కరింపవలెను" అను విషయమునుగుఱించి మృదుమధురముగా నుపన్యసించిరి. అధ్యక్షుని చరమోపన్యాసముతో నాపూఁటసభ ముగిసెను. ఆనాఁడనకాపల్లిలో రైలు ప్రమాదవశమునఁ డాము సభకు రాఁజాలమని శ్రీ ఆకెళ్ళ అరుణాచలశాస్త్రిగారు, శ్రీ కొత్తపల్లి వీరభద్రరావుగారు తంత్రీవార్త నంపిరి. వారి వ్యాసములు క్రమముగఁ బరిషత్సం

చికలోఁ బ్రచురింపఁ బడును. ఇంకను శ్రీ బులుసు వెంకటరమణయ్యగారు శ్రీ కె.వి.ఎన్. అప్పారావుగారును (ప్రిన్సిపల్, కొవ్వూరు సంస్కృతకళాశాల) తమ వ్యాసములు పంపిరి.

మరల మధ్యాహ్నము 2½ గంటలకు చరిత్ర-సంస్కృతి మహాసభ సమావేశమయ్యెను. ప్రారంభకులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. ఈసభకు అధ్యక్షులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు తమ ప్రారంభోపన్యాసమున, భాషకుఁ జరిత్రకు జీవితము ధారపోసిన శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారీ సభ కధ్యక్షత వహించుట మహాభాగ్య మనిరి.

సభాధ్యక్షులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తమ యధ్యక్షోపన్యాసమునకు ముందు చిరకాలమునుండి సాంస్కృతికచారిత్రిక విషయములలోఁ బరిశోధనలు గావించిన శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారి స్వర్గవాసమునకుఁ దమ సంతాపము వెలిఁబుచ్చిరి. పిదప నేఁడు సంస్కృతి పదప్రచారమును, తత్ప్రాచీనతావిశిష్టతలను బేర్కొని యీరాపైఁ దమ "చరిత్ర-సంస్కృతి"అను వ్యాసమును బఠించిరి.

శ్రీ నోరి నరసింహశాస్త్రి బి.ఎ.బి.ఎల్., గారు (రేపల్లె) "మోటుపల్లి" యను విషయమునుగూర్చి దమ వ్యాసమును జదివిరి. శ్రీ కందూరి యీశ్వరదత్తు బి.ఎ. గారు "ఆంధ్రదేశమందలి చరిత్రకు భూగోళమునకుఁగల సంబంధము"అను విషయముగురించి తమవ్యాసమును జదివిరి. అభినవవ్యాస శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చరిత్ర సంస్కృతుల సంబంధమునుగూర్చి యుపన్యసించిరి. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు త్రిధావిభక్తమైన పరిషద్వార్షిక మహాసభలు ప్రస్తుతసమావేశ విశిష్టతలను జాటుచున్నవనియు, దీనినిబట్టి భాషకు, వ్యాకరణమునకుఁ, జరిత్రకుఁగల త్రయను బంధసూత్రము గోచరించుచున్న దనియుఁ జెప్పి యిఁక ముందుగూడ నీశాఖలకుఁ జెందిన విద్వాంసులను

నిట్లే సమకూర్చి యాంధ్రసాహిత్య పరిషత్తు సర్వతోముఖమైన భాషా సేవచేయ నాశించు చున్నామనిరి.

శ్రీ ఓరుగంటి రామచంద్రయ్యగారు ఎం. ఏ, పి. హెచ్. డి. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారంత చరిత్రపారంగతులో యంతే కావ్యరసజ్ఞులు, నేను వారికి నేకలవ్యశిష్యుండనని చెప్పి మనచరిత్ర సంస్కృతుల నిలంబెట్టినది సాహిత్యమేయని యుపన్యసించిరి.

ఇంతటితో చరిత్ర-సంస్కృతి మహాసభ ముగిసినది. సభాంతమున రాత్రి 8 గంటలకు శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రిగారు చాలరసవంతముగ, జయప్రదముగను నష్టావధానము సలిపిరి. శ్రీ మొసలకంటి తిరుమలరావుగారు శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి గారి యష్టావధాన సామర్థ్యమును బ్రశంసించుచు, నిట్టి సమావేశములు చేయించిన యాంధ్రసాహిత్యపరిషత్తునకుం బ్రభుత్వము ధనసాహాయ్యము చేసి, యాంధ్ర భాషను బెంపొందింపవలెనని నుడివిరి. సభాంతమునం బరిషత్కార్యదర్శులు శ్రీ ప్రతివాద భయంకర పార్థసారథిగారు దూరదూరములనుండి పరిషద్వార్షిక మహాసభలకు విచ్చేసి విజయవంతము కావించిన కవులకుం బండితులకు, రసజ్ఞులకుం దమకృతజ్ఞతను వెలిబుచ్చిరి. ఈసభలకుం బెక్కువిధములం దోడ్పడిన పౌరులకు, అతిథి నివాసమునకుం దమ యున్నత పాఠశాలాభవనము నొసంగిన శ్రీ పురపాలక సంఘమువారికి, భోజనాది సౌకర్యములకుం దమభవనమంతయు నిచ్చి, పరివారసహితముగ నతిథి సత్కారమునం దోడ్పడిన శ్రీ భమిడిపాటి సత్యనారాయణ గారికిం దమకృతజ్ఞతను దెల్పిరి. అంత జయజయనాదములు మిన్నుముట్ట సభలు సమాప్తమయ్యెను.

సభలలోం జదువంబడిన వ్యాసములను, సభలలోం జదువుటకై పంపంబడిన వ్యాసములను ప్రత్యేకసంచికగా త్వరలో వెలువరింతుము.

# ఆంధ్ర సాహిత్య పరిషత్తు

---

౧౯౪౮ సం॥ర జనవరి ౩౦-౩౧ వ తేదులలో జరిగిన వార్షిక మహాసభలలోఁ గావింపఁబడిన **తీర్మానములు.**

౧. భారతీయ సంస్కృతికిని, అన్ని భారతీయ భాషలకు, ముఖ్యముగ తత్సమ పదబాహుళ్య మగు నాంధ్రభాషకు, ప్రాణాధారమగు సంస్కృతభాషను ఉన్నత పాఠశాలలలోను, కళాశాలలలోను నందఱికి నవశ్య పఠనీయముగఁ జేయువలయు నని ప్రభుత్వము వారిని గోరుచు, ఈసభ వారు తీర్మానించుచున్నారు.

ప్రతిపాదకులు—శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు.
అనువాదకులు—శ్రీ దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు.

౨. ఆంధ్రభాషకు సాధ్యమైనంతవఱకు సర్వసమ్మతము, పర్యాప్తమైన వ్యాకరణ రచనమునకై కృషిచేయఁగల యొక సంఘము నేర్పఱచుటకు పరిషత్కార్య నిర్వాహకసంఘము వారిని, ఈసభ వారు కోరుచున్నారు.

ప్రతిపాదకులు—శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు.
అనువాదకులు—శ్రీ దివాకర్ల రామమూర్తిగారు.

౩. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునందలి, తంజావూరి సరస్వతీ మహాలు నందలి, ఆంధ్రగ్రంథములను, ఆంధ్రలిపియందు వ్రాయఁబడిన సంస్కృత గ్రంథములను, ఆంధ్రరాష్ట్రమునకుఁ జెందవలసిన యితర సంస్కృత గ్రంథ భాగమును, ఆంధ్రసాహిత్య పరిషత్తు, కాకినాడ యందుఁ జేర్పవలసినదని ప్రభుత్వము వారిని ఈ సభ వారు కోరుచున్నారు.

ప్రతిపాదకులు—శ్రీమత్తిరుమల గుడిమెళ్ళ వరదాచార్యులుగారు
అనువాదకులు—శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు.

౪. ప్రస్తుతమున్న ప్రజాస్వామిక ప్రభుత్వ పరిస్థితులలో జమీందారుల, సంస్థానాధీశుల సాహాయ్యమునకు నవకాశము లేకపోవుటచేఁ బరిషత్పోషణమునకుఁ దగినంత సాహాయ్య మొనరింపఁ బ్రభుత్వము వారిని ఈ సభ వారు ప్రార్థించుచున్నారు.

ప్రతిపాదకులు—శ్రీమాన్ కిళాంబి రాఘవాచార్యులుగారు.
అనువాదకులు—శ్రీ యెండమూరి వెంకటరమణగారు.

౫. కేంద్రప్రభుత్వముచే స్థాపింపబడిన, అఖిలభారతి సాహిత్య పరిషత్తునకు, అనుబంధమగు ప్రాంతీయ సాహిత్యశాఖాసంస్థగా, ఆంధ్ర ప్రాంతమునకు నాంధ్రసాహిత్యపరిషత్తును గుర్తింపవలెనని, కేంద్రప్రభుత్వమువారిని ఈ సభ వారు ప్రార్థించుచున్నారు.

ప్రతిపాదకులు—శ్రీ కుందూరి యీశ్వరదత్తుగారు.
అనువాదకులు—శ్రీ చతుర్వేదుల సత్యనారాయణగారు.

---

## శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

శ్రీ పిఠాపురము మహారాజావారి ధనసహాయముచే రచియింపఁబడుచున్న పెద్ద నిఘంటువులోని రాయల్ సైజు 1000 పుటలుగల ప్రథమసంపుటమును, 955 పుటలుగల రెండవ సంపుటమును, 980 పుటలుగల మూఁడవ సంపుటమును, 950 పుటలుగల చతుర్థసంపుటమును, ముద్రితములై విక్రయమునకు సిద్ధముగా నున్నవి. ఇందు ప్రథమసంపుటమున అకారము మొదలు, ఔకారము వఱకునుగల యచ్చులాదియందుఁగల సంస్కృతాంధ్ర శబ్దములన్నియుఁ గలవు. రెండవ సంపుటమున 'క' మొదలు 'బ' వఱకుఁగల శబ్దములును, తృతీయసంపుటమున 'చ' మొదలు 'తృ' వఱకుఁగల శబ్దములును, చతుర్థసంపుటమున 'తె' 'ద్ర' వఱకుఁగల శబ్దములును గలవు. ఇదివఱకున్న నిఘంటువు లన్నిటికంటె నిది సర్వవిధముల నుత్తమ మయినది. ఈ పుస్తకమును రచియించుటకు ముద్రించుటకు విశేషద్రవ్యము పట్టినను ధనవంతులకే గాక జన సామాన్యమునకుఁ గూడ లభ్యముగా నుండవలయు నను తలంపులో నీ క్రిందివెల నిర్ణయింపఁబడినది.

క్యాలికో బైండింగు ఒక్కొక్క వాల్యూము రూ 6–లు.

# ప్రబంధములు—వర్ణనలు.

కాకర్ల వెంకట రామనరసింహము, ఎం. ఏ. పి. హెచ్. డి.

పురాణములకును ప్రబంధములకును గల ముఖ్యభేదములలో వర్ణనావిషయ మొకటియై యున్నది. పురాణకవి, కథాకథనము నందే దృష్టిని నిల్పినవాఁడై వర్ణనావిషయమునం దంతగా శ్రద్ధను వహింపఁడు. ప్రబంధకవితకు వర్ణన లొక ముఖ్యాంగము. అష్టాదశవర్ణనాత్మకమై ప్రబంధ ముండవలయు నను నియమమే యీయంశమున కొక ప్రబల నిదర్శనముగా నున్నది. తుదకీ వర్ణనలే మితి మీఱి ప్రబంధ రచన కొక కళంకము నాపాదించినవి. కాని రాయల కాలమునందలి ప్రబంధములు మాత్రము చాలవఱకు యథోచితవర్ణనావిలసితములై యే యున్నవి. ఈ యుగమునం దావిర్భవించిన ప్రబంధముల వర్ణనౌచిత్యమును గూర్చి ప్రసంగించుటకు ముందు వర్ణనావిషయమునఁ గల కొన్ని నియమములను బరిశీలింతము.

వర్ణనలు కథాగతిని సూచించునవి యై యుండవలయును గాని, దానిని నిరోధించునవి యై యుండరాదు. ఇది వర్ణనలయెడఁ గవి పాటింపవలసిన మొదటి నియమము. వర్ణ్యమానవస్తువు స్ఫురణకు రాక, వర్ణనాపద్ధతిపై మనసు పోయినప్పుడా వర్ణనలు కావ్యసౌందర్యభంజకము లనియే తలంప నగును. అనఁగా వర్ణనలయందు ఝటితిస్ఫురణయు నక్లిష్టతయు నుండవలయునే కాని, యవి గూఢభావగర్భితములును శ్లేషార్థగుంభితములు నై యుండరాదు. వర్ణనలు స్వాభావికములై యుండవలయును. అనఁగా వర్ణనలయందు సాంకేతికము లైన నియమము లధికముగా నుండినచో నవి చమత్కారావహములై యున్నను, వర్ణింపఁబడిన వస్తువు స్వచ్ఛరూపమునఁ బఠితలకు సాక్షాత్కరింపదు. వర్ణనలను గవులు తమ పాండిత్యప్రకర్షకునై చేయరాదు. దృశ్యమును గన్నులకుఁ గట్టినట్లు చేయుటకును, కథాకథనము పేలవముగా నుండ

కుండ నూత్నమై తేజమును కలిగించుటకును, వర్ణన లావశ్యకములై యున్నవి. వర్ణనల వలనఁ గథావస్తువును,నందలి పాత్రలును దృగ్గోచరము లగుటకు బదులు, అవి దూరదూరముగఁ బోయి మసకమసకగాఁ గన్పట్టినచో నిఁక నా వర్ణనల వలనఁ బ్రయోజన మేమి? అందుచే వర్ణనలను కేవల పాండిత్యప్రకర్షకునై చేయరాదు. ఇఁక వర్ణనము చేయుచో నే యంగమున కా యంగమును వర్ణించుటకంటె నాకారమంతయు స్మృతి పథమునఁ బడునటుల వర్ణించుట మేలు. అనఁగా నా వర్ణనము వలనఁ గవి మన కా యాకారమునందలి యే ప్రధానాంశమును బ్రదర్శింప నెంచెనో, అది సుబోధక మగునట్లు గావించినఁ జాలును. తక్కినవి యప్రస్తుతములే యగును. ఇందులకుఁ దిక్కనార్యుని జమ్మివర్ణన మొక నిదర్శనము. ఇందుఁ గవి మనకుఁ జెప్పఁదలఁచినది తద్భయంకరాకారము. కవిబ్రహ్మ తనవర్ణనానైపుణ్యము నంతయుఁ దద్భయంకరత్వ ప్రదర్శనమునందే కేంద్రీకరించి యున్నాఁడు. ఇంతకును సకలాంగముల కూడికలోనే అంగిసౌందర్యము కలదు గాని, యే యంగమున కా యంగమును విడదీసిన నేమి సౌందర్యము కలదు.

ఇవి వర్ణనావిషయికము లైన కొన్ని నియమములు. ఇవి ముఖ్యముగాఁ బాటింపఁదగినవి. కాని యీ నియమము లన్నియు సూచనా మాత్రములే యని గ్రహింప నగును. కవి లోకమునుగూర్చి యే విషయము మాటలాడినను "నిరంకుశాః కవయః" అను వాక్యమును మాత్రము మఱువరాదు. కవు లందఱు నొకే స్వభావము కలవారై యుండరు. కొందఱు బహువర్ణనాప్రియులై యుందురు. కొందఱకు స్వభావోక్తి యనిన సభిమానము. కొందఱకు నతిశయోక్తి యనినఁ బ్రీతి. కొందఱి కుత్ప్రేక్షయుఁ గొందఱి కుపమయుఁ బ్రాణములు. వారివారి వ్యక్తిత్వమును బట్టి వారివారి యభిరుచులు మాఱుచుండుటయు, భిన్నభిన్నమార్గములఁ బోవుచుండుటయుఁ గలుగును. ఎవరి కేది స్వభావసిద్ధమై యుండునో దానిని వా రెంతగాఁ బ్రయోగించినను విసుగు జనింపదు. మఱియు నాహ్లాదకరము గా నుండును. కాని కవు లందఱును స్వతంత్రవ్యక్తిత్వము కలవారు కారు. అందు గతానుగతికుల సంఖ్యయే యధికము. వసుచరిత్రకారునకు

శ్లేషానుప్రాసాదులయందుఁ బ్రీతి మెండు. అవి యాతనికి స్వభావసిద్ధములై యున్నవి. అందుచే నాతని గ్రంథమునకు సంబంధించి సంతవఱకు నవి ప్రమోదకరములే యగుచున్నవి. అదియునుగాక అతని కవితయం దితరములగు విశిష్టగుణము లనేకములు గలవు. ఇంకఁ బిల్లవసుచరిత్రములఁ జూతము. పులిని జూచి నక్క వాతలు పెట్టుకొనె నను సామెత వీనియందు సార్థక మగుచున్నది. వసుచరిత్రకారునకు శ్లేషానుప్రాసాదులయందుఁగల ప్రజ్ఞ సహజసిద్ధము. వీరి కన్నదో యది బహుప్రయత్నసాధ్యము. అందుచేతనే కృత్రిమము. అస్వాభావికము లైన యీ రచనలందదుకులుగా నుండి రసికులకు విసువు పుట్టించును. ఈ విషయమునకుఁ జేమకూర వేంకటకవి యొకయపవాదము (Exception). వసుచరిత్రకారునితోఁ బోటీకి నిలుచుటయే కాక, కొన్నిపట్టులలో నాతనిని గూడ వేంకటకవి మీఱినాఁ డనుట సత్యదూరము కాదు. ఇంతకును జెప్పవలసిన దొక్కటే. కవి యేది వ్రాసినను నెట్లు వ్రాసినను నది యాతనికి స్వభావసిద్ధమై యుండవలయును. అస్వాభావిక మగు ననుకరణము కావ్యకళాసౌందర్యభంజక మగును.

స్వాభావిక మగు వర్ణనాప్రజ్ఞను బురాతన ప్రబంధకవులలోఁ బ్రప్రథమునిగాఁ జేర్కొనఁదగినవాఁ డల్లసాని పెద్దనార్యుఁడు. ఈతని వర్ణనలు స్వాభావికములై యుండుటే కాక, యయ్యది కథాగతికి నడ్డుతగులనివి కూడ నై యున్నవి. పెంచి వర్ణించుటయు నీతని కిష్టమే. అయ్యు నయ్యది కడుంగడు హృద్యముగా నుండునట్లు వ్రాయఁగలఁడు. మార్కండేయపురాణమున రెండుపద్యములలో నున్న సిద్ధాగమనఘట్టము నీతఁ డించుమించుగా నొక యాశ్వాస మంతయు వ్రాసినాఁడు. ఇట్లే మార్కండేయపురాణమున 'స్వర్వేశ్య యగు వరూథిని మారసమానుఁ డగు ప్రవరుని జూచినది' అని యతిసంక్షేపముగాఁ జెప్పఁబడిన భాగము నీతఁ డెన్నియో స్వకపోలకల్పనలు పెట్టి పెంచి వ్రాసినాఁడు. ఈ రెండును నీతని వర్ణనాప్రియత్వమునకుఁ బ్రబల దృష్టాంతములు. ఇట్టి వింకను నెన్నియేనియుఁ గలవు. గ్రంథవిస్తరభీతిచే నవి యిట నుదాహరింపక విడిచినాఁడను.

ఇట్టి వర్ణనల వలనఁ బ్రబంధములకు ఫలద్వయము చేకూఱుచున్నది. ఒకటి వర్ణ్యమానవస్తువు ప్రత్యక్షముగా గోచరించుట, రెండు పాత్రల మనఃప్రవృత్తి విశద మగుట. ఈ రెండును సాధించుటలో పెద్దనార్యుఁడు కృతకృత్యుఁ డైనాఁ డనవచ్చును.

మఱియుఁ బ్రబంధములపై నిక్కాలమున నొక యపప్రథ ప్రబలి యున్నది. ప్రబంధవర్ణనలు కథాగతికి సంబంధించి యుండవనియుఁ బ్రబంధకవు లనావశ్యక మైనను, శాస్త్రనియమోల్లంఘనముఁ గావింపలేక యష్టాదశవర్ణనలతోఁ దమ కావ్యములను నింపుదు రనియు దాని సారము. ఈ యపప్రథ కేవల మాధారరహిత మనుటకు వీలు లేదు. శ్రీనాథయుగములోని కొన్ని ప్రబంధములను బరిశీలించితి మేని యియ్యది సత్యమే యనిపించును. కాని మహాకవికృతములై వాఙ్మయాలంకారము లనఁదగిన ప్రబంధము లెన్నియో కలవు. వానిని గూడ నిట్లే దూషించుట యవివేక మనందగును. మనుచరిత్రాది మహాప్రబంధముల యందుఁ గల వర్ణనలు, కథాగతికి నెట్లు సాహాయ్యకము లగుచున్నవో యీ క్రింది దృష్టాంతములను బట్టి గ్రహింప నగును.

ప్రబంధకవులు ప్రకృతివర్ణనమును గావించి నప్పుడు కూడ నద్దానిని కథాగతితో నెట్లు మనోహరముగా మేళవింపఁగలరో చూడుఁడు: ప్రవరుఁడు వీతిహోత్రుని సాహాయ్యమున నిజగృహమును జేరినాఁడు. విరహానలదందహ్యమానమానస యగు వరూథిని, పూచిన లతాగృహమునందుఁ జంద్రకాంత శిలాతలమున మేనుఁ జేర్చి బహువిధశోకములతో బాధపడుచుండెను. అట్టి సమయమున సాయంసమయాంధకార వర్ణములను గవి చేసినాఁడు. సాయంసమయమున సూర్యుఁడు కషాయదీధితిని దాల్చినాఁ డని చెప్పుచు నద్దానిని బ్రకృతకథతోఁ గవి యెట్లు కలిపినాఁడో చూడుఁడు.

"తరుణి ననన్యకాంత, నతిదారుణ పుష్పశిలీముఖ వ్యథా
భరవివశాంగి, సంగభవుబారికి నగ్గము సేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్"

సూర్యుఁ డస్తంగతుఁ డగునప్పు డరుణ దీధితిని బొందుట సహజమే యయ్యు నద్దానిని బ్రవర కృత వరూథినీ తిరస్కార జనిత రోషముగా నుత్ప్రేక్షించి కవి యీ వర్ణనకును గథకును నవినాభావసంబంధమును గల్పించినాఁడు.

మఱియుఁ గవి యిచ్చోటఁ గావించిన వర్ణనలు ముందు రాఁబోవు కథను సూచించునవి యై యున్నవి. ఈ క్రింది పద్యమును జూడుఁడు.

"ఉరుదరీకుహర సుప్తోత్థ శార్దూలముల్
ఝురవారి శోణిత శంకఁ ద్రావ
వనకుంజమధ్య శాద్వలచరన్మృగపంక్తి
దావపావకభీతిఁ దల్లడిల్ల
నాశ్రమాంతర భూరుహాగ్రముల్ మునికోటి
బద్ధకాషాయ విభ్రాంతిఁ జూడ
ఘనసాను శృంగ శృంగాటకంబులఁ గాంచి
యమరులు హేమాద్రి యనుచు వ్రాల
గాసెఁ బేశలరుచిఁ గింశుకప్రవాళ
ఘుసృణకిసలయ కంకేళికుసుమగుచ్ఛ
బంధుజీవ జపా రాగ బాంధవంబు
లన్నగంబున జరఠారుణాతపములు."

ఈ పద్యములలోఁ గవి వర్ణించినది భ్రాంతి. సుప్తోత్థము లైన పులులు సెలయేటి నీటిని రక్త మనుకొనుచున్నవి. జింకలు పొదరిండ్లను దవదహన మనుకొనుచున్నవి. మునులుకూడఁ దమ యాశ్రమవృక్షముల కొనలను జూచి తమ కావివస్త్రము లేమో యనుకొనుచున్నారు. ఎఱ్ఱని చఱియలను, శిఖరములను జదునకములను గాంచి, దేవతలు మేరుపర్వత మేమో యనుకొనుచున్నారు. ఇది యంతయు భ్రాంతిమాత్ర మే. ప్రకృతి యంతయు భ్రాంతిమయ మై యున్నది జంతువులును మనుష్యులునే కాక దేవతలు కూడ భ్రాంతి కధీను లై యున్నారు. అట్టిచో, విరహముచే గ్రాఁగి క్రాఁగి యున్న యెడంద గల వరూథిని, భ్రాంతికి లోనగుట యొక

యబ్బురమా? మాయాప్రవరుని బ్రవరునిగా భావించి యామెయు భ్రాంతికి లోనైనది. ఈ పద్యమున నమరులను గూడఁ జేర్చుటయందలి కవిప్రతిభను రసికు లూహింతురుగాక! ఇట్లే ఆ సాయంసంధ్యాసమయమునఁ బ్రియు నెడబాసి, తదీయ విరహముచే నిర్వేదము నొందుచున్న యొక చక్రవాకిని వర్ణించి, కవి యప్పటి వరూథిని దురవస్థను సూచించినాఁడు. చూడుఁడు.

"ఏ విహంగముఁ గన్న నెలుఁగిచ్చుచును పారె
                    కును సైకతంబులఁ గూడఁ దాఱు
దాఱి కన్గొని యది తన జోడు గాకున్న
                    మెడ యెత్తి కలయంగ మింట నరయు
నరసి కన్నీటితో మరలి తామర యెక్కి
                    వదన మొండగఁ సరోవారి నద్దు
నద్ది త్రావఁగ నైప కట్టిట్టు గన్గొని
                    ప్రతిబింబ మీక్షించి భ్రమసి యులుకు
నుఱికి యెఱకలు దడియ వేఱొక్క తమ్మి
కరుగు నటకేగి రవంబుతోఁ దిరుగు తేంట్ల
బొడుచు ముక్కున, మఱియును బోవు వెదక,
సంజఁ బ్రియుఁ బాసి వగ నొక్క చక్రవాకి".

ప్రియవియోగము పక్షులకే దుస్సహ మగుచుండఁగా నిఁక స్వర్వేశ్య యగు వరూథిని విషయమున నది యెట్లుండునో చెప్పవలయునా యని కవి యాశయము. ప్రబంధములలో దీని కీడు గల ప్రకృతివర్ణనలు మృగ్యము లనుట యతిశయోక్తి కాదు. సూక్ష్మాతిసూక్ష్మము లగు ప్రకృతిధర్మములను జిత్రించుటలో పెద్దనకు సాటి యనఁదగిన యాంధ్రమహాకవు లెందఱో లేరు.

మెలమెల్లనఁ గటికిచీకటి దిశాస్తోమము నాక్రమించినది. వరూథినీ హృదయమునను నంధకారము ప్రవేశించినది. అంతటఁ జంద్రోదయమైనది. కాని యేమి ఫలము? చంద్రకాంతి విరహిణులకు సుఖాస్పదము

కాదు. అందులకే యీ క్రిందిపద్యమున వెన్నెలచిచ్చుతోఁ సరిపోల్పఁ బడినది.

"జలజాగారపరంపరల్ మఘవదాశా భిత్తిఁ దీండ్రించుచున్
దళమై వెన్నెలచిచ్చు లంటిన మిళద్బాహ్యచ్ఛదశ్యామికా
చ్ఛలనన్ గంది ముడుంగుచో సిమసిమచ్ఛబ్దంబుతోఁ బుట్టు న
గ్గలపుం గ్రొంబొగలో యనంగ వెడలెన్ గర్భస్వనద్భృంగముల్".

పద్మము లింట ముడుచుకొనినవి. వరూధినీ హృదయకమలమును ముడుచుకొనినది. ఇప్పటి యవస్థలోఁ జంద్రిక, కమలములకును వరూధినీ హృదయకమలమునకుఁ గూడ శత్రువే. వరూధినీ హృదయావేదము పద్మముఖనిర్యద్భృంగనాదముచే సూచింపఁబడినది. పిదపఁ జంద్రుని గామోద్రేకమునకై యుపయోగింపఁబడు సిద్ధౌషధముతో సరిపోల్చి వరూధినీ హృదయాంతరాళమున నంతకంత కతిశయించు మదన సంతాపమును నిరూపించినాఁడు. మఱియు నక్కడక్కడ ననేకపద్యములలో నొక్కొక్క వాక్యములోనే, అప్పటి వరూధిని యవస్థను జిత్రించి, ప్రకృతియు నామెయెడ నెట్టి సానుభూతిని జూపుచున్నదో కవి మన కెఱుక పఱచినాఁడు చూడుఁడు. తృ. ఆ. ప. 12

... ... ... దిశాస్తోమంబు శోభా దరిద్రాణం బయ్యె,
సరోజషండములు నిద్రాణంబులయ్యెఁ గడున్.

దిక్కులకాంతి తఱిగిపోయినది. వరూధినీవదన శోభయుఁ దఱిగి పోయినది. సరోజషండములతోఁ బాటు వరూధినీహృదయ కమలమును ముకుళించుకొనిపోయినది. లేక వరూధినీ హృదయకమలము ముకుళింపఁగనే, సరోజషండ నిమీలన మను నెపమునఁ బ్రకృతి సానుభూతి చూపినది. ఇట్లే చంద్రాస్తమయమును గూడ వరూధిని విరహావస్థతో సరిపోల్చి పెద్దన వర్ణించినాఁడు.

"పాటనసేయుమీఁ గురులుపైఁ బడి శీర్ణపటీరపంక లా
లాటికమై దరస్మితవిలాసపుఁ జంద్రిక డొంకె వాడుటన్
దేటఁ దొలంగి విన్న నగు నీ మొగమో యన మాసి చంద్రుఁడో
పాటలగంధి వ్రాలె నదె భానుకుచిన్ దన కందు మీఱఁగన్.

వరూధినిముఖమునందు కురులు జాఱియున్నవి. చంద్రుని యందు కళంక మున్నది. భానురుచిచేఁ జంద్రుని కాంతి మాసిపోయినది. వరూధిని ముఖమునను జిరునవ్వను కాంతి యంతరించినది. అద్దపుబిళ్ళవలె నున్న చంద్రుఁడు మంచిగంధ మంటగట్టిన పాపట బొట్టువలె నున్న వరూధినిముఖముతో సరిపోల్పఁబడియున్నాఁడు. ఇట్లే పెద్దనార్యుని ప్రకృతివర్ణనలు పాత్రల యవస్థతో నైక్యమై యుండును గాని, వేని కవి విడివిడిగా నుండి కూర్పుబిగి సడలింపవు

పెద్దనార్యుఁడు పశుపక్ష్యాదుల యింగితము నెఱింగిన వారిలో మేటి. మానవస్వభావవర్ణనముకంటె పశుపక్ష్యాదుల స్వభావమును వర్ణించుట కష్టతరమై యుండును. ఇందులకు సూక్ష్మాతిసూక్ష్మమైన పరిశీలనయు, విపుల మగు లోకజ్ఞానమును, ప్రకృతితోడి నిరంతరపరిచయమును నావశ్యకములై యుండును. పెద్దనార్యుని యీ క్రింది పద్యములను బరిశీలించినవారికీ యంశము విశదము కాకపోదు.

“పలుకులు నేర్పువేళఁ గలభాషిణి నీ వెటు లుండఁ బంజరం
బుల నరగన్ను వెట్టి ముఖముల్ చరణాగ్రనఖాళిఁ గోఁకుచున్
నిలుగుచు నావులింపుచు వశీవిహగోత్కర మొల్లు వల్కు న
ప్పలుకులు యట్టు లెత్తి విని పల్కెడు వింటివె కీరశారికల్”.

“కోలకోలఁ గూయుఁ బై నొఱగుఁ గుత్తుకఁ గుత్తుక, జట్టుఁ బాఱుఁ జి
ల్వలక్రియఁ గానరాని గతులన్ మయిమైఁ బెనుచున్, జవించు న
స్రు లఱుత నొత్తు, సోలు నిలుచున్ విధిచాతురిఁ గూడియున్ రతిన్
దలఁపవు, కంటె పాసినవెతల్ దలఁపించుచుఁ గోకదంపతుల్”.

వరూధిని యొక తోటలోఁ బ్రవేశించినది. అందే యామె మాయాప్రవరుని జూచును. దానిని సూచించువాఁడు వోలె కవి యీ క్రింది పద్యమును వ్రాసినాఁడు.

"ఉరగఫూత్కారధూమోగ్రగంధముఁ బాసి
　　　　　పొలయుఁబో యీ తావి మలయపవనుఁ
డనలాస్త్రు పెడబొబ్బ నలమిన గలడిమ్ముఁ
　　　　　బాయుఁబో యీ తేంట్లపాట మరుఁడు
ఘర్మసామీప్యసంకలితదాహస్ఫూర్తి
　　　　　నాఁగుఁబో యీ నీడ నల్ల మధుఁడు
గరళసోదర్యాత్తకరసుధాకటుకత్వ
　　　　　ముడుపుఁబో యీ తేనె నోషధీశుఁ
డనఁగఁ జంపక కురవక పనస తిలక
నిచుల వంజుల దాడిమీ విచికిలామ్ర
పాటలీ పూగ కేసర ప్రిముఖతరుల
సొబగు మీఱు నుద్యానంబుఁ జొచ్చి యచట".

మలయపవనునకు, మదనునకు, మధునకు, విధునకుఁ గల లోప
ము లన్నియు నా యుద్యానవనమునందలి కమ్మనెత్తావివలనఁ దేటుల
ఝుంకారమువలన, నీడలవలనఁ దేనియలవలన నశించినవి. అట్టిచో
దనకుఁ గల లోపముకూడఁ దీఱదా యని వేల్పుజవరాలియాస. ఇట్లు
పెద్దనార్యుని వర్ణనలన్నియుఁ గథలో నైక్యమై యున్నవే కాని,యనావ
శ్యకముగా నదికి నట్లు లేవు. ప్రబంధమహాకవు లందఱు నిట్లే వర్ణించినారు.
కాని ప్రబంధకవిత్వమునకు నిశితపరిశీలన మవసరము. పైపై చూపుల
కయ్యది యందుబాటులో నుండదు. నిశితపరిశీలనము ప్రౌఢసాహిత్య
మును నుండీనగాని, దఱి జేరరాని కవులలో నొకఁడు రామరాజభూష
ణుఁడు. ఈతఁడును బహువర్ణనాప్రియుఁ డను మాట నిక్కువమే. ఈతని
వసుచరిత్రము నందలి కథావస్తు వత్యల్పమైనది. అత్యల్పమైన యా
యితివృత్తమును బెంచి ప్రౌఢప్రబంధముగా వ్రాసిన యి మ్మహాకవి
వర్ణనాప్రతిభకు లోక మచ్చెరు వందినది. మనోజ్ఞము లగు నీతని
వర్ణనములలో నొక్కటి ప్రథమాశ్వాసములోని చైత్రలక్ష్మీవర్ణనము.
అందు హృద్యము లగు పద్యముల నిటఁ బొందుపఱచుచున్నాను.

"ఒసర హిమావకుంఠనము లూడ్చి తెమల్చిన పత్త్రిభంగముల్
నన నసియాడుచుఁ గ్రొంగడచన్నులు పల్లవపాణిఁ గప్పి నూ
తన లతికాలతాంగుల నుదారగతిం జలి వాపి నెయ్యపుం
బెనకువ నేర్పె దక్షిణసమీరణుఁ డొయ్యనఁ దావు లంటుచున్".
"అలరుంగైదువుజోదు కూర్మినయిదోడై, మాధవ శ్రీతపః
ఫలమై యాడు మరుత్కుమారుఁ బ్రియ మొప్పం దేనె నీరార్చి పెం
దెలిపూజొంపపుఁబొత్తులం బొదివి ధాత్రీజాతముల్ జోలపా
డె లసత్పల్లవడోల నుంచి కలకంఠీనాద గీతంబులన్".
"అరిగాఁ బంచమ మేపగించి నవలా లవ్వేళ హిందోళ వై
ఖరి నూపం బికజాతి మాత్మరవభంగవ్యాకులంబై వనీ
ధర నాలంబిత పల్లవవ్రతవిధుల్ దాల్పం దదీయధ్వనిన్
సరిగాఁ గైకొనియెన్ వసంతము మహాసంపూర్ణ భావోన్నతిన్".
"చివురుంగైదువువేల్పు చైత్రమున నక్షీణధ్వజోత్క్షేప వై
భవుఁడై, తెమ్మెర తేరిపైఁ గదలి రాఁ బ్రత్యగ్ర సాలాగ్ర హ
ర్మ్యవిటంకంబులు ప్రాకి, వల్లి వనజాస్య ల్లల్లి రుత్ఫుల్ల ప
ల్లవహస్తంబుల భావిభావుకఫలోల్లాసంబుతోఁ గ్రొవ్విరుల్".

వసురాజు రథారూఢుఁడై యుద్యానవనమున కేఁగి యందు విహరించు నప్పుడు కవి గావించిన వర్ణనము మనోజ్ఞమును నదృష్టపూర్వమును నై యున్నది చూడుఁడు.

"నృపమాళిభవ సువర్ణ పరాగములు నువ
　　　　ర్ణపరాగములు నభిన్నత వహించెఁ
గమనీయ తపసీయ కదళికావనంబు
　　　　కదళికావనంబు కలసి మెలఁగె
లలితమాగధలోక కలకంఠ గానంబు
　　　　కలకంఠగానంబు నలమికొనియెఁ
దతవాదకసమీరహత కిన్నరీరుతుల్
　　　　కిన్నరీరుతులు నేకీభవించె

నపుడు నేరంగ వచ్చిన యువనిజాని
కవనిజానీక మచట సాష్టాంగ మెఱఁగెఁ
గేళివన బహిరంగణాక్షిణ మధుర
మధురస ఝురానుబింబ సంభావనమున''.

"ఘనతరఫలానతాఖండ కదళికలును
కీరరాజీ కృత సజీవ తోరణములుఁ
బొంగు నెలమావికురుజు లభంగ నవ ఫ
లావళులుఁ గాంచె నృపుఁడు వనాగ్రసీమ''.

ఈ పద్యములోఁ గవి, సహజములైన యలంకారములకును గృత్రిమము లైన యలంకారములకును సభిన్నసాజాత్యమును నిరూపించి యున్నాఁడు. తఱచుగా నగరాలంకారములయందు ఖండితకదళికలు, నిర్జీవము లగు చివురులతోరణములు, తెంపిన ఫలములును నుపయోగింతురు. ఇఁట నట్లుఁగాక సజీవము లగు ననఁటులే యున్నవి. బాఱులుగఁ దిరుగు చిలుకలగుంపులు సజీవతోరణములుగ నున్నవి. పక్షిచంచూహతులచే భిన్నములు గాక యభంగములై తమ నెలవులనే యున్న ఫలావళులు రాజునకు నేత్రోత్సవమును గలిగించినవి. ఇట్లే మనోహరములై యున్న మఱికొన్ని పద్యములు.

"అల చైత్రాంచితవత్త్రిశాలికల నిష్టాహారతృప్తిం గుతూ
హలము ల్గాంచు ద్విజావళుల్, శ్రుతిహితావ్యాజానులాపంబుతో
నలఘు శ్రీకరశాఖకాంచల వినిర్యత్కేసరార్ద్రాక్షతం
బులు రాల్చెన్ నరదేవరత్నముకుటీ భూషావిశేషంబుగన్.

"ఆదరణీయరామకథనాంక శుకోక్తులతోడఁ దీవ ము
త్తైదువచాలు, శోభనపు టారతు లెత్తె, పదాగతిం గిరి
క్షోదవినోదికిం, జిగురుజొంపపుఁ గెంపుల పళ్లెరంబులం
బోరిదిఁ దనర్చు నగ్గలపు మొగ్గలు ముత్తెపుముగ్గు లీనఁగన్''.

"అలరారఁ నెలతాలఁ గట్టిన మహీజావాలము ల్గొన్ని వ
త్ఫలసాంద్రంబులు గొన్ని, పల్లవరుచిప్రాగ్భారపట్టాంబరో
జ్జ్వలము ల్గొన్ని సమగ్రశారద రజోజాలంబులై మాధవుం
డులుపా నించిన కావ్యపాత్రికలు నా నొప్పెన్ నృపాగ్రంబునన్".

"జనపతి వారసిల్ల, నొక సంపఁగితావులకొమ్మ, రాగవ
ర్ధన సుమనోఽభిరామ యయి కాఁక వహింపఁగఁబోలు, గానిచో
ననుపమపంచసాయక కరాంచల చంచల చాపశింజినీ
జనితకఠోరఝంకృతులు సైఁపక యున్నె పరాగపాండువై".

"చిగురుకెంగేలు సాఁచె రసాలవల్లరి
తేఁటిమూఁపులఁ జూచెఁ దిలకలతిక
పిక గీతిఁ బాడి చూపెఁ బ్రియాళులత, పల్కెఁ
గీరభాషలఁ గర్ణికారశాఖ
ముఖరక్తి నింపె నింపు గల సంపఁగికొమ్మ
వన్నెగా నగియె లేఁబొన్నతీఁగె
సురభిశ్వాసనంబు నెరపె సింధుకివల్లి
కురిచ్చెఁ దావులు సోఁక గోవిరెమ్మ
యాత్మ రుచిరోపచారంబు లధిప కల్ప
కంబునకుఁ దత్తదామోదగరిమఁ జెనుప
నంగనానిత్యకలితదోహదవిశేష
సన్నుతాచారముల నడిపన్నకతన".

ఈ పద్యములలోఁ గవి జడప్రకృతిపై మానవత్వము నారోపించి వర్ణించియున్నాఁడు. ఈ పద్యములం దొక్కటొక్కటియే, కవిభావనాశక్తికిఁ బ్రబలనిదర్శనములై యున్నవి. సమ్మాననార్హము లగు శక్తులలో భావనాశక్తియు నొక్కటి యనుట కెట్టివారును సందేహింపరు. తద్విజృంభణ మీతని కవితావిలాసమునకు వన్నెపెట్టుచున్నది. సంస్కృతమున నిట్టి కవితాకృతులకు మార్గదర్శకుఁడు శ్రీహర్షుఁడు. నలుని యుద్యానవనవిహారసందర్భమున నాతఁ డిట్టి భావముల నెన్నియేనియు

బ్రదర్శించియున్నాఁడు. మఱియు విసువు గలిగించునంతగాఁ బెంచి వర్ణించుటయు శ్రీహర్షునకు మిక్కిలి యిష్టము. రామరాజభూషణుఁడు నైషధాదులయందు గురుభావము గలవాఁడగుటంజేసి, తచ్ఛాయ లీతని వర్ణనములందును గానవగును. అంతమాత్రమున నీ కవి స్వతంత్రుఁడు కాఁడని చెప్పఁజాలము.

మహాకవి ధూర్జటియుఁ దన కాళహస్తిమాహాత్మ్యమున యథోచితములును హృద్యములును నగు వర్ణనలనే చేసెను. ఇమ్మహాకవి బహువర్ణనాప్రియుఁడు గాకున్నను, జేసిన యా కొలఁది వర్ణనలైనను మిక్కిలి స్వతంత్రములుగా నున్నవి. వర్ణనలయందుఁగూడ నీతఁడు తనకు సహజమైన శివభక్తిని బ్రదర్శించియున్నాఁడు. కాళహస్తిమాహాత్మ్యమునందంతట శైవతేజము పొంగిపొఱలుచుండును. చంద్రోదయావసరమున నీ విశ్వమంతయు నిమ్మహాభక్తునకు శివార్చనముగా గోచరించినది. ఈ క్రింది పద్యమును బరిశీలింపుఁడు.

"ఉదయగ్రావము పానవట్ట మభిషేకోద ప్రవాహంబు వా
ర్ధి, ధరధ్వాంతము ధూపధూమము, జ్వలద్దీప ప్రభారాజి కా
ముది తారానివహంబు లర్పిత సుమంబుల్ గాఁ దమోదూర సౌ
ఖ్యదమై శీతగభస్తిబింబశివలింగంబొప్పెఁ బ్రాచీదిశన్".

ఈ పద్య మెట్టి సమయమున వ్రాయఁబడినదో చూడుఁడు. శివపూజావిధానవిషయమున హస్తికిని బాపతేనికిని భేదభావ మేర్పడినది. కాని యొకరినొక రెఱుఁగరు. ఒకరినొకరు నాశనముచేయ సన్నద్ధులై యుండిరి. ఆ యాతురతను గవియే యీ తీరునఁ జెప్పినాఁడు.

"ఎపుడు పడమటికొండపై నెక్కు భానుఁడెప్పు డుదయించు నే-
బోదు నెప్పు డనుచు" "అయ్యవసరంబున" అని కవిసూర్యాస్తమయ చంద్రోదయాదులను వర్ణించినాఁడు. ఈ వర్ణనలు కథాగతికిఁ బోషకములై యుండుటయేకాక, యందలి పాత్రల మనోవేదనా పటిమను గూడఁ బ్రత్యక్షము చేయుచున్నవి. సాధారణముగ సూర్యోదయమును జంద్రోదయమును నగుచున్నను మన మంతగా వానినిగూర్చి విచారిం

పము. కాని యేదేని యొక్క ముఖ్యమగు పని మనసులో నున్నచో వానిని బలుమాఱులు భావింతుము. అప్పుడు ప్రతినిమేషముఁ బ్రకృతిలో జరుగుచున్న మార్పు లన్నియు మనకుఁ బ్రత్యక్షములును, ననుభూతములును నగుచుండును. ఇచ్చటఁ గరికి సంప్రాప్తమైన కష్టము అనుభవైకవేద్యము. మఱియు మహాకవియు మహాభక్తుఁడు నగు ధూర్జటియే యద్దాని నూహింప సమర్థుఁడు. "వాఁడా, నేనా నొక జాడఁ బోయెదము లేదా జీవ మింకేటికి" అని హస్తి స్థిరనిశ్చయము చేసికొన్నది. హస్తియును నాగమును నిట్లు వేదనాపరితప్తములై యుండగాఁ గవి, సూర్యాస్తమయ చంద్రోదయాదులను వర్ణించుటలో, నాతనికిఁ గల భక్తిభావానుభవము వ్యక్తమగుచున్నది. మఱియు హస్తియుఁ గవియుఁగూడ మహాశైవులే. కావుననే చంద్రబింబ మిరువురకును నీశ్వరలింగముగాఁ గానవచ్చినది. పాము పాతాళమున వసించును గాన యిఁట హస్తిప్రశంస యొక్కటియే కవి చేసినాఁడు.

ఆటవిక జీవనమును వర్ణించుచో ధూర్జటి చూపిన నైపుణ్య మనన్యము. మహానగరములందు నివసించు నీతఁడీ యాటవిక జీవనము నింతటి సూక్ష్మాతి సూక్ష్మములైన వివరములతో నెట్లు వర్ణింపగలిగెనా యనునది యొక యాశ్చర్యకర మగు నంశము. కట్టుబట్టలు, తిను నాహారము, చేయుచేఁతలు, విందులు, వినోదములు, వేయేల, ఆ యాటవిక జీవితమునందలి యల్పాత్యల్ప విషయముకూడ ధూర్జటికవిచంద్రుని నిశితదృష్టి నాకర్షించియే యున్నది. ఆ వ్వనాటులకు ముత్తియములు సిరికాయల పాటియు, రేగుపండుల పాటియుఁగావు. గంధసారాగురు ద్రుమకాష్ఠ ఖండచయమును వంట కట్టియలుగా వారు వాడుదురు. సంకు మదమును, పునుఁగును, జాదును బంకము గావించి, ప్రత్యహమును వా రిండ్లలుకుదురు. ఇట్లు భోగభాగ్యములతోఁ దులతూగుచుండియు వారు కష్టజీవన మనిన జడియువారు కారు. పట్టుచీరలు కట్ట గల భాగ్యముండియు వారు పాఱుటాకులనే ధరింతురు. రాజాన్నభోజనములు గలిగియు, వన్యధాన్యముల కీసడించుకొనరు. మాణిక్యభూషలు గలిగి

యున్నను గురువింద పేరు వారికిఁ బ్రీతిదాయకములు. ఎంత సంపద కల్గినను వారు తమ కులాగతధర్మకర్మములను మాత్రము విడువరు. ఈ వర్ణనములో ధూర్జటి, కృత్రిమ మగు నాగరక జీవనమునకును, సహజమగు నాటవిక జీవనమునకును గల తారతమ్యమును నిరూపించినాఁడు. ఆటవికులకు కృత్రిమము లగు వస్తువులకంటెఁ బ్రకృతిసిద్ధము లగు వస్తువులే గణనీయములు. అగురువృక్షఖండములతో వెఱబొమ్మలుచేసి, మృగనాభితో వానికి మసిబూసి, చామరమును వానికి ధమ్మిల్లముగాఁ జుట్టి, యేనుఁగు కుంభములలోని ముత్యములతో వానికి గనుగ్రుడ్డులు చేసి, యాటవికులు తమ చేలు కాపు కాయుదురు. భిల్లవిభుహాళ్ళు లాత్మనాయకులఁగూడి యడవిలో వేట లాడుదురు. కఱకుజుంజుఱువెండ్రుకల గాఢముగా నెమలిపింఛముతో బంధించుట, పునుఁగుమాని, లలాటమున జేగురుబొట్టుపెట్టుట, పాఱుటాకులతోఁ గూర్చిన పైఁటఁదీర్చుట, జమలి యొడ్డాణంబునందునఁ బర్ణాంబరమును బదిలపఱచుట, కుఱుచగనుపుల వెదురువింటఁ జాఁగపుఱిఁ దాల్చి నారిగా సంతరించుట మున్నగు చెంచెతల వేటవెసలు సింగారములు కవి మనకు దీఱ వర్ణించినాఁడు.

ప్రకృతి పరిశీలనావిషయమునను ధూర్జటి తన ప్రావీణ్యమును జూపియున్నాఁడు. ఈ క్రింది పద్యమును జూడుఁడు.

"ప్రాతఃకాలతుషారశీకరచయప్రాప్తిన్, లసన్మౌక్తికో
పేతాగారము లట్లు, చెల్వెసఁగు తద్బిందుచ్ఛటాజాతఖ
ద్యోతచ్ఛాయలఁ గొంతసేపు, బహురత్నోదీర్ణగేహంబులై
లూతాకల్పిత తంతుసద్మములు పొల్పుం జెప్పఁ జిత్రింబులై".

శిల్పకళాప్రావీణ్యము మెఱయఁ జెలఁదిపురుగు శివలింగముపైఁ బట్టు వెట్టినది. ఆ పట్టుపై తేయి మంచు గుఱిసి బిందువు లేర్పడినవి. ఆ బిందువులపై సూర్యకిరణప్రసారము గల్గుటచే నది ముక్తాగారము లట్లును, నవరత్నఖచిత గృహంబు లట్లు భాసిల్లినది.

తిన్ననికథలో నిమ్మహాకవి చేసిన పానకేళివర్ణనమును బరిశీలించినవారికి, మదిరాపానము చేయుచు ననాగరికులు చేయు దుశ్చేష్ట

లన్నియు మనోనయనగోచరములు కాకపోవు. ఈ క్రింది పద్య మెంత స్వభావసిద్ధముగ నున్నదో చూడుఁడు.

"మాటలాడఁ దలంచి మఱచిపోయెడువారు
నడవఁబోవుచుఁ దొట్రుపడెడువారు
నూరకుండెద మని యుండనోపనివారు
లేచెద మని లేవలేనివారుఁ
బనిలేని పని బట్టబయలు దిట్టెడువారుఁ
బాడ నేరకయును బాడువారు
నెదురైన వారికి నెల్ల మ్రొక్కెడువారుఁ
వ్రీడావిహీనులై యాడువారుఁ
జాలఁ ద్రావియు మగుడఁ జేసాఁచువారుఁ
దోడరి యుపదంశభాండము ద్రోడుకువారు
నైరి మృగయాధిదైవతయాత్రయందుఁ
బానములుచేసి శబరదంపతులు రతుల".

ఈతఁడు వర్ణించిన దుర్భిక్షవర్ణనమును జదివినచో, మహాకవియై రాజాధిరాజులచే సమాన సన్మానములఁ గనుచున్న యీ భాగ్యశాలికి, దుర్భిక్షమువలనఁ గలుగు బాధ లెట్లవగతము లయ్యెనా యను నాశ్చర్యము కలుగక దప్పదు. మచ్చునకొక పద్యము.

"త్రోలుమ నెమ్ములు న్నిగిలి, ద్రోసినఁ దొంబదిచోట్లఁ గూలువా
రాలిని బిడ్డల న్విడిచి యాఁకటిచిచ్చున వెచ్చపోవువా,
రేలికబంటు వాసి యొక యించుక లేక కృశించువారునై
తూలె జనంబు, మీానశనిదోషము దాఁకి నిరస్తసస్యమై".

ధూర్జటి కాళహస్తిమాహాత్మ్యమును వ్రాసి నట్లుగనే, తెనాలి రామకృష్ణుఁడు పాండురంగమాహాత్మ్యమును వ్రాసినాఁడు. ఈతఁడును వర్ణనాప్రియుఁడుగా కున్నను, చేసినవర్ణనలుమాత్రము,రసవంతములును నూతనములై యున్నవి. అవకాశము కలిగి నపు డెల్ల నతిమనోహరము లగు ప్రకృతివర్ణనల నీతఁడు చేసినాఁడు. అవియుఁ గథాగతితోఁ బొంది పొసఁగి యున్నది. అగస్త్యుఁడు దక్షిణాపథమున కేతెంచునపుడు నీతఁడు చేసిన మధ్యాహ్నవర్ణనము,మనోహరమై యున్నది. (సశేషము)

"పద్మినీ ప బ్జ్యాతపత్రంబు శిథిలప
త్త్రాగ్రమై రాయంచ యాశ్రయించెఁ
దాలు స్రవ త్ఫేన జాలంబుతో ఘోణి
పంచల రొంపి గలంచి యాడె
దూరోద్గమద్దావధూమ శంబుదబుద్ధి
నెమ్మి లో పొదనుండి నిక్కి చూచె
జఠరస్థజలము నాసానాళమునఁ బీల్చి
సామజం బిరుప్రక్కఁ జల్లుకొనియె
గీ. సరసిపై నీరు సలసల దెరలె, విపిన
సకలవీథులు నిర్మృగోచ్ఛ్రయము లయ్యె
మట్ట మధ్యాహ్న మిది సుధామధురవాణి
యర్హ మిచ్చోఁ బథశ్రమ మపనయింప".

"ఇవె యూపవృతశాఖు లివె లూనముఖదర్భ
సందర్భ వేశంత సైకతములు."

మాల్యవంతముపై నెక్కి యనతి దూరమున నున్న పంపా సరోవర ప్రాంతమును (హంపీక్షేత్రమును) బరిశీలించితి మేని నేఁడును నిట్టి దృశ్యమే పొడగట్టును. అగస్త్యుఁ డేతెంచు సరి కట రాజ్యస్థాపనయే లేదుకదా ! ఇఁక రామకృష్ణుని కాలమునకు విజయనగర సామ్రాజ్యము మహోచ్ఛ్రదశయం దున్నది. అట్టిచో నేఁడు గనుపట్టు నీ దృశ్యమును రామకృష్ణుఁ డా నాఁ డెట్లు చూడఁగలిగెనా యను నది వింతలలో వింత. రవి గాననిచోఁ గవి గాంచుట యిట యథార్థ మయ్యె నన వచ్చును.

చతుర్థాశ్వాసమున రాధా తప స్సందర్భమున రామకృష్ణుఁ డాఱు ఋతువులను వర్ణించి యున్నాఁడు. ఇం దొక పద్యమునఁ దపోనిమగ్న యగు రాధను వర్ణించియు నిం కొక పద్యమున సంసార మగ్నమై యున్న లోకమును వర్ణించియు నిట రామకృష్ణుఁడు ప్రకృతికిని బాత్రములకును గల సంబంధమునే కాక ప్రకృతికిని లోకమునకును గల సంబంధమును గూడ నిరూపించి యున్నాఁడు.

ఈ క్రింది పద్యములను దిలకింపుఁడు.

గీ. "పారదంబునఁ దోఁచిన పసిఁడి తీఁగ
పగిది రాజిల్లె రాధ చంపక సువర్ణ
వర్ణ మగు మేను కుముదధవళతుషార
పటలకంచుకవేల్లనఘటన కలిమి."

ఇది రాధావర్ణనము. ఇఁక లోకమును గూర్చి,

గీ. నవ్య కాలాగరూద్వర్తనముల సతుల
చన్నుఁగొండల నుష్ణాగ్ని సంభవించె
మతిసమగ్రులు ధూమానుమాన కలన
నగ్ని సాధింతు రచలంబు లందు నెపుడు''.

ఈ పద్యములోఁ దర్కమును గూడఁ జొనిపినాఁడు.

గీ. "సురలు కళ లెల్లఁ గ్రోలిన సోము తనువు
కప్పురము గుమ్మరించిన గసక ద్రోవి
పువ్వుఁదేనియ చవిన యంభోరుహంబొ
యనఁగ మం చింకి బ్రహ్మాండ మగలెఁ జలిని."

క. "అగలుం గుంకుమపువ్వును
దొగరుం జేలలును సీతుఁ ద్రోవం గలవే
పొగ లేని ముర్మురంబులు
మగువల పాలిండ్లు భోగ మహనీయంబుల్."

మరల రాధ !

క. "పై నిగుడు మంచు తువ్వర
వానలచేఁ దడిసి కమలవనలక్ష్మి హరి
ధ్యాననిమీలితలోచన
యా నల రాధావధూటి కనుగల మయ్యెన్''

మరలఁ బ్రకృతి.

గీ. ''కాలుఁ గాలును గేలును గేలు మోవి
మోవియును జార్చి భోగినమూహా మమరె

నూహ సేయంగ భోగి సమూహమునకుఁ
బొసఁగ మనకంపుఁ బెనఁకువ లెనఁగుఁ గాదె".

క. "శ్యామలకాలాగురునవ
ధూమము మెదకు సుఖ మొనర్పఁ దోరపుఁ గన్నులీ
వే మొగుచు కరణి సౌధ
స్తోమ మమరెఁ గప్పఁ బడిన సోరణగండ్లన్ !

రాఘవయు మధులక్ష్మియు,

ఉ. కెంజిగురాకు డాలు దులకించిన ధాతుపటంబు చాయఁ జే
యం జడి కెక్కు పుష్పదుల నంటిన తేటులు భూతిభృజ్జటా
పుంజముఁ బోలఁగా విపిన భూములలో మధులక్ష్మి పొల్చె నీ
లాంజనవర్ణుఁ గోరి గప మల్లొనరించు మృగాక్షి కై వడిన్.

ఇట్లే ఆఱు ఋతువులయందును వర్ణించియున్నాఁడు

ధూర్జటికి విశ్వమంతేయుఁ జిందోదయావసరము శివార్చన
ముగాఁ గాన వచ్చి నట్లు, రామకృష్ణునకు వర్ష ఋతువున నీ విశ్వ మం
తేయుఁ గృష్ణమయముగా గోచరించినది.

"ఇంద్రచాపంబు గా దిది మౌళితలమున
నవరించుబర్హి పింఛంబు గాని
భీమరఘోషంబు గా దిది పాంచజన్య సం
జాతగంభీర ఘోషంబు గాని
యాశ్రయించిన బలాకావళి గా దిది
హారి ముక్తాహార యష్టి గాని
యిది గోల మెఱుఁగు గా దుదిది బంగారంపుఁ
బసిమి గ్రమ్మెడు పచ్చ పట్టు గాని
వృష్టి గా దిది కరుణాంబు వృష్టి గాని
నీలమేఘంబు గా దిది నీల వర్ణుఁ
డౌర! నా ప్రోలఁ బ్రత్యక్ష మయ్యె ననుచు
హర్ష పులకిత తను వయ్యె నవ్వధూటి"

వర్ణనా విషయమున ముక్కు తిమ్మన యింకొక నూతన మార్గము ద్రొక్కినాఁడు. సాధారణముగాఁ గవులకుఁ బ్రబంధ ప్రారంభము ననే పుర వర్ణనాదులను గావించుట యలవాటు. కాని తిమ్మన యట్లు గావింపక ప్రథమాశ్వాస మంతయుఁ బాత్ర స్వభావోన్మీలనమునందే గడిపినాఁడు. ప్రథమాశ్వాసమునఁ బుర వర్ణనాదుల ప్రసక్తి గల్గియు వీడినాఁడు. ఇఁక ద్వితీయాశ్వాస మంతయు వర్ణనాగర్భితము. ఇవి యైనను నతి సంగ్రహముగాఁ జేయఁబడి యున్నవి. ఇందు వర్ణింపఁబడిన రాజోపచారాదు లన్నియు నానాఁడు రాజుల యంతఃపురములందు జరుగునవియే యై యున్నవి. ద్వితీయాశ్వాసము నందలి యంధకార నక్షత్ర చంద్ర చకోరాది వర్ణనములును, తృతీయాశ్వాసము నందలి నందనోద్యానాది వర్ణనములును, జతుర్థాశ్వాసము నందలి మధ్యాహ్న జలకేళి వర్ణనములును, బంచమాశ్వాసము నందలి యుద్ధాది వర్ణనములును బ్రకరణానుకూలముగ మనోహరముగఁ గావింపఁబడి యున్నవి.

ఇఁకఁ బ్రబంధ కవులలోఁ గేవలవర్ణనాప్రియు లగు కవులును గలరు. అట్టి వారిలో సంకుసాల నృసింహకవి యొక్కఁడు. ఈతని గ్రంథమునందుఁ (కవికర్ణరసాయనము) మనోజ్ఞము లగు వర్ణన లనేకములు కలవు. ఇమ్మహాకవి కావ్యముఖమున గావించిన ప్రతిజ్ఞను జూడుఁడు.

"పరభుక్తము లైన యలం
కరణముల జుగుప్స లేక కైకొని పదవి
స్ఫురణంబు చూపు కుకవిత
పరికింపఁగ లజ్జ లేని బానిస గాదే".

ఈ ప్రతిజ్ఞ నీతఁ డెంత వఱకు నిర్వహించు కొనఁ గలిగినాఁడను నది యొక పెద్ద సమస్య. సామాన్యముగ నిట్టి ప్రతిజ్ఞలను గావ్యములం దాద్యంతమును నిర్వహించుట కష్టతరము. ఉపయోగించిన యలంకారము లన్నియు స్వకపోల కల్పితములే యగుట సామాన్యముగ సంభవింపదు. ఈతఁడు చాల వఱకుఁ దన ప్రతిజ్ఞను సాధింపఁ గలిగినాఁడ నియే చెప్పవచ్చును. ఈతని పదసామగ్రి యెట్టి దైనను నభిప్రాయములు

మాత్రము నూతనము లనియే చెప్ప నొప్పును. ఈతని రెండవప్రతిజ్ఞ యగు,

"యతి విటుఁడు గాక పోవు టెట్లస్మదీయ
కావ్య శృంగార వర్ణ నాకర్ణనమున
విటుఁడు యతి గాక పో రాదు వెస మదీయ
కావ్య వైరాగ్య వర్ణ నాకర్ణనమున"

అను దాని యందుఁ గూడఁ దన కావ్యము నందలి వర్ణనా ప్రాధాన్యమునే వక్కాణించి యున్నాఁడు.

ఈతని వలెఁ బంచేంద్రియ తర్పణము గావించు వర్ణనలఁ జేసిన యాంధ్రకవి యింకొకఁడు లేఁడు. ఈతని వర్ణనలలో నొక చైతన్య విశేషము కలదు. ఈతనికిఁ బ్రకృతి వివిధరూపముల సాక్షాత్కరించినది. ఒకప్పుడు రోషకషాయితాక్షి యగు ఖండితనాయికారూపమున, నింకొక తఱి బలాకకపాలమాలికాధారిణి యగు కాళికవిధమున, నింకొక తఱి నొక భిషగ్వర రూపమున నిట్లు బహు రూపములఁ బ్రకృతి యీతనికిఁ బ్రత్యక్ష మైనది. సకల సుఖ కారి యగు వసంతాగమము పాంథ లోకమున కెట్లు మహా ప్రలయ సదృశ మైనదో కవి యీ క్రింది పద్యమున వర్ణించినాఁడు.

శీల వెన్నెలలు పండ్రెండు సూర్యులు చూపు
బీ టెండ లై కాసి నీరసింప
దక్షిణానిలము లుద్ధతి నేడు తేఁటగుల
బెరిగెడు గాడ్పు లై పెల్లగింపఁ
గెంజాయ దిక్కులఁ బింజించు చిగురులు
కాలానలార్చు లై కాఁకఁ బెనుప
నలి శుక పిక గర్జ లడరఁ బూఁ దేనియ
ఘోరాంత్య వృష్టి యై కురిసి కలప
విరహ వేదన లెనఁగి యుద్వేల గతుల
నద్భుతముగ నేకార్ణవ మగుచు ముంప
సకల సుఖకారి యగు వసంతాగమంబు
పథిక లోకంబునకు మహా ప్రళయ మయ్యె

ఈతఁ డొక పద్యమున నతి చమత్కారముగా వసంతర్తువు నందే సకల ఋతు సంపదను వర్ణించి యున్నాఁడు.

ప్రసవ శర ప్రతాప శిఖిఁ బర్వఁగఁ జేయుటచే నిదాఘమై
కుసుమ రసాతి వర్షమునఁ గ్రుక్కుకొటఁ బయోదకాలమై
రసిక మనోంబుజంబు లలరంగ శరత్తయి తాన శైశిరో
ల్లసనముఁ జూపి పాంథ సతులన్ వణకించె వసంత మత్తఱిన్"

పూర్వ కవులు వాడిన పదసామగ్రినే కైకొని యతఁడు నూతనము లగు వర్ణనలఁ గావించి యున్నాఁడు. కటికి చీకటిని మషీరస నవాంజ నాదులతో సరిపోల్చుట యశ్రుతపూర్వము గాదు. కాని యీ క్రింది పద్యమును బరిశీలించిన వారికి నరసింహకవికల్పనానైపుణ్యము గోచరించును.

కరఁచి చిప్పలఁ బట్టు కత లెఱుంగము గాక
వ్రాయంగ నిది మషీ రసము గాదె
యిది గుళంబులు సేయు నిర వెఱుంగము గాక
నీలాల సరులుగా నింప రాదె
కరవటంబులఁ బెట్టు వెర వెఱుంగము గాక
వనితల కిది నవాంజనము గాదె
కడవలఁ గొని ముంచు గతి యెఱుంగము గాక
చేలల కిది మంచి నీలి గాదె

పోవఁడే నిది రవి నైనఁ బొడువుఁ గాదె
యంక మను పేర నురముపై నచ్చు దాల్చుఁ
గాక శశి నైన దిగ మ్రింగుఁ గాదె ? యనఁగఁ
బ్రబల మై గాఢతమ తమః పటలి పర్వె.

వర్ణనౌచిత్యమునకును బింగళి సూరనార్యుని జెప్పి మఱియొక యాంధ్ర కవిని జేర్కొనవలయును. ఈతఁడు ప్రార్థనలకై చేయు వర్ణనలయందు గూడఁ గథా గతిని సూచించునే యుండును. చూడుఁడు. కళా. పూ. పీఠిక.

అనయము ప్రేమ నంధిలఁగ నాస్య చతుష్టయ యోగ పద్య చుం
బన ఘన కాంక్షఁ బోలె నిగమంబుల పేరిట నాల్గు రూపులం
దనరెడు భార్య మాట జవదాఁటక వృష్టి యొనర్చు వారిజా
సనుఁడు నృసింహ కృష్ణ విభుఁ జాలఁ జిరాయువుఁ జేయుఁ గావుతన్.

ఇందు సరస్వతీ చతుర్ముఖుల పరిణయ లీల సూచింపఁ బడినది. చూడుఁడు. పంచ. ఆ. ప. 26

"వదనములు నాలుగింటికి వరుస గలియ
మెలపులోఁ దన కంఠంబు మలఁచి మలఁచి
యొనఁగెఁ దదధర పాన మహోత్సవంబు
గళము కౌఁగిలితోన చెక్కులు నిముకుచు"

ఇట్లే చతుర్థాశ్వాసమునఁ జేసిన సముద్ర వర్ణనము నందును గథా గతిని సూచించి యున్నాఁడు.

"ఉగ్ర తిమి శిరో రంధ్ర నిష్ఠ్యూతి మగుచు
నెగయు సలిలౌఘ మది యెందు మిగుల నొప్పె
నబ్ధి పేరిటి కుండలి తాంగ భోగి
యుమ్ము రనఁ దన పడగెత్తెనో యనంగ"

తిమి శిరో రంధ్ర నిష్ఠ్యూతి మైన వారి ధార నెంత చమత్కారముగాఁ గథలో నిమిడ్చినాఁడో చూడుఁడు. నిరతాన్నదానవ్రతము నకై యజ్ఞశర్మ తన భార్యల బేహారికి నమ్మెను. అమ్మెను గాని యనంతర మార్తధ్వని గావించెను. ఆ ధ్వనిని విని యాతని భార్యలు నలువురును సముద్రమున నురికిరి. అట్లురికిన యు వ్వనితలు బలు మీనొక్కటి నోర సలిలం బెగఁ ద్రోలుచుండఁ ద ద్వదనములోని కా సలిల పూరము వెంట నేగిరి. అనంతర మది మరల తన శిరో రంధ్రము ద్వారా నీటిని పై కెగఁ జిమ్ము నపుడు, వారును బై కెగసి యొక దివ్య విమానముపైఁ బడిరి. మీఁది వర్ణనములో నీ కథ యెంత చమత్కారముగా సూచింపఁ బడినదో చూడుఁడు. సూరనార్యుని వర్ణనల యందలి యంతరార్థములను జూపుచు శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రిల వా

రొక విపుల వ్యాసమును వ్రాసిరి. అం దీ విషయములు విపులముగాఁ జర్చింపఁ బడి యున్నవి.

సూరనార్యుని గ్రంథములను సామాన్యముగఁ జదువుకొని పోవు వారికి నాతని వర్ణనలలోని యంతరార్థము గోచరింపదు. ఇందులకు నిశిత మైన పరిశీలన మత్యావశ్యకము. ఈతని రూప చిత్రణమునం దొక విశిష్టత కలదు. "ప్రతియోగ సంఘటనముచే (By creating the contrast) నీతఁడు రూపమును భాసింపఁజేయును. వృద్ధురా లగు సుముఖాసత్తి రూప మొక పద్యమునను, బున ర్యౌవన ప్రాప్త యైన యామె రూప మిం కొక పద్యమునను, అలంకృత యగు సుగాత్రి రూప మొక పద్యమునను, నిరలంకృత యగు నామె రూప మిం కొక పద్యమునను, మణిస్తంభునిచేఁ జిక్కి చకిత యై యున్న కలభాషిణీ రూప మొక పద్యమునను, ఆతనిచేఁ జాఱపడి నప్పటి యామె రూప మిం కొక పద్యమునను,—ఈ విధముగ నవస్థా భేదములను బట్టి యా యా రూపములందుఁ గలుగు మార్పులను గడు నిపుణముగా నీతఁడు చిత్రింపఁ గలఁడు" ఉదాహరణమునకై కొన్ని పద్యములు—వృద్ధ యగు సుగాత్రి రూపము :

పసిమి పో నెండిన కసవు బుట్టయుఁ బోలె
నర వెండ్రుకలు బర్వ్వ శిరము వలన
నులి గొన్న చెలఁది పుర్వుల నూలి వళ్లు నా
నమరెడు ముడుత కన్బొమల వలనఁ
గషఁ జిట్లి నట్టి బంగరు పూఁత పొక్కిళ్ల
వడువు చూపెడి మేని వళుల వలనఁ
దనిసి వ్రేలెడు వ్రాఁకు తొనుకలఁ దలపించు
బాహు వక్షోజ లంబనము వలన
ఘూక రవముల చాడ్పున ఘోర వృత్తిఁ
దనరు ఘనకాస కుహి కుహి ధ్వనుల వలన
భావజుఁడు వెళ్లి పోయిన పాడుమేడ
పగిదిఁ గాన్పించు ముసలి పడఁతి యొకతె.

## ప్రబంధనలు—వర్ణనలు

పునర్యౌవన ప్రాప్తి.

నిండు చందురు నవ్వు నెమ్మోము సిరి తోడ
 నిరులు గ్రమ్మెడు వేణిభరము తోడ
నాకర్ణ లోలంబు లగు నేత్రముల తోడఁ
 దళుకొత్తు చెక్కుటద్దముల తోడ
మిగుల మిటారించు బిగి చనుంగవ తోడ
 లలితంపు బాహావల్లరుల తోడ
నతి కృశత్వమున జవ్వాడు మధ్యము తోడ
 నభినవం బైన నూఁగారు తోడ
నలువ మీఁదికిఁ దోలెడు సువర్ణ పులిన
గురు నితంబ ప్రభా పరంపరల తోడ
మహిత సర్వాంగ లావణ్య మహిమతోడ
సమరు ప్రాయంపు రూపు చిత్రముగఁ దాల్చె.

ఇట్లు స్థాణు రూపమును వర్ణించుటయే కాక, చల ద్రూపమును ప్ర
త్యక్షము చేయఁ గల శక్తియు సూరనార్యునకుఁ గలదు. ప్రద్యుమ్ను
వాహ్యాళిలో నాతఁడు వర్ణించిన తురగవర్ణన మింకుల కొక ప్ర
దృష్టాంతము.

తొలుదొల్త నయ్యేక తురగంబు మండల
 గతిచారి యగుచు నిక్కంబు తోఁచె
నా వెనుకను సరూపాశ్వాలి చెదరక
 చక్రాకృతిని బర్వు సరణి తోఁచె
నంతట ననతి స్ఫుటావయవంబుగా
 నెనసి యేకాంగ వేష్టనత తోఁచెఁ
దుదఁ దద్విభూషణ ద్యుతి రాజి మాత్రంబు
 కొఱవి త్రిప్పిన రీతి మెఱసి తోఁచె

సంత సంతకు గతి వేగ మగ్గలింప
రాఁగ వాఁగె యెచ్చరిక పరాకు జియ్య
యను జనులు శిచ్చవడి తమ పని మఱవఁగఁ
బరగు నమ్మేటి నెఱరాతు ప్రౌఢి కతన.

ఆంధ్ర మహా ప్రబంధములలోఁ గొన్నిఁటిని మాత్రమే యిఁట నుదాహరించి యున్నాను. ప్రబంధముల నన్నిఁటిని నుదాహరించుట యతి విస్తర మగుటయే కాక యనావశ్యకముఁగూడ నగును. క్షీణ యుగము నందలి యే కొలఁది మంది కవులలోఁ దప్ప తక్కిన యాంధ్ర ప్రబంధ కర్త లందఱును నౌచిత్యమును బాటించియే వర్ణనల గావించి యున్నారు. కాని మన మా గ్రంథములను బఠించు నప్పు డా గ్రంథములు పుట్టిన కాలమును దేశమును బరిస్థితులను మఱువరాదు. కొన్ని కొన్ని యెడల వా రతి మాత్రముగ వర్ణించిన విషయములు మన కీ నాఁడు విసువు గలిగించునవి యై యుండును. అట్టి దానికిఁ గారణము దేశ కాల పరిస్థితుల యందలి మార్పే. మఱియు, నాయా కవుల వ్యక్తి స్వాతంత్ర్యములను బట్టియు నభిరుచులను బట్టియుఁ గూడఁ గవితా రీతులు మాఱుచుండును. కృష్ణరాయని యాముక్తమాల్యద యందన్నియు వర్ణనలే. పెద్దన వేశ్యా వర్ణనము నొకటి రెండు గీత పాదములలో ముగింపగా, నీ రసికుని వేశ్యా వర్ణనమే రెండు సీసపద్యములను మ్రింగినది. ఇది కవుల యభిరుచి భేదములకు నిదర్శనము. ప్రబంధ వర్ణనల యందలి రసౌచిత్యమును గ్రహింప వలయు నన్న నా గ్రంథముల నామూలాగ్రముగఁ బఠించుటయే యుత్తమమార్గము.

# వ్యక్తివివేకము.

భాగవతుల కుటుంబరాయశాస్త్రి, ఎం. ఏ.

ఈ పైవిషయమున గమ్యగమకములు సత్యములా? అసత్యములా? యను విచారణము. సహృదయు లగువారికి నిరుపయోగమైనది. అటులే కావ్యవిషయమునఁ గూడ వాచ్యవ్యంగ్యముల విషయమైన సత్యాసత్యత్వవిచారము నిరుపయోగమే యగుట ప్రమాణాన్తర పరీక్ష కేవల ముపహాసముకొఱకే యగును.

లోకమునం దకృత్రిమము లగు హేతువులనుండి, యకృత్రిమము లగు విషయములే ప్రతీయమానము లగును. అచటఁ బ్రతీయమానము లగు విషయములు కేవల మనుమేయములే యగును. వానియందు వ్యంగ్యత్వగంధము గూడ లేదు. కావ్యమునందు వ్యంగ్యత్వ ముండును. ఇదియే లోకమునందుకంటె కావ్యమునందుఁ గల విశేషము. అందుచే రత్యాదులు గమ్యము లగు నప్పు డవి వ్యంగ్యము లని యుపచారము (లక్షణావృత్తిని) నాశ్రయించి చెప్పుచున్నాము. ఇచట లక్షణను జెప్పుటవలనఁ బ్రయోజనము సుఖాస్వాదమే. ఇట్లు గమ్యము లగు రత్యాదులయందు వ్యంగ్యత్వోపచారము యుక్తియుక్తమే యగుచున్నది. ముఖ్యవృత్తి నాశ్రయించి యర్థ మనునది రెండు విధములుగనే యుండును. వాచ్యార్థము, గమ్యార్థము. ఉపచారమువలన వ్యంగ్యార్థ మనునది మూఁడవది గూడ నొకటి యున్న దని యిప్పటికిఁ దేలినది. ఇప్పటికిఁ దేలిన విషయము నంతను నీ సంగ్రహ శ్లోకము దెల్పును.

"వాచో గుణీకృతార్థత్వం న సంభవతి జాతుచిత్
తదర్థం తదుపాదానాత్ ఉదకార్థం దృతేరివ"

[తా॥ నీటినిఁ దెచ్చుటకై యుపయోగించు ఘటము నీటిని తన కుపసర్జనముగఁ జేసికొనదు. అటులే యర్థముఁ దెలుపుటకై ప్రయుక్త మగు శబ్ద మెప్పుడును దన యర్థము నుపసర్జనముగఁ జేసికొనదు]

వాచ్యప్రతీయమానార్థములకు ముఖ్యవృత్తి నాశ్రయించి వ్యంగ్యవ్యంజక భావము సంభవము కాదు "అభివ్యక్తి" యనుదానికి లక్షణము

కుకుర కుండుటచే, వాచ్యార్థమునకును, ప్రతీయమానార్థమునకును ముఖ్య వృత్తి నాశ్రయించియే వ్యంగ్యవ్యంజక భావ మున్నదనుట పొసఁగదు.

అభివ్యక్తియొక్క లక్షణము నిట్లు తెల్పుచున్నారు.

"సతోఽసత ఏవ వార్థస్య ప్రకాశమానస్య సమ్బన్ధస్మరణాన
పేక్షిణా ప్రకాశకేన సహైవ ప్రకాశవిషయతాపత్తిరభివ్యక్తిః"

ఒక యర్థము(లేక విషయము) సత్యమైనది కావచ్చును. అసత్యమైనది కావచ్చును. ఆ యర్థమును ప్రకాశింపఁజేయు (తెలియఁజేయు) శబ్దమునకును (వస్తువునకును) నా యర్థమునకునుఁ గల సంబంధ స్మరణముతో నిమిత్తము లేకయే, ప్రకాశక మగు శబ్దముతోనే ప్రకాశ్య మగు వస్తువుగూడ నెచట భాసించునో యచట నభివ్యక్తి యున్న దనుచున్నాము. అనఁగా నే క్షణమునఁ బ్రకాశక మగు వస్తువుయొక్క జ్ఞానము గల్గునో, యా క్షణముననే ప్రకాశ్య వస్తుజ్ఞానముగూడఁ గలుగునో నపుడచట నభివ్యక్తి యున్న దనుచున్నాము.

అందు, సద్భూతమైన (సత్యమైన) వస్తువుయొక్క యభివ్యక్తి మూఁడు విధములుగ నుండును 1. కారణమునందు కార్యము నిలీనమై కేవలము శక్తిరూపమున నం దుండును. అట్టి కార్యము మన కింద్రియ గోచర మగునట్లు ప్రత్యక్ష మగుట యొక విధ మగు నభివ్యక్తి యగును. క్షీరదధిసంబంధ మట్టిది. క్షీరావస్థయందు పెరుగా క్షీరమునందు నిలీనమై శక్తిరూపమున నున్నఁ దనియుఁ దరువాత నది దధిరూపముగ మనకు గోచరించిన దనియును తెలియవలెను. కార్యమే, కార్యమును బుట్టించు శక్తి రూపమునఁ గారణమునందుండి యావిర్భవించు నని తెలియుని కొందఱీ యావిర్భావమునే యుత్పత్తి యనుచున్నారు. (2) ఆవిర్భవించియు నేదేని ప్రతిబన్ధమువలన భాసింపకయే యుండు ఘటాదివస్తువులు ప్రకాశకమగు దీపము మొదలగు వానితో నేకక్షణముననే ప్రకాశించుట రెండవ విధమగు నభివ్యక్తి యగును. ఇచటఁ బ్రకాశకము, ప్రకాశ్యమున కుపసర్జన మగును. దీపముచే ఘటము ప్రకాశించుట యిందుల కుదాహరణము. ఈ విషయమునే యీ శ్లోకము తెల్పుచున్నది.

• "స్వజ్ఞానేనాన్యధీహేతుః సిద్ధేఽర్థే వ్యంజకో మతః
యథా దీపోఽన్యథా భావే కో విశేషోఽస్య కారకాత్"

ఘటము మొదలగు వస్తువులు స్వరూపసిద్ధిఁ బొంది యున్నపుడు, తన విషయమైన జ్ఞానముతోనే, యేవస్తువు, వ్యంగ్యవిషయకమగు జ్ఞానమును గూడఁ గలుగఁజేయునో, యదియే వ్యంజక మగును. దీపజ్ఞానముతో సమకాలముననే ఘటజ్ఞానము కల్గుట యిందుల కుదాహరణము. ఇట్లు కానిచోఁ గారక మను పేరుగల "హేతువు"నకును, వ్యంజకమునకును భేద మేమి యున్నది? హేతుకార్యముల జ్ఞానము సమకాలమునఁ గలుగ దనియు, వ్యంగ్యవ్యంజకముల జ్ఞానము సమకాలముననే కలుగు ననియుఁ దెలియవలయును.

ధ్వనికర్తయును "స్వరూపం ప్రకాశయన్నేవ పరార్థావభాసకో వ్యంజక ఇత్యుచ్యతే యథా ప్రదీపో ఘటాదేః" అను వాక్యమునందు "తన రూపమును ప్రకాశింపఁజేసికొనుచునే, యితరవస్తువులను బ్రకాశింపఁజేయునది వ్యంజక మగును. ఘటాది ప్రకాశనమున దీపము వ్యంజక మగుట యిందుకు దృష్టాంత మనియే తెల్పియున్నాడు. (3) ఇంతకుఁ బూర్వ మావిర్భవించిన వస్తువు నొకప్పుడు మనము తెలిసికొని యున్నాము. అందుచే నా వస్తువు విషయ మగు జ్ఞానము, మన మనసున సంస్కారరూపముగ నుండును. ఆ వస్తువుతో నియతసాహచర్యము గల మఱియొక వస్తువుఁ జూచినపుడు గాని, యా వస్తువిశేషమును దెల్పు శబ్దమును విన్నప్పుడుగాని, యా పూర్వసంస్కారము ప్రబుద్ధ మగుట మూఁడవ రకము. ఇందు కుదాహరణము- ధూమమును జూచి నపు డగ్ని స్మృతికి వచ్చును. అటులే గోవుయొక్క చిత్తరువును గాని బొమ్మను గాని, ప్రతి

---

• అర్థే సిద్ధేసతి = ఘటము మొదలగు వస్తువులు సిద్ధించి (రూపాది)యుండఁగా. స్వజ్ఞానేన = వ్యంజకమగు తన విషయమగు జ్ఞానముతో. అన్యధీహేతుః = వ్యంగ్యవిషయక జ్ఞానమునకు హేతువైనది, వ్యంజకో మతః = వ్యంజక మనఁబడును- యథా దీపః = దీప ముదాహరణము - అన్యథా భావే = అట్లు కానిచో, అస్య = ఈ వ్యంజకమునకు, కారకాత్ = హేతువుకంటె. కో విశేషః = భేద మేమి ?

బింబమునుగాని యనుకరణమునుగాని జూచినపుడు గోవు మనకు స్మృతికి వచ్చును. లేదా "అగ్ని" యను శబ్దమును గాని "గోవు" అను శబ్దమును గాని విన్నప్పుడుగూడ నగ్నిగోవుల విషయక మగు, మన మనసున నిలీనమైన సంస్కారము, ప్రబుద్ధమగును. ఇప్పటికి సద్వస్తువు మూఁడు రకములుగ నభివ్యక్తి నొందు నని తెలిసికొంటిమి. అసద్వస్తువున కొక విధమగు నభివ్యక్తియే గలదు. దాని కొకటికంటె నెక్కువ రకము లుండుట కుదురదు. సూర్యుని వెలుఁగునం దింద్రధను స్సభివ్యక్తి యగుట యే యిందు కుదాహరణము. ఇప్పటి కభివ్యక్తి లక్షణములను సుదాహరణములనుఁ దెలిసికొంటిమి.

పైఁ దెల్పిన యభివ్యక్తిలక్షణము ప్రస్తుతవిషయమున సమన్వయింపదు. ఎట్లన, సద్వస్తువుయొక్క యభివ్యక్తికిఁ దెల్పిన మొదటి రెండు లక్షణములలో మొదటి లక్షణమును బరిశీలింతుమేని, దధివలెఁ బ్రతీయమానార్థముఁగూడ నింద్రియ సాక్షాత్కారము గావలసియుండును. రెండవ లక్షణము ననుసరించి, దీపప్రకాశసమకాలముననే ఘట ప్రకాశము కలిగినట్లే, వాచ్యార్థజ్ఞాన సమకాలముననే వ్యంగ్యార్థప్రతీతి కలుగవలసియున్నది. ఈ రెండు లక్షణములును వ్యంగ్యార్థమునందు లేవు. ప్రతీయమానార్థ స్వరూపమునుఁ గూడ స్పృశింపనిదే యివి దానికి లక్షణము లెట్లగును? అందుచే మొదటి రెండు లక్షణములలో నేదియు వ్యంగ్యార్థమును స్పృశింపలేదని తెలియుచున్నది.

ఇఁక మిగిలిన మూఁడవ లక్షణ మనుమానమునకే సరిపోవుచున్నది. అభివ్యక్తికి సరిపోదు. "త్రిరూపలింగాత్, యదనుమేయే జ్ఞానం తదనుమానం" మూఁడువిధము లగు లింగముల(హేతువుల)వలనఁ గలుగు ననుమేయవిషయజ్ఞానమే యనుమాన మని చెప్పితిమి గదా. అందుచే నభివ్యక్తి యనునది యనుమానమే యగును. ఒక యర్థమునుండి యర్థాంతరప్రతీతి గల్గుట యనునది యనుమానముకంటె భిన్నమైన దగుటకు వీలు లేదు. ఉపమాదులుగూడ నీ యనుమానమునందే యన్తర్భావము నొందుటయే దీనికి హేతువు. ఈ విషయమునే యీ ప్రమాణ వాక్యము తెల్పును" న చాన్యదర్శనే అన్యాకల్పనాయుక్తాతిప్రసంగాత్

తస్యానాన్తరీయకతాయాం స్యాత్. నహి యథావిధసిద్ధః తథావిధసన్నిధానం సూచయతి-సామాన్యేనచ సమ్బన్ధినార్థప్రతిపత్తి రనుమానమితి ద్వేవ ప్రమాణే" దీని తాత్పర్య మిది - ఒక వస్తువును జూచినపుడు మఱియొక వస్తువును కల్పించుట యుక్తముకాదు. అది యుక్తమే యగుచో, ధూమదర్శనమువలన జలమును, ఘటదర్శనము వలన పటమును గూడఁ గల్పింపవలసి వచ్చును. ఇట్టి యనర్థకల్పనలు రాకుండుటకై, ఒక వస్తువును చూచినపుడు మఱియొక వస్తువును గల్పింపఁగూడదు. అగుచో ధూమదర్శనమున నగ్ని నెట్లూహించుచున్నా రని ప్రశ్నింపవచ్చును. కల్ప్యమాన మగు వస్తువు (ఊహింపఁబడు వస్తువు) నకును, కన్పడు వస్తువునకును, నవినాభావసంబంధ మున్నపు డర్థాన్తరకల్పనము యుక్తమే. ధూమమునకును, నగ్నికిని నట్టి సంబంధ మున్నది. అందుచే ధూమదర్శనమున, నగ్నికల్పనము యుక్తమే. పూర్వమే సన్నివేశము నందొక వస్తువును జూచినామో, యా వస్తు వా సన్నివేశమును సూచింపనపుడు, ఆ వస్తువుతో నియత సంబద్ధముగ నే వస్తువును మనము చూచినామో, యా వస్తువు నూహింతుము. పూర్వము ధూమాగ్నులను జూచినవారు, మఱియొకచో దూరమునుండి ధూమము నొకదానినే చూచినపుడు, ధూమముతో నియతసంబద్ధ మైన యగ్ని నూహించుచున్నారు. కావున, "ఏకసంబంధిజ్ఞాన మపరసంబంధిస్మారకం" అను న్యాయము ననుసరించి, నియత సంబద్ధములై యుండు వస్తువులలో, నొక వస్తువు జ్ఞానము మఱియొక వస్తువు జ్ఞానమును గలుగఁజేయును. దీనినే యనుమాన మందుము. శబ్దప్రమాణము, నుపమాన ప్రమాణముఁ గూడ నిట్టివే. ఒక శబ్దమును వినినపు డా శబ్దమునకు నియతముగ బోధ్యమగు నర్థమును మనము స్మరింతుము. అటులే ఒకవస్తువును జూచినపుడు దానినిఁ బోలిన మఱియొక వస్తువును స్మరింతుము. అందుచే శబ్దోపమాన ప్రమాణములు కూడ ననుమానము నందే

యన్తర్భావము నందును. కావునఁ బ్రత్యక్షానుమానములు రెండే ప్రమాణములు.

[సూచన:—ఈ వాక్యముల కర్థమును జెప్పుటయం దున్న వివిధ మతములను బ్రత్యేకముగ వివరింతును.]

వాచ్య మగు నర్థమునుండి మఱియొక యర్థము స్ఫురించునపుడా రెం డర్థములకును నవినాభావసంబంధ ముండవలయును. ఆ యవినాభావ సంబంధస్మరణము కల్గినపుడే వాచ్యార్థమునుండి యర్థాన్తర ప్రతీతి కలుగును. ఆ సంబంధస్మరణము లేనిచో నర్థాన్తర ప్రతీతి కలుగనే కలుగదు. సంబంధస్మరణము లేనపుడుఁ గూడఁ గలుగుచో సంబంధము లేని మిగిలిన యర్థములును స్ఫురింపవలసియుండును. అందుచే వాచ్యప్రతీయమానార్థములకుఁ గల యవినాభావసంబంధ స్మరణ మవశ్య ముండి తీరవలయును. ధూమజ్ఞానమునకును నగ్నిజ్ఞానమునకును నొక క్రమము భాసించు చున్నట్లే వాచ్యప్రతీతికిని వ్యంగ్యప్రతీతికినిఁ గూడ నొక క్రమ మున్నదని తెలియుటచే, వాచ్యప్రతీయమానార్థవిషయక జ్ఞానములు సమకాలముననే కలుగుటలేదు. అందుచే "అసంభవ"మను లక్షణదోష మిచటఁ గల్గును.

అసంలక్ష్యక్రమధ్వని యగు రసాదిధ్వనియందు మాత్రము, వాచ్యవ్యంగ్యములు సమకాలముననే భాసించు నని యందురా? అపుడు తమ లక్షణమున నవ్యాప్తి యను దోషముపట్టును. వస్తుధ్వనియందును, నలంకారధ్వనియందును వాచ్యవ్యంగ్యములకుఁ గ్రమ మున్న దనిమీరే యంగీకరించుచున్నారుగదా! అపుడు ధ్వనియం దంతర్భూతములే యగు వస్త్వలంకారధ్వనులకీ లక్షణము సరిపోదు. అందుచే నవ్యాప్తిదోష మభివ్యక్తిలక్షణమునకుఁ దప్పదు.

వాస్తవమున రసాదిధ్వనులయందైనను, విభావాదుల జ్ఞానము కలిగిన సమయముననే, రసజ్ఞానము కలుగు ననుట యుక్తియుక్తమైనది

గాదు. ఎట్లనఁ గృత్రిమము లగు కారణములనే మనము విభావాదు లని పిలుచుచున్నాము—రత్యాదులు వాస్తవమైన యునికి గలవి కావు. అవి ప్రతిబింబసదృశ ములు నసత్యములును. ఇట్టి రత్యాదులనే మనము స్థాయిభావము లని పిలుచుచున్నాము. ఏవివి గవులు పాఠకులకు హృదయసంవాదవశమునఁ దన్మయము గలుగునట్లు వర్ణింతురు. అటులే, నటులును ప్రేక్షకులకుఁ దన్మయము గలుగున ట్లభినయింతురు-అపుడాస్వాద్యమానములైన యీ రత్యాదులనే రసము లని పిలుతుము. విభావాదులు కారణము లనియు, రసములు కార్యము లనియు నివి ప్రతిబింబకల్పము లనియుఁ జెప్పితిమిగదా! ఇట్టి పరిస్థితులలోఁ గారణములును కార్యములు నొక్కే సమయమునఁ బ్రకాశించుట యెట్లు సంభవమగును? సమకాలభావ మీ రెంటికిని సంభవమగునేని వానికిఁగల కార్యకారణభావమే నశించును, ఇక నభివ్యక్తిలక్షణము సమన్వయించు ఘటప్రదీపములు కావ్యమే కాదు. అందుఁ గావ్యత్వమే లేనపుడు,తద్విశేష మగు ధ్వనిత్వమెట్లుండును.

ప్రకాశక మగు నర్థము రెండువిధములు. (1 ఉపాధిరూపము (2) స్వతంత్రము—ఇందు, స్వరూపోపరంజనముచే నితరవస్తుప్రతీతికి హేతు వగునది యుపాధి యగును. జ్ఞానము, శబ్దము, ప్రదీపము, మణి, యనునవి యుపాధిరూప ప్రకాశకములయం దంతర్భావము నొందును. "త్రయః ప్రకాశాః స్వపరప్రకాశాః" (స్వపరప్రకాశకము లగు ప్రకాశక వస్తువులు మూఁడు గలవు) అను వాక్య మీ విషయముఁ దెల్పును, ఇందు జ్ఞానము స్వప్రకాశము. శబ్దముఁ బ్రదీపముఁ బరప్రకాశములు. జ్ఞానము జ్ఞేయవిషయమును దనలో నుంచుకొని "యీ విషయము తెలిసినది" యను రూపముగల జ్ఞానమునందే జ్ఞేయమునుగూడ ప్రకాశింపఁజేయును. అనఁగా జ్ఞానము స్వప్రకాశ మగుచునే జ్ఞేయమునుఁగూడ ప్రకాశింపఁజేయుచున్నది. ఇటులే శబ్దప్రదీపములుగూడ స్వరూపమును బ్రకాశింపఁజేసికొనుచునే, స్వవాచ్యమగు నర్థమును, ప్రకాశ్య మగు ఘటమును

బ్రకాశింపఁజేయుచున్నవి. ఇఁక స్వతస్స్రిరూప మగు ప్రకాశ మొక విధ ముగ నేయుండును. ధూమమే యిందులకు దృష్టాన్తము.

అందులో నుపాధిరూపమగు ప్రకాశకమును మీరంగీకరింప రాదు. ఏలనఁ బైవానిలో జ్ఞానప్రదీపాదుల నంగీకరించుచో, వానిచేఁ బ్రకాశ్య మగునది ప్రత్యక్ష మగు నర్థ మగును. శబ్దమునంగీకరించుచో నభిధేయ మగు నర్థము ప్రకాశ్య మగును. అపుడు ప్రత్యక్ష మగు నర్థమునకును, నభిధేయ మగు నర్థమునకునుమాత్రమే కావ్యత్వము సిద్ధింపవలసియుండును. అది మీకును సమ్మతము గాదు. ఇఁక స్వతస్స్రిరూప మగు ధూమాదిప్రకాశములను గ్రహింతు మందురా, యపుడు దానికి ననుమానరచనయందుఁగన్పడు లింగత్వమే యుండును గాని, మీరనుకొనిన వ్యంజకత్వము సంభవింపదు. ధ్వనికర్త్రృమతమునందును, వస్త్వలంకారరసాత్మకము లగు మూఁడువిధము లగు వ్యంగ్యార్థములునుగూడ ప్రకాశక మగు వస్తువుతోఁగలిసి భాసింపవు. ఈ విషయమును ధ్వనికర్తయే యీ క్రిందివాక్యములయందుఁ దెల్పినాడు.

"నహి విభావానుభావవ్యభిచారిణ ఏవ రసాః ఇతికస్యచిదవగమః, అతఏవచ తత్ప్రతీత్యవినాభావినీ రసాదీనాం ప్రతీతి రితి తత్ప్రతీత్యోః కార్యకారణభావేనావస్థానాత్ క్రమోఽవశ్యంభావీ, స తు లాఘవాన్నలక్ష్యతే ఇత్యలక్ష్యక్రమా ఏవ సన్తో వ్యంగ్యా రసాదయః"(విభావానుభావ వ్యభిచారిభావములే రసము లని యెవరును దెల్పుట లేదు-ఆ విభావాది ప్రతీతికిని, రసాదిప్రతీతికిని, నవినాభావసంబంధ ముండుటచే, విభావాది ప్రతీతినుండి రసాదిప్రతీతి కలుగుచున్నది. అందుచే వానికిఁ గార్యకారణభావము నంగీకరింపవలయును. అపు డవశ్య మా కారణముల ప్రతీతియందు క్రమ ముండవలయును. అయినను నా క్రమము మనము గుర్తింపలేనంతటి వేగము గలదిగ నుండును. అందుచే రసాదు లలక్ష్యక్రమ వ్యంగ్య

ము లని తెల్పినాము"—ఇట్లు తెల్పుటచే నతివ్యక్తియనునది యిచటఁ గూడ సమన్వయింపదు.

పూర్వపక్షము:—పై లక్షణమునందు. "ప్రకాశకేన సహైవ ప్రకాశవిషయతాపత్తిః" (ప్రకాశమగు వస్తువుతోఁ గలిసియే ప్రకాశించుట) యను పదములను దీసివేయుదుము. అపుడు, మీరు చూపిన దోషములకుఁ దా వుండదు.

సిద్ధాన్తము:—ఇపుడును మీరు చెప్పిన ధ్వనిలక్షణము దోషదుష్టమే యగును. ధూమాగ్ని దృష్టాన్తము నందుఁ గూడ ధూమము తా నుపసర్జనమై యగ్నిని బ్రకాశింపఁ జేయుచునే యున్నది. అందుచే ధ్వనిలక్షణ మిచటఁ గూడ సమన్వయించుచున్నది. అపు డతివ్యాప్తి యను దోషము కలుగుచునే యున్నది.

పూర్వపక్షము :—అగుచో, "సతోఽసత ఏవవార్థస్య" అను పదములలో "అసత ఏవార్థస్య" అనియే యుంతుము. "సతః" అను పదమును దొలఁగింతుము. అపుడు, అసద్భూతము లగు వస్తువులు ప్రకాశ్యము లై నపుడే ధ్వనిలక్షణము సమన్వయించును. ప్రస్తుతము "అగ్ని" సద్రూపమే గాని,—యసద్రూపము గాదు. కావున మీరు చెప్పి నట్లతివ్యాప్తి దోషము రాదు.

సిద్ధాన్తి:—అపుడు ఘటప్రదీపముల విషయమున,ఘటము సద్రూపము. అందుచే మీ ధ్వని లక్షణము ఘటప్రదీప స్థలమునఁ గూడ వర్తింపదు. కాని మీ కచట ధ్వనిలక్షణము సమన్వయించుట యభీష్టము. ఇట్లభివ్యక్తికి లక్ష్యము లైన తావులలో, మీ లక్షణము సమన్వయింప కుండుటచే నిచట నవ్యాప్తియను దోషము వాటిల్లినది.

పూర్వపక్షము:-అసతః-(అసద్రూపమైన)యను పదమును లక్షణమునుండి తొలఁగింతుము.

సిద్ధాన్తి:—సూర్యుని కిరణముల సంపర్కమువలనఁగన్పడు నింద్రచాప మసద్రూపమైనది. కాని యది యభివ్యక్తికి విషయమే యని తెల్పియుంటిమి. మీరు "అసతః" అను పదమును లక్షణమునుండి తీసివేయుచో నీ లక్షణమునకు యసద్రూపమైన యింద్రచాపము లక్ష్యము కాదు. అందుచే నవ్యాప్తియను దోషము నీ లక్షణమునకుఁ బట్టును.

పూర్వపక్షము:—"సతః అసతో వా" అను రెండు పదములను లక్షణమునుండి తీసివేయుదుము.

సిద్ధాన్తి:—"ప్రకాశకప్రకాశ్యములుకలిసియే భాసించుట" "సదసద్రూపములైన" యను పదజాలమునంతనుఁ దీసివేయుచో మిగిలిన యభివ్యక్తి లక్షణము మే మంగీకరించిన యనుమానమునకే సరిపోవును. అభివ్యక్తికి సరిపోదు. అది యిట్లగుట మా కిష్టమే. వాచ్యప్రదీయమానములు సద్రూపము లనియు నవి క్రమముగనే భాసించు ననియు మేము నంగీకరింతము.

ఇప్పటికిని మేము తెల్పిన యసంభవదోష మట్లే యున్నది. మఱియొక విషయమునుఁ గూడ గుర్తింపవలయును. విశేషణ మనునది విశేష్యమునకు నితరవస్తువులకుఁ గల భేదమును దెల్పి, విశేష్య మితర వస్తువులకంటె విభిన్నమైనదను విషయమును దెల్పును. కాని యిచట "ప్రకాశ్యమునకున్న" సదసద్రూపములలోనే "నేదియైన"యను విశేషణము ప్రకాశ్యవస్తువు నితరవస్తువులనుండి విభిన్నమైన దానిఁ జేయుట కుపకరింపదు. అనఁగా నీ విశేషణమువలన వ్యావర్తింపఁబడు (వారింపఁ

బడు) సదారోపముగాని యనద్రూపముగాని, కాని వస్తువులు లేవు. అందుచే నీ విశేషణముగూడ ననుపపన్నమే.

**అర్థశబ్దపరియోజన విచారము:**—"యత్రార్థః శబ్దోవా" అను ధ్వని లక్షణవాక్యమునందలి యర్థపదమున కర్థమేమి? వాచ్యమగు నర్థ మీ యర్థశబ్దమున కర్థ మగునో, వాచ్యార్థముచే ననుమిత మగు (ధ్వని కర్తృమతమున వ్యంగ్యమగు) నర్థము తిరిగి మఱియొక యర్థము నకు వ్యంజక మైనపుడీ వ్యంజకమగు నర్థము వాచ్యార్థము గాకుండుటచే నిచట వ్యంగ్యమునకుఁ గూడ ధ్వనిత్వము సంభవింపఁగూడదు. ఉదాహరణమునకు "ఏవం వాదిని దేవర్షౌ పార్శ్వే పితు రధోముఖీ" అను శ్లోకమున, అధోముఖి యను శబ్దమునకుఁ గల వాచ్యార్థమునుండి "లజ్జ" వ్యంగ్య మగుచున్నది. ఈ లజ్జ యను వ్యంగ్యార్థము పార్వతియం దున్న శివవిషయకమగు రతి యను భావమును వ్యంగ్యము చేయుచున్నది. ఇపుడీ శివవిషయకమగు రతి యను వ్యంగ్యార్థము వాచ్యార్థమునుండి కలిగినది కాదు. "లజ్జ" యను వ్యంగ్యార్థమునుండి కలిగినది. అందుచే శివవిషయకరతి నిచట ధ్వని యని వ్యవహరించుటకు వీ లుండదు. కాని దానికిని ధ్వనిత్వము మీ కభీష్టమే. ఇట్లు నిజముగ ధ్వనికి లక్ష్యమే యగు నీ తావున మీరు చెప్పిన ధ్వనిలక్షణము సమన్వయింపకుండుటచే నా లక్షణమున కవ్యాప్తిదోషము పట్టినది.

**ధ్వనివాది పూర్వపక్షము:**—

"అర్థః సహృదయశ్లాఘ్యః కావ్యాత్మా యో వ్యవస్థితః
వాచ్యప్రతీయమానాఖ్యౌ తస్య భేదా వుభౌ స్మృతౌ"

అను శ్లోకమున, 'కావ్య మను శరీరమున కాత్మభూతమై సహృదయ శ్లాఘ్య మగు నే యర్థము గలదో, యది వాచ్య మనియుఁ బ్రతీయమాన మనియు రెండు విధములుగ నున్న దని' యిదివఱకే తెలిపియుంటిని

గదా! అందుచే నిచట యర్థశబ్దముచే వాచ్యార్థమును వ్యంగ్యార్థమును గూడ గ్రహింతుము. అపుడు వాచ్యవ్యంగ్య మగు నర్థముగూడ ధ్వని యగుట కభ్యంతర మేమియు నుండదు.

అనుమితివాది సమాధానము:—సత్యమే కాని "యత్రార్థశ్శబ్దో వా తమర్థ ముపసర్జనీ కృతస్వార్థౌ" అను లక్షణమున, "తమ్" అను తచ్ఛబ్దము దానితరువాత నున్న "యర్థ శబ్దమున కర్థమగు" ప్రతీయ మానార్థమును తెల్పుచున్నది-అనఁగా నీ లక్షణమునందలి, రెండవ "యర్థ" శబ్దము వ్యంగ్యార్థమునే తెల్పును. కాఁగా మొదటి "అర్థ" శబ్దము, వాచ్యార్థమునే తెలుపవలయును - ధ్వనికర్తయే స్వయముగ "అర్థో వాచ్య విశేషః" అని వివరించినాఁడు. అందుచే నిచట "యత్రార్థః" అనునపు డర్థశబ్దము వాచ్యార్థమునే తెలుపునుగాని, వాచ్యవ్యంగ్యము లగు రెం డర్థములనుఁ దెలుపదు. అందుచే నింతకుఁ బూర్వము మేము తెల్పిన దోష మట్లే యున్నది.

పోనిండు. "యత్రార్థః" అనుచో నర్థశబ్దమునకు వాచ్యవ్యంగ్యములు రెండును నర్థములే యని గ్రహించిననాఁడును, నీ లక్షణమున నతివ్యాప్తి దోష ముండనే యున్నది. ఒక వాచ్యార్థమునుండి, సాధ్య మగు మఱియొక వస్తువు ప్రతీయమాన మగుచున్నది. వాచ్యమునకును ప్రతీయమానమునకును మధ్య నొకటి, రెండు లేక మూఁడు వస్తువులు (విషయములు) వ్యవధానముగ నున్నవి. ఇట్టి స్థలములలోఁ గూడ నీ ధ్వనిలక్షణము సమన్వయించును. కావున నిచట సాధ్యమైన ప్రతీయ మానార్థము గూడ ధ్వనియే కావలసి వచ్చుచున్నది. ధ్వనికి లక్ష్యము కాని దీనియందు లక్షణము సమన్వయించు చుండుటచే నతివ్యాప్తి దోషమువచ్చినది.

ధ్వనివాది:—ఇచటఁ బ్రతీయమానార్థము ధ్వని యగుట మాకిష్టమే. అందుచే నతివ్యాప్తి దోషములేదు.

# భీమేశ్వరపురాణము—కావ్యత్వము

చిలుకూరి పాపయ్యశాస్త్రి

ఉ. వేలుపుఁగిడ్డియుం బరుసవేదియుఁ గల్పకుజంబుఁ దోడ రా
లాలితపాదనూపురఝుళంఝుళనాదము లుల్లసిల్లఁ బైఁ
జేలచెఱంగు దూలఁగ విశృంఖలవృత్తిఁ జరించుచుండె నీ
లాలక యన్నపూర్ణ యమృతాన్నముఁ బెట్టుచు నన్నిపంక్తులన్.

౨.౧౪౩.

ఈ యన్నపూర్ణయే కరుణాకటాక్షముతో వీక్షించి, భీమనాథుని గొలిచి మోక్షమొందు మని యుపదేశించినది. ఆ యుపదేశమే వ్యాసుని భీమమండలికిఁ గొనితెచ్చినది. విశ్వనాథుని యాగ్రహమునకు లక్ష్యభూతుఁడైనను విశాలాక్షి యనుగ్రహమునకుఁ బాత్రుఁడైనందుననే యాతనిపాదరజఃస్పర్శచే భీమమండలి పవిత్రమగుట చేకూడి, శ్రీనాథునకు రసభరితమైన కావ్యవస్తువు సమకూడుటకు వదను చిక్కినది. వ్యాసునకు విశాలాక్షి యిట్లభయ మొసఁగినది.

చ. వెఱవకు మౌనికుమార! పదివేలవిధంబులనైన నిన్ను నే
మఱువ; మఱేడకుం జనుట మాని, సుఖంబున దక్షవాటికన్
దుఱఁగలి గొన్నసమ్మదముతో గమనింపుము; భీమనాయకుం
డఱగొఱలేని వేల్పు నిఖిలాభ్యుదయంబులు నీకు నయ్యెడున్.

భీమ. ౨. ౧౫౫.

ఈ విధముగ నీ ద్వితీయాశ్వాసమునందలి వర్ణనములు, ఇతివృత్తము, కథాకథనసౌష్ఠవము, రచనలోని పరిపాకము భీమేశ్వరపురాణమునకుఁ గావ్యత్వమును సమకూర్చినవి.

## హాలాహలభక్షణము.

భీమేశ్వరపురాణమునకుఁ గథానాయకుఁడు శ్రీభీమేశ్వరమహాదేవుఁడు. దేవహితమునకు సకలలోకరక్షార్థము నాతఁడు గావించిన మహత్తరకృత్యములలో ముఖ్యముగఁ జెప్పఁదగినవి అద్భుతావహ

ములు నైనవి రెండు. వానిలో మొదటిది హాలాహలభక్షణము; రెండవది త్రిపురాసురసంహారము. ఈ రెండును నితరదేవతల కేపాటియు సాధ్యములు గాక, పరమేశ్వరుని నిగ్రహానుగ్రహపరత్వమున నిర్వహింపఁబడినవి గావున, పార్వతీపతి మహత్త్వమును గొనియాడఁగడఁగిన వేదములందు సైతమీయితివృత్తములు వర్ణింపఁబడియున్నవి. హాలాహలభక్షణమునకుఁ బూర్వరంగమైన క్షీరాబ్ధిమథనమునందుఁ గొంతవఱకు విష్ణువునకుఁ బ్రాధాన్యముకలదు; కాని త్రిపురాసురసంహారముమాత్రము కేవలము శివునియపదానమే. కావుననే శివభక్తు లందఱు పరమేశ్వరుని మహిమ నగ్గడించుపట్టులందు ముఖ్యముగ త్రిపురాసురసంహారమును జేకొందురు.

కవికులగురువగు కాళిదాసు, మేఘసందేశమున హిమవత్పర్వతమునందలి హరచరణన్యాసమును వర్ణించుఘట్టములో, "శబ్దాయంతే మధుర మనిలైః కీచకాః పూర్యమాణాః, సంరక్తాభి స్త్రిపురవిజయో గీయతే కిన్నరీభిః" అని హిమవత్పర్వతమునందు, కిన్నరస్త్రీలు మధురకంఠముతో త్రిపురవిజయమును గానము చేయుచుందు రని తెలపినాఁడు. ఇట్టి గేయమైన యితివృత్తమును శ్రీనాథుఁడు భీమనాథుని మహిమ నగ్గడించుటకై యీకావ్యమున సంతరించియున్నాఁడు. త్రిపురాసురసంహారము చేయవలసినయక్కఱ యేర్పడుటకుఁ గారణముగా క్షీరసాగరమథనము జతగూడినది. ఆమథనవేళ జన్మించిన హాలాహలమును భక్షించుటచేఁ బరమేశ్వరునిమహత్త్వము పరిపుష్టమై, భీమనాథునకు భీమేశ్వరనామధేయము సార్థకమైనది. ఈవిధముగఁ గార్యకారణభావసమన్వితములై యీరెండుకథలును చతుర్థాశ్వాసమునందుఁ గవగూడి యీపురాణమునకుఁ గావ్యత్వము నాపాదించిపెట్టినవి.

కావ్యమునందు తప్పక యుండవలసినవి నాయకుఁడు ఇతివృత్తము రసము అను నీమూఁడును. ఈమూఁడిటికి సమపరిపుష్టి జరిగినపుడే యది యుత్తమకావ్య మగును. ఈమూఁడిటినిర్వహణమునందే కవికిఁ గలప్రతిభ వ్యక్తమగును. ఈకావ్యమునకు నాయకుఁడు భీమనా

ధుఁడు. అతనిమహిమను వ్యక్తముచేయు నితివృత్తములో రసవత్తర మైనది త్రిపురవిజయము. ఇచటి రసము వీరము. దానికిఁ బుష్టినిదెచ్చి నది హాలాహలభక్షణము,నప్పటియద్భుతరసమును. ఈవిధముగ నీచతు ర్థాశ్వాసము రసబంధురమై, తీర్థక్షేత్రమాహాత్మ్యముల నడుమ నవత రించి,కావ్యవస్తువై విలసిల్లినది.

దక్షారామమున మహర్షులంకలు నొకచోఁ జేరియుండగఁ "మంకణుఁడనుఁ" డనుమహర్షి భీమనాథుమహాత్మ్యంబుపెంపు విన౯గ వేడ్క యగుచుండు నాకు నానతీదగు మీలోన నొక్కరుండు" అని యడుగఁగా, కుంభసంభవునినియోగంబున వసిష్ఠమహర్షి యుపక్రమించి, పరమేశ్వరునకు దక్షారామవాసికి భీమేశ్వరనామము వెలసినవిధము నిట్లు ప్రస్తావించినాఁడు.

క. భీమమగు గరళకూటము
భూమియు గగనమును దిశలఁ బొడచూపినచో
భీమగతి మ్రింగెఁ; గావున
భీమేశ్వరుఁ డయ్యె నితఁడు బిరుదాంకమున౯. భీమ. ర. ర.

భూమిని గగనమున దిశలఁ—అని యుండుట యుక్తముగాఁదోఁచెడిని.

భూమ్యాకాశములందు, దిక్కులన్నిటను నిండి మిక్కుటమైన భయము నొదవించిన కాలకూటవిషమును భయంకరమైనరీతిని మ్రింగి నాఁడు గావున దక్షారామవాసియగు పరమేశ్వరునకు భీమేశ్వరుఁ డను పే రేర్పడిన దని నిర్వచనము. దేవతల నమరులఁ జేయుటకై యమృ తము నుత్పాదించుయత్నమున శివకేశవుల కిరువురకునుసమప్రాధాన్య మేర్పడియున్నది. ఇరువురతోడ్పాటును లేకున్న నమృతము దేవతలకు లభించునది గాదు. కావున నీక్షీరసాగర మథనవృత్తాంతము శివవిష్ణు మహిమలఁ దెలుపు వృత్తాంతములందు రెండిటను గూడ ప్రసక్తము లే యగుచుండును.

కాలకూటోత్పత్తిప్రకారము హరవిలాసమునందును వర్ణిత మైనది; కాని యచట దుర్వాసునిశాపమున నిందుఁడు కున్నయమృత

భాండాదివస్తుజాతము క్షీరాంభోనిధిని బడి, దేవతలకు దూరముకాఁగా వానిని మరల నుత్పాదించుటకై క్షీరాబ్ధిమథనము కావింపఁబడినది. ఇచట నట్లులుగాక దేవదానవు లొండొరులతోఁ గలహించుకొను నపుడు, దానవులను బరిమార్చుటకై, దేవేంద్రుఁడు విష్ణువుతో మంతనముచేసి రాజకీయతంత్రముగా నమృతోత్పాదనమున కారంభ మేర్పడును.

దేవదానవు లిరువురుఁ గూడినఁగాని మందరపర్వతమంథానమున క్షీరసాగరమథనము గావించుట వలనుపడదు. అట్టియదనున నొండొరులపైఁ బగఁబూని యుద్ధసన్నద్ధులైన దేవదానవులకు సంధిని జతగూర్ప వలయును. దానికి సర్వవిధములఁ దగినవాఁడు జగన్నాటకసూత్రధారుఁ డగుశ్రీమన్నారాయణుఁడే. కావున నాతనితో మంతనముచేయుట కదను, క్షీరాబ్ధిశాయి నిద్ర మేల్కాంచిన సమయము. అతఁడు శేషతల్పమున నిద్రించియుండఁగా క్షీరసాగరమును మథించుట వలనుపడదు గదా! కావున నట్టియవకాశముఁ బరికించి, ఇంద్రుఁ డుపేంద్రునితో మంతనము చేసె నని తెలుపుటకు, శేషశాయి నిద్ర మేల్కాన్నయప్పటి చిత్తరువు నీరీతిగఁ గవి యవతరింపఁజేసినాఁడు.

సీ. దివ్యాయుధము లైదు ధృతచేతనంబులై
 శత్రుసంహారబు సంస్తుతింపఁ
బులుఁగుఱేఁడు కరాబ్జములు రెండు మొగిడించి
 భ్రూలతాదేశంబు పొలుపు నరయ
సౌఖశాయనికులై సనకాదియోగీంద్రు
 లనురాగవీక్షణం బభిలషింప
నూరురంభాస్తంభయుగళంబుపై నుంచి
 లక్ష్మి శ్రీపాదపల్లవము లొత్తఁ
బన్నగాధీశభోగతల్పంబుమీఁదఁ
దత్ఫణారత్నదీప్తి మైతెభుకుఁ జూపఁ
బాలమున్నీటిలో నిద్ర మేలుకొన్న
హరికిఁ బొడచూప నేతెంచె హరిహయుండు. ౪. ౪౮.

శ్రీ రాబ్ధితల్పమునుండి నిద్ర మేల్కాంచిన దివ్యవైభవ మీపద్యము నందు నందముగఁ జిత్రితమైనది. నిద్ర మేల్కాంచినతరి నెవ్వనిమానసమైన ప్రసన్నముగ నుండును. ఇంద్రియములు బాహ్యప్రపంచ విషయములందుఁ బ్రవృత్తమగుటకుఁ దగిన యదన నదియే. కావున నట్టి యదను చూచుకొని యోగనిద్రనుండి మేల్కాంచి, జగదవన రక్షాప్రవణుఁడైన నారాయణునొద్దకు దేవేంద్రుఁ డొంటరిగ వచ్చి, రహస్యముగా హితకార్యచర్చ చేసి, ఆవిషయము రెండవచెవికిఁ దెలియకుండ సంకల్పసిద్ధిఁ బడసి తనశిబిరమునకు వెడలిపోవుట నిటఁ గవి సున్నితమైన తెలుఁగునుడికారములోఁ దెలిపినాఁడు.

గీ. ఒంటి నేతెంచి మంతనం బుండి నిలిచి
చక్రధరుతోడ హితకార్యచర్చ చేసి
యేఁగె దేవేంద్రుఁ డిరుచెవి నెఱుఁగకుండ
సిద్ధసంకల్పుఁడై యాత్మశిబిరమునకు. ౪. ౫౦.

రాజకీయవ్యవహారములు చాల రహస్యముగా నాలోచింపఁదగినవి. అందును యుద్ధమునకు సంబంధించిన వ్యవహారములు మఱింత యేకాంతముగా జరుపవలయును. కావుననే దేవేంద్రుఁ డొంటిగా వచ్చి, దేవతాకార్యసిద్ధికై కేలఁ జక్రము దాల్చిన శ్రీహరితో మంతన ముండి, హితకార్యచర్చ చేసినాఁడు. తాము చర్చించినవిషయము మేపాటి పొక్కినను, వ్యవహార మంతయుఁ జెడిపోవుటయే గాక శత్రునిరోధ మసాధ్యమైపోవును. శ్రీహరితో మంతనముచేసినంతనే యింద్రుఁడు సిద్ధసంకల్పుఁడై తనకార్యపరిపాటి నిరుచెవినెఱుఁగకుండఁ దనశిబిరమునకుఁ దరలిపోయినాఁడు. ఇరుచెవి నెఱుఁగకుండఁ జేయవలయును గావుననే కవికూడ మన కాయిరువురచర్చ నించుకైనను దెలుపకుండఁ దరువాతి కార్యమునకుఁ దిగినాఁడు.

వెంటనే శ్రీమన్నారాయణుఁడు, దేవదానవులనడుమ సంధి సేయ నమకట్టి యిట్టు లుద్బోధించెను.

క. ఓవెఱ్ఱులార! యేటికి
నీవెడఁగు విచారములు సహింపఁగ రాదా
యేవారికైన మేలా
చావు లతర్కితము లుగ్రసంగ్రామములన్?

గీ. కుడిచి కూర్చుండి మీరేల కొఱఁతయైన
కుమ్ములాడెద రో యన్నదమ్ములార!
గొఱ్ఱె క్రొవ్వియు సెలగట్టెఁ గొఱికినట్లు
కట కటా! మీవివేకంబు గాడుపడఁగ.

ఈపద్య మంతేయుఁ జక్కని తెలుఁగుజాతీయములతో నిండి సంధిపలుకులు సమన్వితములుగఁ గూడినది. కుడిచి కూర్చుండి కుమ్ములాడుట కుపమానముగ, గొఱ్ఱె క్రొవ్వి సెలగట్టెఁ (బాణమును) గొఱికినట్లు న్నదనుట మఱింత చక్కఁగ పొసఁగినది. సంస్కృతసమాసాడంబరముతో నిండించెడి శ్రీనాథుఁ డచ్చ తెలుఁగుపదముల కూర్పునందును నీడఁబోని రచన సాగింపఁగలుగుట కిది తార్కాణము. మఱియు వారితో—

"భద్రసువర్ణపీఠికలపైఁ గొలువుండి త్రిలోకరాజ్య మ
చ్ఛిద్రముగాఁగ నేలుట విశేషమొ చచ్చుట తా విశేషమో"

కావున సుధాపానంబున జరామరణంబు లుజ్జగించి సుఖం బనుభవింపుఁడు; క్షీరసముద్రమథనంబునం గాని సుధారసంబు సంభవింపదు; గావున ఆదికచ్ఛపము మూలాధారముగా, మందరపర్వతము మంథనదండంబుగాఁ, శేషుఁడు తఱ్ఱత్రాడుగా క్షీరసముద్రమును మథింపవలయునని చెప్పివారి నొడఁబఱచినాఁడు. ఇంద్రోపేంద్రుల రహస్యకార్యాలోచన మిట్టియమృతమథనకార్యారంభమునకు దారి చూపినది. శౌరి పల్కులు విని సమ్మతించి సముద్రమథనమునకుఁ బూనుకొనినంతనే మురాంతకుఁడు బాహాస్తంభచతుష్టయంబున మందరమహీధరము నెత్తి శిఖరసందోహములు బ్రహ్మాండముఁ దాఁక నుద్ధతితోఁ దెచ్చి క్షీరసముద్రముఁ జేర్చెను.

మందరమంథానమునఁ గావించిన సముద్రమథనపద్ధతిని, మథనమునకు వలయు సామగ్రిని శ్రీనాథుఁ డొక్కసీసమునఁ జక్కఁగఁ బ్రదర్శించియున్నాఁడు. సంస్కృతమూలమున సంక్షేపముగ నుండిన యీ విషయమును విపులీకరించి చక్కనిదృశ్యమును సర్వాంగసౌష్ఠవముతోఁ జిత్రించినాఁడు.

సీ. కపటకచ్ఛప మైన కైటభాంతకువీఁపు
　　　　కొమరు మీఱిన చుట్టకుదురు గాఁగ
నారసాతలమూల మైన మందరమహా
　　　　ధరణీధరంబు మంథానకముగ
దందశూకాన్వయాధ్యక్షుండు వాసుకి
　　　　తతపరిగ్రహణసూత్రంబు గాఁగ
నావహప్రవహాదు లగుమారుతంబులు
　　　　తగులఁగట్టిన యొక్కత్రాళ్లు గాఁగ
బలిపురోగమ దైత్యపరివృఢులును
దివిజనాయకుఁ డాదిగా దేవతలును
దరిచి రంభోధి ఘుమఘుమధ్వానరవము
భువనగోళంబు దిక్కులు చెవుడువడఁగ

ర. గీ.

ఆదికూర్మమువీఁపు చుట్టకుదురు. పాతాళము నంటినమూలము గల మందరాచలము కవ్వము. పాపఱేఁడగు వాసుకి తఱిత్రాడు. ఆవహము ప్రవహము మున్నగు మారుతములు అఁకత్రాళ్లు. బలిముఖ్య దానవవీరులు దేవేంద్రాదిదేవతలు కవ్వము ద్రిప్పువారు. క్షీరాంభోధిని మథింపఁగాఁ జెలరేఁగిన ఘుమఘుమధ్వానము లోకములు దిక్కులు నన్నియుఁ జెవుడుపఱచినది. ఈమథనమునుండి ముందుగఁ బుట్టవలసినది సర్వలోకభయంకరమైన కాలకూటవిషము గావున, దానియాటోపము తోడనే హాలాహలోత్పత్తిప్రకారమును వర్ణించిన వచనరచనయుఁ గొనసాఁగినది.

ఈవచన మనుప్రాసబహుళమై బీభత్సరసమున కనువైనశైలిని గొనసాఁగినది. ఇరువదిపంక్తుల యీవచన మంతయు హెచ్చుతగ్గులు లేకుండ నేకరీతిగ నడిచినది. హాలాహలోద్భూతిచే లోకము లన్నియుఁ బరిభ్రమింపఁ జాలినయుద్ధతి చెలరేఁగినట్టులు చిత్రించినాఁడు కవి. ఈ రచనలో శబ్దచిత్ర మధికమే యైనను అర్థసౌష్ఠవమునకుఁ గొఱంత మాత్రము లేదు. కొంత యుదాహరింతును.

వ. ఇవ్విధంబున సురాసురవ్యూహంబులు మదంబులు ముదంబులు శౌర్యంబులు ధైర్యంబులు క్రౌర్యంబులు వీర్యంబులు హంకారంబులు హుంకారంబు లుల్లాసంబులు పరిహాసంబులు బలంబులు చలంబులు ... బెంఫులు గుంపులు పరువులు మురువులు గెఱయు మెఱయు, బాహావష్టంభసంరంభవిజృంభణంబునఁ దరతరంబ తరువందరువం దరి త్రాడు పాపఱేని యొడలిమలకలు పురులు విడి ... దుగ్ధార్ణవంబు ఘూర్ణమానం బయ్యె; నప్పుడు ... భృంగసంకాశంబును నీలజీమూత సన్నిభంబును గల్పాంతసమయవహ్నికల్పంబును గాలమృత్యుప్రతిమంబును యుగాంతాగ్నివర్ణంబును నైన...కోలాహలాభీలంబయి హాలాహలం బుద్భవింప—

నది చూచి విష్ణువుతో సైతము దేవత లందఱు వన్నె తఱిగి భయభీతులై పరమేశ్వరుని శరణుఁజొచ్చిరి. పరమేశ్వరుఁడు ను దనయ భయ హస్తము సాచి, దేవతలతో మీరు వెఱవకుండుఁ డని తెలిపి, హుంకారముతోపాటు అట్టహాసము గావించి యా కాలకూటమును దనహస్తపద్మమునందు నిలిపినతీరును కవి రౌద్రమునకుఁ దగినయారభటిలో నడిపించినాఁడు.

మ. పటుహుంకారమహాట్టహాసకలనం బాతాళభూస్వర్గసం
కటసన్నాహసముద్భవంబగుచు నయ్యాకాకోలకాలాగ్ని ధూ
ర్జటిహస్తాబ్జమునందుఁ గైకొనియె నాజ్వాలాకులక్ష్వేళ మ
ప్పటివేళన్ మదభృంగ మయ్యె శశిభృత్పాణ్యబ్జమధ్యంబునన్.

ఆహాలాహల మావిర్భవించినపుడు తొలుత భృంగాకృతిలో బయలు దేఱినను క్రమముగా బ్రహ్మాండమంతయు నిండిన కాలాగ్ని సన్నిభం బైనది. కాని యీశ్వరునిహుంకారముతోఁ గూడినయట్టహాసముచే మరల మదభృంగాకారమునకే వచ్చినది.

ఇచట నడుమ నొందినవృద్ధిని వచనములోఁ దెలిపినాఁడు గాని తగ్గుటలో మాత్రము క్రమపరిణామమును దెలుపలేదు. హరవిలాసములో హాలాహలోద్రేకము క్రమముగ తఱుగుటను సొగసుగఁ జిత్రించినాఁడు.

చ. జలధర మంతయై కరటిచందము గైకొని సూకరాకృతి
న్నిలిచి పికంబుతోఁ దొరసి, నేరెడుపండునుబోలె నుండయై
కలశపయోధిమంథనముఖంబునఁ బుట్టిన యుగ్రహాలాహలా
హలము క్రమంబునన్ శివునిహస్తసరోరుహ మెక్కెఁ జుక్కగన్.

హరవిలాసము.

ఈపద్యమునందలి వర్ణన మెంతయు సముచితముగ జతగూడినది. లోకమునంతయు నిండిన కాలకూటము పరమేశ్వరునిహుంకారముచే తొలుత మేఘమంతయై, ఆవెనుక నేనుఁగు వరాహము పికముల యాకృతితోఁ బోలినదియై క్రమముగ నేరెడుపండువలె నుండయై తుదికి నీశ్వరునిహస్తసరోరుహము నెక్కునరికి నొకచుక్కయాకృతి వహించినది. కావుననే శివుఁడు రససిద్ధుఁడు రసఘుటికను మ్రింగినట్లు విషమును గుటుకున మ్రింగె నఁట. ఈగరళభక్షణపద్ధతి రెండిట నొకే పద్యమున శ్రీనాథుఁ డిట్లు చిత్రించినాఁడు.

క. కటుక మగువిషము విషధర
కటకం బగుకేలఁ బూని కౌతూహలియై
ఘుటికాసంసిద్ధుఁడు రస
ఘుటికయునుం బోలె శివుఁడు గుటుకున మ్రింగెన్.

రససిద్ధిని సాధించిన యోగులు ద్రవరూపమయిన పాదరసమును ముద్దగాఁ జేసి, దానిని మ్రింగి, జరామరణవర్జితు లగుదురు. విషభక్షణముచేయుట- యలవరించుకొనినవారికిని రససిద్ధి యేర్పడునని రసశా

త్రమునకు సంబంధించిన రహస్యము. నీలకంఠు నారాధించిన భక్తులకే, యీశ్వరవీర్యమగు పాదరసము నాస్వాదించి తన్మూలమున విలక్షణ సిద్ధులను బడయుట, విషధారణము చేయఁగలశక్తిఁ బడయుటయుఁ గలుగుచుండఁగా, సకలసిద్ధులను భక్తుల కొసఁగఁజాలిన యీశ్వరుఁడు కాలకూటమును మ్రింగుటలో నాశ్చర్య మేమియు లేదనుటను ధ్వనింపఁ జేయుచు శ్రీనాథుఁడు శివుఁడు విషము గుటుకున మ్రింగెన్ అనినాఁడు.

హాలాహలము పరమేశ్వరుని కంఠమునందే నిలిచిపోవుట కీసమయమున నొకవింతసన్నివేశము జతగూడినది. కాలకూటవిషము కంఠసీమఁ జేరుసరికి హిమాచలకన్యక, తనభర్తను కౌఁగిలించుకొనునెపమున తనబాహువులను జుట్టి యిట్టు వాకొనినది.

ఉ. చుట్టు బిగించి పట్టి, పురసూదన! యీగరళాగ్నిఁ గంధరా
ఘట్టమునందు నిల్పు; మదిగాక దిగంబడనిచ్చితేని లోఁ
బట్టున నున్నలోకముల భస్మముసేయు; వెలార్చితేని, వె
ల్పట్టున నున్నలోకముల భస్మముసేయు; నిజంబు చెప్పితిన్.

పరమేశ్వరుఁడు కుక్షిలో నిమిడినసమస్తభువనములు గలవాఁడు. సముద్రమథనమునఁ బుట్టి లోకములన్నియు దహింపఁజేయు హాలాహలమును బాహ్యప్రపంచము భస్మము కాకుండుటకై, లోకానుగ్రహార్థము మ్రింగ నుద్యమించినాఁ డీశ్వరుఁడు. అది గొంతు దిగెనేని కుక్షిలోనిభువనములన్నియు భస్మమగును. వెలుపలి కుమిసిన బాహ్యప్రపంచము భస్మమగును. కావున నిరుతెరఁగుల భువననాశము తప్పదు. అందులకై గరళమును గళసీమయందే నిలిపివేయు మని సర్వలోకజనని ప్రార్థించినది.

ఆజగజ్జననిప్రార్థన సంగీకరించి, సర్వలోకసుఖసంధాత యగు శంభుఁ డిందనీలమణిభూషానిర్విశేషముగ రౌద్రమైన యాకాకోలవిషమును దనగళసీమయందే నిలిపినాఁడు. హాలాహల మతిరౌద్రము. దానిని భక్షించుటయుఁగూడ నతిరౌద్రమైన కృత్యమే. అట్టిలోకకల్యాణకరమైన కృత్యమును రుద్రుఁడే చేసెనని యీకింది పద్యమున రౌద్రరసభావాభివ్యక్తి యేర్పడునట్టులు చిత్రించినాఁడు.

శా. శంభుం డంబికపల్కు గైకొని, జగత్సంరక్షణార్థంబు సం
స్తంభించెన్ నిజకంఠగోళమున విశ్వక్షోభ సంతాపనసం
రంభారంభ విజృంభణోద్భటకళారౌద్రంబుఁ గాకోలముం
జంభారాతిమణిప్రకల్పితవిశేషానిద్విశేషంబుగన్. ౪. ౨౦.

నాఁటినుండియే పరమేశ్వరుఁడు నీలగ్రీవుఁడై వేదపురాణములందు నుతి కెక్కినాఁడు. కాలకూటవిషవిజృంభణము సమసిన వెనుక పునర్మథనమున నమృతకుంభాది దేవభోజ్యపదార్థములు పాల్కడలినుండి వెలువడఁగా, వాని నన్నిటి నొక్కటొక్కటిగ దేవతలు గైకొనిరి. ఆపుట్టిన సర్వమంగళాస్పదంబయిన వస్తువులలో కమలాలయయుత్పత్తి, యామె పుండరీకాక్షుని వరించుటయు సర్వాంగసౌష్ఠవముగఁ గొన సాగినవి.

సీ. సంపూర్ణపూర్ణిమా చంద్రబింబంబుతోఁ
బుట్టెఁ దెల్లని తమ్మిపువ్వుమొగ్గ
విరిసె నొయ్యొయ్యన వేలావనీవాటి
పవమాన కోమలాస్ఫాలనమున
వాసించె నఖిలదిగ్వలయంబు మధురవి
స్తారకేసరధూళి సౌరభములు
నంభోజమధ్యంబునం దుద్భవంబొందె
మహితకాంతిచ్ఛటా మండలంబు
అందు మణికర్ణికాగ్ర సింహాసనమున
లక్ష్మి యుదయించి హస్తపల్లవమునందుఁ
బసిఁడిపూదండఁ బూజించెఁ బద్మనయను
నర్థి వరియించె లీలాస్వయంవరమున. ౪. ౫౧.

క్షీరసముద్రమును దరువంబడుచుఁ గల్పవృక్ష కామధేను కౌస్తుభములు, ఉచ్చైశ్శ్రవైరావణాదులు పుట్టెనని సామాన్యముగఁ దెలిపి పద్మాలయయుత్పత్తి కాధారమైన పద్మము, నెంతయుఁ జిత్రముగఁ

జిత్రించినాఁడు. ఆ పద్మము ముందుగ ముకుళరూపమునఁ బొడసూపుచు, పూర్ణచంద్రునితోపాటు పుట్టి, చంద్రుని పోలికఁ దెలుపు వహించినది. క్రమముగ నా ముకుళము సముద్రతీరవనమునుండి పొదలిన మందమారుతాస్ఫాలనమున మెల్లమెల్లఁగ వికసించినది. రేకులు విచ్చి కేసరములు బయల్పడినంతనే పరాగమునుండి పరిమళములు చెలరేఁగి దిక్కులన్నియు నలముకొనినవి. అట్టి పద్మమధ్యమునుండి మహితమైన కాంతి మండలపూర ముప్పతిల్లినది. ఆ కాంతిమండలము నడుమ మాణిక్యకర్ణిక (దుద్దు) యను సింహాసనమునందు లక్ష్మీదేవి యుద్భవించినది. ఆమె కరపల్లవమున బంగారుపూదండఁ దాల్చి, పుండరీకాక్షుని స్వయంవరమున వరించి, యా పూదండతోఁ బూజచేసినది. ఈ పద్యమునందు పై నాలుగు పాదములందు కావ్యమునకుఁ బ్రాణమైన మాధుర్యము వెల్లివిరిసినది. సౌకుమార్యము పద్మమునందే కాక, దానిని జిత్రించు తీరునందు మఱింత తొలఁకియాడినది. శ్రీనాథుని సీసముల కూర్పులోని శిల్పము సర్వాంగసుందరమై యవతరించినది. ఒక్క పద్మము వికసించిన తీరు నాలుగుసీసపాదములలోఁ జిత్రించుటలోనే కావ్యత్వ ముట్టిపడుచున్నది.

తుదిపాదములో "లక్ష్మి పద్మనయను నర్థి వరియించె లీలా స్వయంవరమున"అనినాఁడు. పద్మాలయ యగుటచేతనే పద్మనయనుని ప్రీతితో లీలాకల్పితమైన స్వయంవరమునందు వరియించినదఁట. ఈ స్వయంవరమును సంస్కృతకవి యొకఁ డిట్లు చమత్కరించియున్నాఁడు.

శ్లో. ఆఖ్యాతే హసితం పితామహ ఇతి త్రస్తం కపాలీతి చ
వ్యావృత్తం గురు రిత్యయం దహన ఇత్యావిష్కృతా భీరుతా
పౌలోమీపతి రిత్యసూయిత మథ ప్రీడావినమ్రశ్రియా
పాయాద్వఃపురుషోత్తమో ఽయమితి యోన్యస్త స్స పుష్పాంజలిః.

క్షీరసాగరకన్యక పద్మమధ్యమునుండి లేచి, సముద్రతీరమునం దున్న దేవతాగణమును లక్షించి, పూలమాల చేతఁ బట్టుకొని, స్వయంవరమునకు బయలుదేఱినది. ముందుగ బ్రహ్మను జూపి 'ఈతఁడు పితా

మహేశుఁడు' అనినంతనే నవ్వినది. యువతి తాతను బెండ్లాడుట కంగీకరించునా ? పిమ్మట నీశ్వరుని జూపి 'కపాలి' అనినంతనే వికృతమైన కపాలధారణమును విని భయపడినది. ఈతఁడు 'దేవగురువు' అనినంతనే మొగము త్రిప్పివేసినది. 'దహనుఁడు' (అగ్ని) యనినంతనే తన్నుఁగూడ దహింపఁజేయు నేమో యని భీతిల్లినది. ఇంద్రుని జూపి ఈతఁడు 'శచీపతి' అని యాతని వరింపు మనఁగా, అడుగు పెట్టినంతనే సవతిపోరు సంభవించు నని యసూయపడినది. తుదికి విష్ణునిఁ జూపి, ఈతఁడు 'పురుషోత్తముఁడు' అని తెలిపినంతనే సిగ్గుచేఁ దలవంచుకొని పద్మాలయ పద్మనయనునివక్షమునఁ బూలమాలిక వైచెనఁట. ఇట్టి లీలాస్వయంవరమును శ్రీనాథుఁ డీపద్యమున ధ్వనింపఁజేసినాఁడు. కమలాలయ వరింప ననువైన దేవతాసమితి యచటనే కూడియుండెను; గాన స్వయంవరమునకై యత్నమక్కఱలేకయే హేలగ నామె పురుషోత్తముని వరింపఁగల్గిన దనుట యిచట వ్యక్తమగుచున్నది.

కాలకూటోత్పత్తికి, దద్భక్షణమున జగదుపద్రవ నివారణచేఁ బరమేశ్వరుని మహత్త్వము వ్యక్తము. చేయుటకు మూలము అమృతోత్పత్తియే. ఆయమృత ముద్భవించుట, దానికై దేవాసురులు కలహించుట, శ్రీమన్నారాయణుఁడు జగన్మోహినీ రూపమున రాక్షసులను వంచించి, దేవతల కమృతము పంచిపెట్టుట యనువిషయములను రెండు పద్యములలో సూక్ష్మముగ నిరూపించినాఁడు.

ఉ. అంతులు మీఱి మిక్కిలిగ నాగతనంబున దొమ్మిచేసి, దు
ర్దాంత పరాక్రమోన్నతులు దానవదైత్యులు వేల్పువెజ్జు ధ
న్వంతరిచేతి దుగ్ధమయ వారిసుధారస పూర్ణకుంభమున్
సంతసకట్టి పుచ్చుకొని చయ్యన నేఁగిరి నిర్విశంకతన్.

వ. అప్పుడు—

క. నారాయణుండు మాయా
నారీరూపమునఁ గపటనాటక లీలా
పారాయణత హరించె సు
రారులచే నమృతకలశ మానసమయమునన్. ౪-౯౩, ౯౮.

ఈవిధముగ జగన్మోహినీ రూపమును దాల్చి యమృతమును, హరించి, దేవతలకుఁ బంచిపెట్టిన విష్ణుమాయను సూచనామాత్ర సారముగఁ దెలిసి, దానవు లిట్టు లమృతమును గోలుపోవుట త్రిపురాసుర సంహారమునకు నాందిగాఁ జిత్రించినాఁడు. భీమనాథుని లీలామాత్రమునే యిందు కవి వర్ణింపఁబూనినాడు గావున, మాయానారీరూప వర్ణనము కావ్యత్వమునకు ముఖ్యసామగ్రి యయినను దానిని వదలివేసి నడుమ నారదపాత్రను బ్రవేశపెట్టి, యాతనిచే నసురులహృదయములం దమృతము గోలుపోయినందులకు దేవతలపై ద్వేషమును రగుల్కొల్పినాఁడు. అమృతమును గోలుపోవుట ద్వేషకారణమే యైనను, దానిని నారదముఖమున దానవులకుఁ జెప్పించి, వారికి నుద్రేకము హెచ్చ నీశ్వరోపాస్తి నుపాయముగ నిరూపించి, దానవసంహారము నీశ్వరునిచేఁ జేయింప నమకట్టి, వీరరసబీజమును నాఁటినాఁడు.

త్రిపురాసుర సంహారము.

శంకరుఁడు లోకకంటకు లయిన త్రిపురాసురులఁ బరిమార్చుటకై మహోత్తరసంరంభముతో నుద్యమించినపుడు భూమి రథముగను, సూర్యచంద్రులు చక్రములుగను, బ్రహ్మ సారథిగను, నాల్గువేదములు గుఱ్ఱములుగను, ఓంకారము ప్రతోదముగను (కొరడాకఱ్ఱగ) నక్షత్రపంక్తి జండాగను, మేరుపర్వతము ధనుస్సుగను, ఆదిశేషుఁడు నారిగను, వాయువులు బాణమునకు ఱెక్కలుగను, ప్రళయకాలాగ్ని ములికిగను, విష్ణువు బాణముగను జతగూడఁగా, పట్టణములతో పాటు త్రిపురాసురులను సంహరించి, వారల కుపాస్యమైన లింగమును, పంచవిధములుగా విభజించి పంచారామములందును పంచలింగములుగా వెలయించుట యీత్రిపురాసుర సంహారమునందలి ప్రధానమైన యితివృత్తము. త్రిపురాసురసంహారమునకుఁబరమేశ్వరుఁ డాయత్తపడుటకుఁగారణము త్రిపురాసురు లుద్రేకించి లోకముల కుపద్రవము గలిగించుట. అట్టి యుద్రేకము వారికిఁ గలుగుటకు మూలము, నారదుఁడు వారిని బరమేశ్వరు నారాధింపుఁడని ప్రోత్సహించుట.

దేవాసురులు సముద్రమును మథింపఁగా వెలువడిన యమృతమును, విష్ణువు దేవతలకే పంచిపెట్టి వెడలిపోయిన వెనుక, నారదుఁడు దానవులకడ కేఁగి వారితో—

శా. రక్షోనాయకులార! నిర్జరవరవ్రాతంబుచేతఁ సుధా
భిక్షాపాత్రము పోయె నంచు మదిలో బెగ్గిల్లఁగా నేటికిఁ
రక్షార్థుఁబు భజింపరాదె యభవుఁ త్రైలోక్యకుక్షింభరుఁ
దక్షారామపురాధినాథుని సుధాధామార్ధచూడామణిఁ.

అని యుపదేశము చేసినాఁడు. అమృతధామ మగుచంద్రఖండమును శిరోభూషణముగఁ దాల్చిన భీమనాథుని భజించిన మీ కమృతము కోలుపోతి మనువంత లేదును. అతని కుక్షిలో త్రిలోకములు నిండి యున్నవి. ఆతని యనుగ్రహము మీపైఁ గలిగిన నమృతము లభించుట యెంతపనియని యనినట్లయినది. ఆతఁడు త్రైలోక్యమును గుక్షిలో సంతర్పితము చేయు ననుమాటకూడ నిందు ధ్వనించుచునే యున్నది. ఇచట నారదోక్తివలన నుత్సుకులై దానవులు త్రిపురాసురులతోఁ గూడి, దక్షారామమునకుఁ జేరి, పాశుపతవ్రతాచారముచేఁ బరమేశ్వరు నారాధించి రని తెలిపిన యీ ఘట్టములో షట్కాలములందు శంభుపూజావిధాన మెట్టు లుండునో యెఱుఁగవచ్చును.

సీ. అరుణోదయంబున నాకాశవాహినీ
హేమాంబుజంబుల నిందుధరుని
మిహిరోదయంబున మహిసాక్షిగుగ్గులు
ధూపధూమంబుల దురితహరుని
సంగవంబున గంధసారకుంకుమచంద్ర
జంబాలమునఁ బుష్పచాపమథను
మధ్యాహ్నమునఁ బక్వమధురాన్నపాయసా
పూపాజ్యదధిఫలంబులఁ ద్రినేత్రుఁ

బరమసంధ్యాగమంబునఁ బటహశంఖ
ఝల్లరీమడ్డుడమరు ఝర్ఝరులమ్రోఁత
నర్ధరాత్రములందు వీణారవముల
హరుని బూజింతు రతిభక్తి నసురవరులు.

అరుణోదయకాలమునకుఁ బరమేశ్వరున కంబుజములతోఁ బూజలు, సూర్యోదయకాలమున ధూపము, సంగవకాలమున (నాల్గు గడియలు ప్రొద్దెక్కినపుడు) చందనాదిసుగంధద్రవ్యములతో మైపూఁత, మధ్యాహ్నకాలమున మధురాన్నఫలాదినైవేద్యసమర్పణము, సాయంసంధ్యాసమయమున భేరీశంఖాదివాద్యములు మ్రోయించుట, అర్ధరాత్రిసమయమున వీణారవములు కూడునట్లు లర్చించుట పాశుపతవ్రతులకుఁ జేయవలయు ననువిషయము మన కీయసురపూజావిధి తెలుపుచున్నది. పరమశైవులు కొందఱీవిధిని నేఁటికిని జరిగించుచునే యున్నారు. షట్కాలశంభుపూజ శివభక్తుల కవశ్యకర్తమగుట నీకావ్యమున వ్యాసునిచే—"షట్కాలశంభుపూజావిధానములకుఁ బల్లవప్రసవదర్భలును గలవే?" యని యగస్త్యు నడిగించినాఁడు. షట్కాలశంభుపూజావిధానమున కీపద్యము వివరణము.

అంతటితోఁబోక యసురులు పరమేశ్వరునిప్రసాదమును బడయుటకు పంచప్రణవములతోడను షడంగములతోడను గూడిన ప్రాసాదపంచాక్షరీమంత్రముల నీశ్వరుని బిల్వపత్రములతోఁ బూజించుచు, వేదపురాణములచేఁ బ్రస్తుతించిరఁట. ఆతీరు నిట్లు వివరించినాఁడు శ్రీనాథుఁడు.

ఉ. పంచబ్రహ్మషడంగమంత్రములనుం బ్రాసాదపంచాక్షరిం
బంచాస్యుం బహుబిల్వపత్త్రముల నభ్యర్చింతు రవ్యగ్రత
న్మంచుంగొండయనుంగుఁబెండ్లికొడుకు న్వర్ణింతు రేకాగ్రతం
బంచద్వేదపురాణమంత్రముల నిష్ఠాయుక్తి నక్తంచరుల్. ౪. ౧౦౪.

శబ్దమువలన ననుభూతి, అనుభూతివలన నానందముకలను; కావుననే ప్రతిదినము క్రియానిర్వహణకాలము గడియలైనను మిగిలిన ఘటికలలో శాబ్దముగనే ఆనందము పొందును ప్రతిమనుజుఁడు.

ఈరీతిగఁ బ్రత్యక్ష మెట్టియనుభూతులను గలిగించునో శబ్ద మట్టి యనుభూతులను గల్గించును. కొన్ని శబ్దములవలనఁ గలుగునను భవము యథార్థ మగును. శబ్దమువలనఁ గలిగిన యనుభూతికంటె వాస్తవానుభూతి భిన్నముగ నుండును. అయినచోఁ గానిం డనియెదరు. శబ్ద ముచ్చరింపఁబడిన వెంటనే యొకజ్ఞానమును కలిగించును. ఒకవస్తువును గోచరింపఁజేయును. అయ్యది యథార్థమా యనునది వేఱువిషయము. అది వికల్పము, బాధాసహాకృత మయిన నవుఁగాక అని యందురు యోగులు వైయాకరణులు. "శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః" అని వారియభిప్రాయము.

ప్రత్యక్షములోఁగూడ ప్రత్యక్షానుభవ విషయములకు వస్త్వనుభూతు లన్నియు యథార్థ మగుట కానరాదు. కఱ్ఱముంగను జూచి పురుషుం డనుకొనినప్పుడు త్రాటినిజూచి పా మనుకొనినపుడు, అభ్రకపు రేకును జూచి రజత మనుకొనినపుడు, భ్రాంతాత్మని వస్త్వనుభవము వేఱు. అభ్రాంతుని అనుభూతి వేఱు. ఒకదానిని జూచి మఱియొకటి యనుకొనుట మన పుట్టుకలోనే యున్నదని వేదాంతులు. ధూమశకటములోఁ బయనించువాఁడు చెట్లు పరువెట్టుచున్న వని యనుకొనుట, మేఘములు నింగిని బర్వులు వెట్టుచుండ చంద్రుఁడు పలాయనము చేయుచుండె ననుకొనుట యెట్టిదో మనము జననమరణములులేని యాత్మకు జననమరణములు కల్పించి, ఆభ్రాంతిని వీడక, అనేకజననమరణముల ననుభవించుచు నాఁటికిని నేఁటికి సాజాత్యమును వీడక అభ్రాంతిని వీడక, నిర్ద్వానుభూతివలన నగు నానందమే శాశ్వత మనుకొని జన్మకుఁ గారణభూత మగు చుంటి మని బ్రహ్మవివర్త వాదులు బ్రహ్మసత్యం జగన్మిథ్యా అని నిర్ణయించిన వేదాంతు లనియెదరు. మొత్తమునకు శబ్ద మయథార్థవిషయమును బోధించినను, ఒకవస్తువును సాక్షాత్కరింపఁజేసి అనుభూతిని గల్పించు ననుట తెల్లము.

శబ్దము కలిగించునటుల ఉపమకూడ నొకయనుభూతి గావించును. ప్రత్యక్షము వీడి మిగిలిన మూఁడిటివలనను గలిగిన యనుభూతి బాధా సహకృతము, యథార్థము నగును; గావుననే ఈప్రమాణముల వలనఁ గలుగు జ్ఞానము యథార్థమా కాదా? అని తెల్సుకొనుటకు మఱియొక ప్రమాణ ముండ వలయు నని "ప్రమాణానాం స్వతః ప్రామాణ్యంవా? పరతః ప్రామాణ్యంవా" అను విమర్శ చేసి, పరతః ప్రామాణ్య" మని నిర్ణయించిరి తార్కికులు. ఏప్రమాణమున కయినను ప్రమాణాంతర సహకార మక్కఱలేదనియు నటులఁ జెప్పిన "అభ్రికమును జూచివెండి యనుకొనిన ప్రత్యక్షమునఁగూడ బాధ తప్ప దొకటి. అటుల ఒకప్రమాణము నాశ్రియించిన, దాని నిర్ణీతికి మఱియొక ప్రమాణాపేక్ష వలసి యుండును. ఈరీతిగ ననవస్థ ఘటిల్లునుగావున ప్రమాణానాం స్వతఃప్రామాణ్యం'' అని ఒప్పిరి శ్రుతివాదులు.

ఇంతకు సదృశవస్తుదర్శనమువలన జనించు ననుభూతి మనస్సును మార్పఁ గలదు. మానసోల్లాస మొనర్పఁగలదు. సదృశవస్తు దర్శనము మనోవినోదోపాయ మనినాఁడు మల్లినాథుఁడు. ఏ క్రియయైన నుత్తరక్షణములో నశించును. క్రియ యొకేరూపములో నిలువదు.

గుణభూతై రవయవైః సమూహః క్రమజన్మనాం
ఆశ్రితక్రమరూపత్వా త్సా క్రియే త్యభిధీయతే. "

కనుక క్రియానందము కూడ సాదృశ్యాశ్రితమనవలయును. సాదృశ్యము వలన మొదటి క్రియైకదేశము స్మృతమయి ఆనంద మిచ్చును. స్మృతికి సాదృశ్యము కారణము. ఈవిధముగ నుపమారాజ్యము లోకములోను కావ్యములోను నున్నయది. ఉండవలెను. ఈసాదృశ్యమును, అక్షరసాదృశ్యము, శబ్దసాదృశ్యము, వాక్యసాదృశ్యము, అర్థసాదృశ్యము, సాదృశ్యనిషేధము, అను నీవిధముగ విభాగముచేసి పంచివైచిన అలంకారము లన్నియు నిష్పన్నమగును. లోకములోనున్న సాదృశ్యము కావ్యకళకుఁగూడ నత్యంతోపయోగి, అవినాభావసంబంధము. కావున ఉపమాలంకారము కళకొక ప్రధానాంగ మనినను తప్పులేదు.

ఉపమ కూడ నొకయంగమే కదా యని, అలంకారము లున్నవి కదా యని రసస్ఫూర్తి లేనివాక్యములను గావ్యములకుఁ జేర్చినచోఁ దలిశెట్టి రామారావుగారి ప్రబంధ శ్రీ చిత్రమువలె నుండును. మనిషికిఁ గళ లావణ్య మున్నచో నలంకారములు శోభను దెచ్చును. ఏవస్తువైనను శోభను దీసికొని రాఁగలదు. "కిమివ హి మధురాణాం మండనం నాకృతీనాం." లేనిచో నొక చీలకు భూషణము లుంచినటు లగును. అలంకార్యము లేనినాఁ డలంకారముల కలంకారత్వము లేదు. అలంకారములు లేదా యన్నిటికి శోభ తెచ్చిన నీక్రిందివాక్యము లన్నియు నలంకారములతో నిండి యుండవలసినదిరయే.

గోసదృశో గవయః:— ఉపమాలంకారము
స్థాణుర్వా పురుషోవా:— సందేహము
గౌర్వాహీకః:— రూపకము
ఇదం రజతం:— భ్రాంతిమత్తు
నాయం సర్పః:—అపహ్నుతి
పీనో దేవదత్తో దివా నభుంక్తే:— పర్యాయము
పర్వతో వహ్నిమాన్—అనుమానము
స దేవదత్తః:—స్మరణము
తస్థసమిహాం తాంతంతామః:— యథాసంఖ్యము
పుత్రేణ సహాగతః పితా:— సహోక్తి
తేన వినాగతః పితా:—వినోక్తి
శ్వేతో ధావతి:— శ్లేషాలంకారము

కావలసివచ్చును. శరీర మందమయినది లభించిన ప్రదేశయాలంకారము లలంకారధర్మమును నిర్వర్తించును. తేమంతట తామే అలంకార్యమును జేరును.

కళ-భావన-ఆలోచన.

సాహితీకళ "ఆలోచనామృత మని పెద్దలనానుడి. ఆలోచించిన కొలఁది మంచిమంచివిషయములు, హృద్యము లయినభావములు నభివ్యక్తమగును. ఏశ్లోకమునకైనను, బద్యమునకైనను ఏకార్థప్రతిపాదక

మగు సభీభావశక్తివలన పరిమితమగు నర్థము వచ్చును గదా! అయ్యది యందఱకు స్ఫుటముగా గోచరించుచుండును గదా! ఇంక ఆలోచన యెందులకు అని ప్రశ్న వేయవచ్చును. ఒక్క పద్యమును గూర్చి అనుకొందము. పెద్దన్నగారి రసాభాసపద్యములో నగ్ర్యమయినది.

ఎవ్వతె వీవు భీతహరిణేక్షణ! యొంటి చరించె దోటలే
కివ్వనభూమి, భూసురుఁడ నేఁ బ్రవరాఖ్యుఁడఁ ద్రోవ దప్పితిం
గ్రొవ్వున నిన్నగాగ్రమునకుం జనుదెంచి పురంబుఁ జేర నిం
కెవ్విధిఁ గాంతుఁ దెల్పఁగదవే! తెరు వెద్ది! శుభంబు నీకగున్.

ఈపద్యమునకు "వరూధినితోఁ బ్రవరుఁడు తెఱవా ! నీవెవరవు భయములే కివ్వనములో నొక్కతెవు సంచరించుచుంటివి ! నేను బ్రాహ్మణుఁడను. ప్రవరుఁడనువాఁడను. దారి తప్పిపోతిని. క్రొవ్వున నీపర్వతశిఖరాగ్రమునకు వచ్చితిని. పురము చేరుకొన నేమియు నుపాయము నాకుఁ గానరాదు. నాకు మార్గముఁ దెలుపుము. నీకు మేలగుఁగాక" అనునర్థ మందఱకు గోచరించుట తెల్లమే. కాని యింతటితో మహాకవులు తత్రాపి ప్రబంధపితామహుల వాక్యములకు, "తత్రాపిచ చతుర్థోఽంకః తత్ర శ్లోకచతుష్టయం" అన్నట్లు, ప్రవరుని కథ యంతయు అతని వ్యక్తిత్వ మంతయు నిమిడియున్న. రసాభాసకు మూలమైన యీ పద్యమున కీయర్థమనందే విశ్రాంతియా ? అని విమర్శించువారు పలు విధముల దీనియందలి సారము గ్రహింపఁ బ్రయత్నించెదరు.

"అస్త మేతి గభస్తిమాన్" అని ఒక వాక్యమును ప్రయోగించిన, దానింబట్టి - వణిజులు విక్రేయవస్తువులను పొత్తుపఱుప వచ్చుననియు, కార్మికులు పనులను మానవచ్చుననియు, బ్రాహ్మణులు సాంధ్యకృత్యములఁ బ్రారంభింపవచ్చుననియు, పెద్దలు పిల్లలను దూరముగఁ బంపఁ గూడదనియు, గోపులు గోదోహనము చేయవచ్చుననియు, చెలియలు ప్రియుఁడు వచ్చుననియు, బాధితుల కిఁక బాధ లుండనేరవనియు, పథికాంగనలు ప్రియుఁ డింకను రాలేదనియు, సాయంతనమగుచున్నది గుప్తముగా శత్రువు నాక్రమింపవచ్చునని శత్రువులును

అనుకొనిరెవరు. ఒక్కవాక్య మిన్నివిధముల భావముల నావిష్కరింపఁజేయును. ఈక్రిందిరీతిని పైపద్యమునకు—

వరూధిని ప్రవరునిఁ జూచినది. అతఁడు సౌందర్యవిజితత్రిలోకుఁడు. మనుజులలో నింతటి సౌందర్యమూర్తి లేకపోవుట సరేకదా దేవలోకములోఁగూడ లేఁడు. వరూధిని అనినమాటయే యిది. ఇతని యాకారేంగితచేష్టాదులు చూచిన బ్రాహ్మణుఁడే కాని ఇంత అందము నర, గరుడ, ఉరగ, ఖేచర, సిద్ధ, సాధ్య, చారణ, విద్యాధర, గంధర్వ కుమారులకు లేనేలేదు. వారిమాట అటులనుంచి దేవతలకు లేదు. వారిలోను చంద్రునకు, జయంతునకు, వసంతునకును లేదు. మన్మథునకును హుళక్కి, కనుకనే—

బ్రాహ్మణుఁడు దారి తెలియక, ఒకవ్యక్తి కనఁబడిన దారియడుగుటకయి కుమ్రిమ్మంచుఁ గుమ్రిమ్మంచు గానము వినిపింప మునియాశ్రమ మనుతహతహతో, ఇంటికి మరలుటకు దారి తెలియునను తత్తరపాటుతోఁ గోనలోనికి దిగ, నచ్చట ఆఁడుదానివాసన కొట్టినది. అయినను బ్రతికితిని. ఆఁడుదయినను జన మనుచు కనఁబడిన దారి తెలిసికొని పోవచ్చునని ద్విజాతిభావమున; వరూధిని చల్లగా హాయిగ వీణ వాయించుకొనుచు, ఆలాపగతిలోఁ జొక్కి రతిపారవశ్యములో సలిగన్ను మోడ్చికొని యుండ, నాకస్మికముగఁ గంటఁబడియెను. చాల అందగాఁడు. అతర్కితముగ గోచరించెనేమో (ఆమె యేమయినదియో సాధ్యమగునంతలో నామెయాకారమును పెద్దన పదరేఖలతో నభివ్యక్తి చేసెను.) ఆమె కితని యెడ మదిలో మెచ్చులు హెచ్చినవి. మదిలోఁ గోర్కెలు పెల్లురేఁగినవి. మై సంకురించినవి పులకలు. ఉత్కటమగు నావేగము, విస్మయము, బయలుదేఱినవి. ఝళంఝళత్కటక సూచిత వేగపదారవిందయై లేచినది. ఒడలంతయు సవరించుకొన్నది. ఎంతగంధర్వాంగనయైనను, వేశ్యాంగనయైనను, సంకోచము, మోదము, లోలత్వము, కోర్కెలుమెచ్చు, విస్మయము, తొచ్చపాటు, ఇంకను కొన్ని భావములు చెలరేఁగి భావశబలత నొందినవి. రతిపారవశ్యములోనలి

మోడ్పుఁగన్నులు విస్ఫారితము లయినవి. చంచలము లయినవి. మోహ విభ్రాంతి హెచ్చినది. చెమ్మట అంకురించినది. ఒక్క నిమేషములో గంధర్వాంగనను మోహవారిధిలో ముంచెత్తివైచెను. సాహసించినది కాని లజ్జ అడ్డుపడినది. గలగలమని యందెలరవముతో సద్దువచ్చి నిలిచిపోయినది వరూథిని.

కాని యితఁడు యోగియిచ్చిన పాదరసపుఁబూఁత పాదముల నుండి కరఁగిపోవుటచేఁ దా నిలుసేరు నుపాయ మేమున్నది? వెళ్లకపోయి నచోఁ గొంపలు మునిఁగి పోవునన్నంత సంభ్రాంతిలో నితఁ డుండెను. దారి దొరక దనియు, ఇంటికిఁ జేరలేమనియు భయముతో నిండియున్నాఁ డితఁడు. తా నెట్లు భయభ్రాంతుఁడై యుండెనో యటులనే వరూథిని కూడ నున్న దనుకొనినాఁడు. అనుకొనుటకుఁ దగిన ట్లామె కంగారుగ లేచుట, ఒడలంతయు సవరించుకొనుట, స్విన్నగాత్రి యగుట, చంచలముగాఁ జూచుట, సహాయకారు లయినవి. ప్రవరుఁ డామెను అటుల ననుకొనుటయు స్వభావమే. సహజమే. "దోషితోహి స్వదోషానే వాన్యత్ర ఆరోపయంతి" తా మొకదోషము కలవారైనవారు, ఆదోష మెదిరి వారిలో లేకపోయినను నున్నట్లు భావింతురు. కనుకనే ప్రవరుఁడు వరూథినిని అన్యభావాక్రాంతురాలైనను భీతగా నూహించును.

నీవు నావలెనే కంగారు పడుచుంటివి. భయపడిన లేడివలెఁ జూచుచుంటివి. "నాకేమియు భయము లేదని నీ వనినను నీకన్నులే చెప్పుచున్నవి నీవు భీతవని. భయపడువారి నేత్రము లింతచంచలముగా నుండును. భయ మెందులకు వేయదు. భయములేకుండఁగనే ఒక్కతెవు తిరుగుచుంటివా ? కాదు. భయము తప్పక వేయును. నేను జాల సమయమునుండి ఈ వనమంతయుఁ బరికించుచుంటిని. అమ్మయ్యో! ఒక్క జనుఁడు కనఁబడఁడే. ఉద్దండగండక వేదండ వరాహవాహరిపుఖడ్గ వ్యాఘ్రసంఘము తప్ప. అందునను ఆఁడుదానివి. సహాయము లెవరును లేరు ఒక్కతెవు. ఈ యడవిలో నీమూల నొక్కతెవు ఇటుల తిరుగుచుంటివి? ఎవతె వీవు? నా యంతటివాఁడను, మగవాఁడను, బ్రాహ్మణుఁడను, సర్వము తెలిసినవాఁడను. నన్నుఁ జూచితివిగా ? ప్రవరుఁ డందురు నన్ను

అట్టి వాఁడను నేను ద్రోవఁదప్పి, ఈ పర్వత శిఖరాగ్రమునకు వచ్చి దారి తెలియక కొట్టుకొనుచుంటిని. నా రాక చూఁచు నిచ్చటికి, ఈపర్వత శిఖరాగ్రమునకు. ఇట్టి పనులు క్రొవ్వెక్కినవా రొనర్తురు. క్రొవ్వు వలననే వచ్చితి ననుకొనుము. ఇంతకును మాయూరి దారి మఱచిపోయితిని. నాకు మా పురము చేరు నుపాయ మేమియుఁ దోఁచుటలేదు. సరే! నీవును నాకువలెనే దారి తప్పియే యుందువు. లేకపోయిన నిచ్చటికి సజీవుఁడు, జీవితాశకలవాఁడు చేరఁడు. కనుక నే యీ యేకాంతములోనుండి యుంటివి. నీ వెద్దియేని మా యూరి దారి యెఱిఁగియుండిన చెప్పుము. ఊరక చెప్ప నవసరము లేదు. నిన్ను ముందుగా నాశీర్వదించెదను. నీకు మేలు కలుగుఁగాక. నీకుఁ దెలిసియున్న చెప్పుము. నేను దీసికొని వెళ్లెదను. నీ వెవ్వతెవు?" అని సంభ్రమపరముగాఁ జెప్పవచ్చును. మనుజుని భావించుటచే మానుషత్వము వచ్చినది. ఎదుటివాఁ డెట్టివాఁ డయ్యెనో యామెకూడ నట్టిదియే యయి యుండును. కావున నామెయు భీత యని యనుకొనినాఁ డేమొ?

లేదా! ప్రవరుఁడు బ్రాహ్మణుఁడు. తత్రాపి శ్రోత్రియుఁడు. తన కార్యమును సాధించుకొనుటకు "ప్రియవాక్యప్రదానేన సర్వే తుష్యంతి దేహినః" అని పొగడ్తవలనఁ దన కార్యము సాధ్య మగునని యెంచి వరూథినినిఁ బలుకరించును. ఎవతెవు నీవు? నీ కన్నులు చాలఁ జంచలముగాను, విశాలముగాను, అందముగను నున్నయవి. చాలఁ జురుకైన దానవు. నాగరకురాలవు. చాలఁ దెలివికలదానవువలెఁ గన్పట్టుచుంటివి? ఇంతటిదానవు నీవు కాకపోయిన ఈ యరణ్యములో నొక్కర్తెవు నిర్భీకవై ఏకాంతముగా సంచరింపఁగలవా? ఆఁడుదానిమాట అటులుంచి మగవాఁ డంతటివాఁడు గూడ నీక్రూరమృగాకీర్ణమయిన యడవిలోఁ దిరుగలేఁడు. నా కేమయినదో చెప్పుము. కంగారు అడలు నెత్తికదా! ఆఁడుదానినైనను నీ దగ్గఱకు వచ్చితిని. రాకూడకపోయినను ఏకాంతములో నున్నదానియొద్దకు వచ్చితిని. ఎందులకు మగవాఁడనే.

అందులోను కులమున కగ్రవర్ణసంజాతుఁడనే! బ్రాహ్మణుఁడను. పేరులోఁ గూడ శ్రేష్ఠార్థవాచకమే. ప్రవరుఁడని. దేవతను గూడను. నేతిబీర కాయ యన్నట్లు, మట్టివిగ్రహ మన్నట్లు "భూసురుఁడను" బ్రాహ్మణత్వ మమాయకత్వమునకుఁ బుట్టినిల్లు. భయమునకుఁ దావలము. స్వేచ్ఛకు భంజకము. నియమనిష్ఠలకు నిలయము. కనుక నే జాడ్యానికి మూలకందము. లేనిచో,

అకలంకౌషధిసత్త్వముం దెలియ మాయాద్వారకావంతికా
శికురుక్షేత్రగయాప్రయాగములు నే సేవింప కుద్దండగం
డక వేదండవరాహవాహరిపుఖడ్గవ్యాఘ్ర మిమ్మంచుఁగొం
డకు రాఁ జెల్లునె! బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్.

నా పేరు చెప్పితిని గదా. గృహస్థులలోఁ గరడుకట్టిన నైష్ఠికుఁడను. బ్రాహ్మణులలోఁ బ్రవరుఁడను. శ్రోత్రియులలోఁ బ్రవరుఁడను. ఈ భూసురత్వము లేనిచోఁ గూపస్థమాండూక్యత వదలి స్వేచ్ఛగా దేశములు తిరిగియుండును. లౌకికతయుండి యుండెడిది. దారితప్పుటయేయుండక పోవును. ఎవఁడేమి చెప్పిన నది నమ్మి, కనఁ బ్రామి పాదరసము పూసిన నదియు నమ్మి మోసపడి ఇక్కడకు వచ్చితిని. పైపూఁత లిటులనే యుండును. వచ్చుటలో నీపర్వతశిఖరముమీఁదకు వచ్చితిని. హిమాలయపర్వతశిఖరాగ్రమునకు వచ్చితి నని, పర్వతశిఖరాగ్ర మెక్కుచుంటి నను సంతోషములో దారి గుర్తుపట్టలేదు. ఎక్కడి యరుణాస్పదపుర మెక్కడి తుహినాద్రి ? ఇంతకుఁ జెప్పవలసినది దారి తప్పితిని. క్రొవ్వెక్కి వచ్చినవాని కిటులనే జరుగును. మా యూరు చేరుట కెద్దియేని యుపాయ మున్నదియా? నా కేమియుఁ దెలియదు. నీ కన్నిత్రోవలు తెలిసియే యుండును. నీ కన్నులు, నీ సంభ్రమము, ఇవన్నియుఁ జూచిన నీకుఁ దెలియని విషయములుండి యుండవు. అనేకమార్గములు తెలిసికొనియే యుందువు. లేనిచో నింత యేకాంతములో నుండఁగలవా! నాకు మా యూరిదారి కొంచెమూహించితివేని నీకు శుభమగును. నన్ను బ్రతికించినవాఁడ వగుదువు. అని కైవారము చేసినాఁ డనవచ్చును.

# ఉషాపరిణయము
## రంగాజమ్మ
### ప్రథమాశ్వాసము

గ్రంథావతారిక:-

ఉ. శ్రీ విజయాయురున్నతుల
చే నలరించెదఁ గొల్చు వారలన్
ధీవిభవంబు మీఱి నని
తెల్పుచు హేమవనిం జెలంగు రా
జీవదళాయతాక్షుఁ డగు
చెంగమలేశుఁడు మన్ననారు గో
త్రావిభు ధేంద్రు నీ విజయ
రాఘవచంద్రునిఁ బ్రోచుఁగావుతన్ 1

శా. సారోదారకటాక్షవీక్షణ సుధా
సారంబు తోరంబుగా
భూరిక్షేమ మొసంగఁగా నెపుడు నం
భోజాత గర్భాదులన్
శ్రీ రంజిల్లఁగ జేయుచున్ జెలఁగు మా
చెంగమ్మ యిద్ధాత్రిపై
సారెన్ మన్నరుదాస భూవిభుని వా
త్సల్యంబునం బ్రోవుతన్. 2

సీ. సంతసం బమర వసంతునిఁ గొనియాడి
గరుడునిఁ బూజించి ఘనత మీఱి
సేనాధినాయకు సేవించి భక్తినిఁ
బన్నిద్దరాళ్వార్లఁ బ్రస్తుతించి

వేదాంత దేశికు వేడ్కతో భజియించి
వ్యాసవాల్మీకుల వరుసఁ బొగడి
చెలఁగి శతకర్తు శ్రీనివాసాభిఖ్య
తాతయాచార్యులఁ దలఁచి మదిని

గీ. వేదసంఘంబు మూర్తీభవించి నట్టు
లఖిల యాగంబు లొనరించి యవని యందు
చెలువు మీఱు శతకర్తు శ్రీనివాస
తాతగురువర్యునకును వందన మొనర్తు. 3

క. సకలసభామధ్యంబులఁ
బ్రకటంబుగ విబుధు లెల్ల భళి యనఁ దగు నా
సుకవుల సన్నుతి సేయుచుఁ
గుకవుల నిరసింతు మిగులఁ గుశలత మీఱన్. 4

వ. అని యిష్టదేవతానమస్కారంబును సుకవిపురస్కారంబునుం
గుకవితిరస్కారంబునుం గావించి యే నొక్క మహాప్రబం
ధంబు రచియించెద నని తలంచు సమయంబున. 5

సీ. శ్రీ రాజగోపాలసేవామహిమ చేత
నేరాజు ధర యెల్ల నేలుచుండుఁ
బరమతంబుల నెల్ల నిరసించి యే మేటి
వైష్ణవమతమె శాశ్వతము చేసె
బాల్యంబు నందునె పగతుర నిర్జించి
యే నేత కీర్తుల నెసఁగఁ గాంచెఁ
బదియాఱు దానముల్ బ్రనుతింప నే దాత
యవనిసురుల కిచ్చె నాదరించి

గీ. ఆతఁ డచ్యుతభూపవంశాబ్ధిచంద్రుఁ
డధికగాంభీర్య ధైర్యశౌర్యాతి సాంద్రుఁ
డవనిఁ దంజాపురాధీశుఁ డనఁగఁ బరగు
విజయరాఘవ మేదినీవిభువరుండు. 6

వ. మఱియును సత్యభాషాహరిశ్చంద్రుండును సత్కృపారామ చంద్రుండును సంగరరంగకిరీటియును సకల విద్యాచాతుర్య పేటియును దానరాధేయుండును ధరణీజనవినుతభాగధే యుండును రామానుజమతసిద్ధాంతస్థాపనాచార్యుండును రాజగోపాలనిత్యకైంకర్యధుర్యుండును చతుర్వేది శతక్రతు శ్రీ నివాసాచార్య చరణసరసిజసేవానిష్ఠాగరిష్ఠుండును చతురుదధివేష్టిత సర్వంసహాపాలకశ్రేష్ఠుండును సామంత రాజమణికిరీటరంజితపాదాంభోజుండును సరససాహిత్య కళా భోజుండును రఘునాథనృపాలనందనుండును రచితకళా వత్యంబికానయనానందుండును నగు న వ్విజయరాఘవ దేవేంద్రుండు రామణీయకవిరచితరాజరాజ సభావిజయం బగు రాజగోపాలవిజయంబు నందు నతులితవిలాస వతులైన కులసతులును విబుధసన్నుతమతి యగు విజయ వెంకటపతియును మహితప్రభావుం డగు మన్నారు దేవుం డును దతీయశోధనం డగు తాతఘనుండును రంగద్గుణ విలాసుం డగు చెంగమలదాసుండును మొదలగు నిఖిలజన మిత్రులైన పుత్రులును నిరుపమపవిత్రచరిత్రులైన పౌత్రులును నిరవద్యరూపరేఖాకనకపుత్రిక లైన పుత్రిక లును నింపువెలయఁ దామరతంపరై నిండి యుండఁ జెంగట శృంగారవతులు రంగురక్తులు మీఱ సంగీతమేళంబుఁగావింప నగ్రభాగంబున నాచార్యాగ్రేసరుం డగు శతక్రతు శ్రీనివా

సాచార్యుండు కృతదురితభంగం బగు హరివంశకథా ప్రసం
గంబుఁ గావింప నింపు మీఱ నేనును శృంగార రసంబునఁ
జెన్ను మీఱు మన్నారుదాసవిలాసంబు వినిపించుచున్న
సమయంబున. 7

సీ. వేంకటేంద్రుని పుత్రి వినుతసద్గుణధాత్రి
ఘనయశోరాజి రంగాజి వినుము
మాధుర్యమున మించు మన్నారుదాసవి
లాసప్రబంధంబు లలితఫణితిఁ
గావించి మిగుల శృంగారంబు గన్పట్టఁ
బదములు మృదురసాస్పదము లగుచు
రాణింప రచియించి రామాయణంబును
భాగవతంబును భారతంబు

గీ. సంగ్రహంబుగ రచియించి సరసరీతి
మమ్ము మెప్పించితివి చాల నెమ్మి దనరఁ
బరగ హరివంశమున నుషాపరిణయకథఁ
దెనుఁగు గావింపు మిఁక నీవు తేటగాఁగ. 8

వ. అని సబహుమానంబుగాఁ దాంబూల జాంబూనదాంబ
రమాల్యాభరణంబు లొసంగిన నేనునుం బరమానందంబుఁ
జెందుచుఁ బతియునుం గతియునుం గులదైవంబును నైన
నీదు పాదారవిందంబులు డెందంబున సేవింపుచున్న తనకు
మీ రానతిచ్చు కథాసంవిధానంబు సర్వంబును నవగతం
బగుఁ గావున నట్లు రచియించెదఁ బంజరశుకంబు మంజు
వాగ్భణితి రంజిల్లం బలికినం దత్పోషకుండు సంతోషించు
తెఱంగున మదీయవచనకుసుమార్చనం బంగీకరించి నన్ను
గటాక్షింపుం డని విన్నవించిన లాలించి యాచార్యచర

గారవిరదంబులకు వందనంబు గావించి యమ్మహామహుని
యనుజ్ఞఁ గైకొమ్మనుటయు నట్లన సేవించిన దీవించి గురు
రాజపట్టభద్రుం డిట్లనియె. 9

క. నీ పతి మన్నారుదాసుఁడు
గోపాలుఁడు గనుక నితఁడు కోర్కెలు హెచ్చం
జేపట్టి మనుప నెలకొను
నా పలుకులనెలఁత నీ ముఖాంబుజసీమన్. 10

వ. అని మఱియును. 11

సీ. తనరెడు మన్నారుదాసవిలాసంబు
నమర నీ వొనరించు నప్పు డేము
విజయరాఘవమహీవిభుని వంశావళి
వినఁపించితిమి గదా విశదముగను
కీర్తుల మీఱిన కృష్ణభూపాలుఁడు
నయశాలి యగు తిమ్మనాయకుండు
దివ్యతేజము గల తిమ్మప్పనాయఁడు
శ్రీనిధి యైనట్టి చెవ్వనృపతి
గీ. చెలఁగి శ్రీరంగమున రామసేతువునను
బొగడ బహువిధకైంకర్యముల నొనర్చి
యచ్చుతాళ్వారు లనఁ దన నవని వెలయు
నచ్యుతవిభుంకు నలరిరి యతిశయమున. 12

క. అల యచ్యుతభూవిభునకు
నలఘుయశస్స్ఫూర్తి మూర్తిమాంబకు సుతుఁడై
వెలసెన్ రఘునాథమహీ
తలపతి రఘునాథుఁ డితఁడె తప్ప దనంగన్. 13

సీ. తనర నా రఘునాథ ధరణీశ్వరుఁడు చెంజి
లక్ష్మమ్మ యల్ల కళావతమ్మ
పట్టంపురాణులై ప్రబలి సేవ లొనర్పఁ
గుల మెల్ల వెలయించు కొడుకు వలసి
దానధర్మంబులు తపములు సలుపుచుఁ
గస్తూరి కృష్ణుని ఘనత వేఁడ
నల చెంజి లక్ష్మమ్మ కలలోనఁ గస్తూరి
కృష్ణుఁ డిట్లనెఁ బూర్వవృత్త మొకటి
గీ. నీవు తొల్తను దేవకీదేవి వరయ
సాటి లేని కళావతీసతి యశోద
యల్ల వసుదేవనందుల యాత్మ లిచట
నెగడె నచ్యుతరఘునాథనృపతి యనఁగ. 14

సీ. అల వసుదేవున కాత్మసంభవుఁడనై
మందలోఁ బెరుగంగ నందు నింటఁ
దపములు చేసి యేఁ దనయునిఁ గాంచితి
బాలలీల యశోద భాగ్య మయ్యె
నని తలఁపుచు నుంటి నటు గాన నిప్పు డే
నొగిఁ గళావత్యంబ యుదర మందు
నుదయింతు సంతోష మొదవంగ నీవును
ఘనతఁ బుత్రి స్వీకృతిని యొనర్చి
గీ. విజయరాఘవుఁ డను పేర వెలయఁజేసి
నన్నుఁ బోషించి యొప్పుడు నానంద మొందు
మనుచుఁ బల్కంగ మేల్కని హర్ష మంది
వెలయ లక్ష్మమ్మ విభునకు విన్నవించె. 15

వ. అట్లుదయించిన మహానుభావుండు గావున. 16

ఉ. నిస్తులసద్గుణావళుల
నిర్మలవాసన నిండ దిక్కులన్
స్వస్తి కొమొనర్చుచున్ సుజన
సంతతి కెల్లను మాటిమాటికిన్
గస్తురి కృష్ణుఁ డీతఁ డన
గౌరవ మందుచు ధాత్రి లోపలన్
బ్రిస్తుతి కెక్కు నీ విజయ
రాఘవచంద్రుని కిమ్ము నీ కృతిన్. 17

వ. అని యానతిచ్చి యాచార్యశేఖరుండు ప్రబంధారంభంబున
కనుజ్ఞ నిచ్చెం గావున. 18

## —: షష్ఠ్యంతములు :—

క. అమితకళాభోజనకును
గమలాప్తసమాన బాహు ఘన తేజునకున్
సమరాగ్రి బిడౌజునకును
రమణీజనకామనోహరమనోజునకున్. 19

క. చెంగమలావరకరుణా
పాంగవిలోకన సమాగ్రతైశ్వర్యునకున్
సంగరరంగోద్ధత రిపు
భంగప్రథమానసీయ బలధుర్యునకున్. 20

క. దారుణ శాత్రవ మథనో
దారునకున్ శ్రీనివాస తాతగురుపదా
ధారునకు విశ్రుతయశో
ధారునకున్ సరసనత్కళాధారునకున్. 21

క. కనకతులాపూరుషముఖ
వినుతమహాదానకలితవిద్వత్తతికిఁ
ఘనశబ్దార్థనిగుంభన
జనితబుధానందసకలసన్నుత కృతికిఁ. 22

క. కనకక్షితిధరధృతికిని
జనకపదాంభోజభజనసంభృతమతికిఁ
ఘనవితరణరతికి బుధా
వనకృతికిఁ విజయరాఘవక్ష్మాపతికిన్. 23

వ. అంకితంబుగా నే నొనర్పం బూనిన యుషాపరిణయం బను మహాప్రబంధరాజంబునకుం గథాసంవిధానం బెట్టి దనిన. 24

# ఏకాదశ స్కంధము.

— హరిభట్టారకుఁడు —

క. మును బ్రహ్మాదికుమారుం
డును, శుక సనకాదిచారణులు యాదవులున్
అనవరత భక్తియోగం
బునఁ బొందరె మత్పదంబు భూసురవర్యా. 267

క. వినుతింప భక్తియోగం
బునకును సరిరాదు, దానమును, దీర్ఘంబున్
ఘనమైన తపము యోగం
బును వ్రతనియమాదులైనఁ బుణ్యచరిత్రా. 268

సీ. గంధర్వయక్షనాగములు దైతేయులు
సిద్ధు లప్సరసలు సిద్ధపతులు
మృగములు గుహ్యకుల్ ఖగ యాదవాదులు
బాణుండు బలియుఁ గుబ్జయును, యజ్ఞ
పత్నులు, గోపికల్ పరికింప సుగ్రీవ
హనుమ దాదులు, విభీషణుఁడు గృధ్రి
మయ ముసీందాద్రిదు లధ్యయనంబు వర్జించి
నవడి నిత్యోపవాసములు మాని

గీ. నిత్యకర్మాదివిధుల ననత్య మనుచు
సంతతాధ్వగమార్గంబు చక్కఁబోక
ముదముతోడుత సత్సంగమున మదీయ
లోకమందున వసియింతు రేకమతిని 269

ఉ. శీరకరుండు నేను నతిచిత్రరథంబుల నెక్కి వేడ్క న
క్రూరునితోడున్ మధురకున్ జనువేళ సమస్తగోపికల్
మారుని బారిఁ జిక్కువడి మమ్ములఁ బాసిన జాముఁ బుత్తు రం
భోరుహజాతకల్పముగ భోజనభూషణవాంఛ జాఱ్పునన్. 270

క. ఆ రమణులు నిజపతులను
నారూపముగాఁ దలంచి నయమార్గములన్
వారలతోఁ గ్రీడించెద
రారయ మద్భక్తి సహితలై విప్రవరా. 271

క. ఈ రీతిని గోపిక లవి
కారంబున భక్తియోగ కలితోద్యమలై
నేరుపున నన్నుఁ బొందిరి
యారయ నీక్షింప భక్తి కన్యము గలదే. 272

ఆ. సుతధనాదులందు సతులందు గృహమందు
దేహమందు మిగుల నీహ మాని
భక్తి కలిగి చిత్తభవనంబులోపల
శరణు వొందు నన్ను సంయమీంద్ర. 273

వ. ఈ విధమున నానతిచ్చిన వాసుదేవునకు మునివరుం డిట్లనియె. 274

క. శ్రీవల్లభ కమలాసన
బావాంబుజమధ్యనిలయ పావనచిత్తం
బే విధమున భ్రమియించును
దేవాధిప నాకు నానతీయఁగ వలయున్. 275

వ. అని పలికిన ధరణిసురునకు శౌరి యిట్లనియె. మునీంద్రా, దారుమధ్య
మానం బగు ననలంబు సూక్ష్మరూపంబున జనియించి సమిత్సమేధితం
బగు క్రమంబున సూక్ష్మతరంబున మద్రూపంబు గుణవర్ధితంబై భూతం

బుల గ్రసియించు.జీవుండు సకలదేహాంతరగతుండై యచ్ఛేద్యుండై యదాహ్యుండై యశోష్యుండై వర్తించు. ఈ జీవుండు సంసారచక్ర పరిభ్రమితుండై జన్మావ్యయంబులఁ బొందుచుండు. అట్టి పురాతనంబైన సంసారమహీరుహంబు కర్మాత్మకంబై శతమూలసమేతంబై నాళత్రయంబు కలిగి పంచస్కంధవిశాలంబై పంచరస ప్రసూతి జనకంబై దశైకశాఖావిస్తృతంబై సుపర్ణద్వయసేవితంబై ఫలద్వయవిరాజితం బగు. అం దొకఫలంబును గ్రామచరులును మఱియు నొక్కఫలంబు నరణ్యవాసులును భుజియింతు రివ్విధంబున బహువిధంబై మాయారూపంబగు నీ సంసారమహీరుహంబును సద్గురు సేవామూలంబున సంభవించు విద్య యను కుఠారంబున మొదలు ముట్టం దునిమి యప్రమత్తుండవై యాత్మ నాత్మతోఁగూర్చి కర్మంబుఁ బరిత్యజింపవలయు నని యశోదానందనుం డానతిచ్చిన మఱియు ని ట్లనియె. 276

సీ. సత్త్వరజస్తామసములు నాఁ బరగును
సద్గుణత్రయమందు స త్త్వగుణము
సుజ్ఞానజనకమై శుభ దాయకం బగు
నది గాక సా త్త్వికం బైన యట్టి
సకలధర్మమ్ములఁ జరియింపవలయును
బహువిధంబుల మదర్పణము గాఁగ
నా రజోమూలమై నట్టి ధర్మంబులు
చర్చింపఁగాఁ బునర్జనన హేతు

గీ. వందుఁ దామస ధర్మంబు లఖిలనరక
కారణంబులుగాన, నీ క్రమముఁ దెలిసి
నరుఁడు సా త్త్వికమూల మై నట్టి ధర్మ
మాచరింపంగవలయు విఖ్యాతితోడ. 227

వ. అని పలికిన సత్యభామావల్లభుం డి ట్లనియె. 278

క. సనకాదుల కే రూపం
బునఁ జెప్పితి వఖిల యోగమును దద్రూపం
బనఘ రమాధిప నాకును
వినుప వలయు మనములోన వేడ్కం దలిర్పన్ 278

చ. అని ముని పల్క నంత విబుధాహితఖండనుఁ డాన తిచ్చె ని
ట్లనఘ మునీంద్రవర్య సనకాదులు పూర్వవిధాతమానసం
బున జనియించి తత్త్వము సమున్నతితో నెఱుఁగంగఁ గోరి, వా
రనుమతి బ్రహ్మఁ జే రడిగి రందఱు నొక్కెడఁ బ్రశ్నబీజముల్. 279

ఆ. కోరి చిత్తమందు గుణములు వర్తించుఁ
దద్గుణంబులందుఁ దనరుఁ జిత్త
మా యురంబులోన సన్యోన్య సంత్యాగ
మెట్లు సేయవచ్చు హేమగర్భ. 280

సీ. సనకాదు లీ విధంబునఁ బ్రశ్నఁ జేసిన
బ్రహ్మజ్ఞుఁ డైన యా పద్మభవుఁడు
పరువడిఁ దత్కృత ప్రశ్నబీజము గాన
లేకుంట యెఱిఁగి నే లోకభర్త
కీ ప్రశ్నబీజంబు నెఱుఁగ జెప్పఁగఁ బూని
హంసరూపముఁ దాల్చి యచట కరుగ
నా మునీంద్రులు నాకు నర్ఘ్య పాద్యము లిచ్చి
పాదాభివందనఁ బరగఁ జేసి

గీ. బ్రహ్మ మొదలైన సనకాది బ్రహ్మమునులు
తత్త్వ జిజ్ఞాసు లై నన్ను • దగ్గ అడిగి
నంత వారల కేఁ జెప్పినట్టి యోగ
మంతయును నీకు నెఱిఁగింతు నాదినుండి. 281

---

• దగ్గఱి + అడిగినంత. క్త్వార్థక సంధి

వ. అది యెట్లనిన. 283

సీ. నానా మన శ్శ్రోత్ర నయన యుగ్మముచేత
నెఱి గృహ్యమాన మై నిలుచు నెయ్యె
దా పదార్థం బనిత్యంబుగా నెఱుఁగుచు
బ్రహ్మంబు జగ మని రమణఁ దెలియుఁ
డా బ్రహ్మ మఖిల భూతాంత ర్నివాసి యై
వర్తించు సాక్షి యై వానియందు
దేహి కర్మార్జిత దేహంబు ధరియించి
శాంతుఁ డై సంసార చింత మాని
గీ. మమత వర్జించి తుర్యాశ్రమస్థుఁ డగుచు
నిర్మల జ్ఞాన నియతుఁ డై నెమ్మితోడ
యోగ మార్గాధిరూఢుఁ డై యుండె నేని
మ త్పదంబున ♦ వసియించు మాన్యుఁ డగును. 284

వ. మరియు దేహి స్వప్నగతుం డై పదార్థ దర్శనంబు సేసినట్లు జాగ్రదవస్థం దోఁచిన యవి నిత్యంబులు గావు. యోగి లోకమందు మదిరాపానంబుఁ జేసి మదాంధుఁ డైనవాఁడు పరిధానాంశుక పాతనాపాతనంబుల నెఱుంగని చందంబున దైవకృత్యంబు లైన నిజ దేహ స్థితి నాశనంబుల నెఱుంగఁడు. కర్మానుభవ సమాప్తి పర్యంతంబు దేహంబు వర్తించు నని సనకాదులకు సాంఖ్య యోగంబుపదేశించి వారిచేఁ బూజితుండ నై పరమనిలయంబున కరిగితి నంత నీ యోగంబును విధాత యెఱింగి భృగ్వాదులకును; బ్రహ్మ ఋషులకును జెప్పె. వారు దేవ దానవ గంధర్వుల కుపదేశించిరి. త న్మూలమున మర్త్య లోక వాసు లభ్యసించిరి. ఇవ్విధంబునఁ

♦ వర్తించు. వ్రాత ప్రతి.

బరంపరానుగతం బగు సాంఖ్య యోగం బెఱింగి సమ్యగ్జ్ఞాన సమే
తుఁడవై పుణ్యదేశ నదీ వన సంచారంబు లాచరింపు మని యాద
వేంద్రుం డానతిచ్చిన నుద్ధవుం డిట్లనియె. 285

క. పర కాంతా ధనముల పైఁ
దిరుగాడెడు చిత్త మెట్లు త్రిదశేశ్వర నీ
వర రూప మందు నిలుచును
దిరముగ నిది నాకు నానతీయఁగవలయున్. 286

వ. అని పలికిన ధరణీసుర సత్తమునకుఁ బద్మనాభుం డిట్లనియె. 287

ఉ. కొందఱు ధర్మ మార్గములఁ గొందఱు సంపదఁ గొంద ఱర్థమున్
గొందఱు నిత్యదానములఁ గొందఱు కీర్తులఁ బుత్రదారలన్
గొందఱు సంతతాధ్వరముఁ గొందఱు తీవ్ర తపఃక్రియాదులన్
గొందఱు కామ యంత్రములఁ గోరుచునుందురు మోహితాత్ములై.

క. శ్రీ రమణుం డగు నను మదిఁ
గోరి భజింపంగ లేక కుపథంబులపై
నేరుపు చెడి వర్తింపుదు
రీ రీతిని నరులు మోక్ష హిత విరహితులై. 289

ఆ. నీరసంబులైన భూరుహంబుల నగ్ని
యేచి నీఱుగా దహించు నట్లు
మాన్యమైన యట్టి మత్పాద యుగ భక్తి
పాపసమితిఁ జెఱచుఁ బంతముగను. 290

క. ఒకవంక నాఁగు నగు వే
ఱొకచో గానంబు సేయు నుబ్బిన వేడ్కన్
సకలంబు విష్ణుమయ మని
ప్రకటంబుగ మత్పదాబ్జ భక్తుఁడు దెలియున్. 291

సీ. హరిభక్తి గలవాని చరణ రేణు చయంబు
పోఁకిన భూమెల్ల శుద్ధి బొందు
హరిభక్తి గలవాని కన్నంబుఁ బెట్టిన
నరు నింట 1. వేడుకనారగింతు
హరిభక్తి సంపన్నుఁ డగువాని సేవింపఁ
బాప తూలాద్రులు భస్మ మగును
హరిభక్తి సంయుక్తుఁ డగువాని వెనువెంట,
దిరుగు లాడుచు నుందుఁ దెలివి పెడక

గీ. వ్రతము లైనను సంతత క్రతువు లైన
ధర్మ మైనను బహువిధాధ్యయన మైన
నీదు జోడుగ మద్భక్తితోడ నెపుడు
2. నవతు రా నేర వెచ్చోట సంయమీంద్ర 292

గీ. భోగ వాంఛతోడఁ బొదలెడి చిత్తంబు
భోగ్య వస్తు సమితి బొందుఁ గోరుఁ
దనివి లేక నన్నుఁ దలఁపుచు వర్తించు
మనము మత్పదాబ్జమునను నిలుచు. 293

శా. కాంతా సంగము మాని సంతతము నేకాంత ప్రదేశంబునన్
శాంతుండై ధన దార మోహ కలితేచ్ఛా వర్జితుండై రమా
కాంతుం డౌ నను నెప్డుఁ బ్రేమమున మోక్షప్రాప్తికై యోగి శు
ద్ధాంతః పద్మమునం దలంపవలయున్ హర్షోల్లసత్స్వాంతుఁడై.

మ. హరి యీ రీతిని నానతిచ్చిన మునీంద్రాగణ్యుఁ డా పంకజో
దరుతో ని ట్లనియెన్ సమస్తజగదాధారప్రపన్నార్తినం
హర యెవ్వాని మనంబులోఁ దలఁచి యోగారూఢుఁ డింద్రాది దు
స్తర యుష్మత్పద వాసియై తనరుఁ దద్ధ్యానంబు వర్ణింపవే. 294

1. నే భోజనంబు నేతు. వ్రాఁతప్రతి.
2. సమత గానేరవు. వ్రాఁతప్రతి.

వ. ఇవ్విధమ్మున ధ్యానయోగంబడిగిన ధరణీసురోత్తమునకు యదుపుంగవుం డిట్లనియె. 295

సీ. శాంతుఁడై నియతి నశ్రాంతంబు నేకాంత
మున సమాసీనుఁడై ముదముతోడ
హస్తంబు లూరు ద్వయంబునఁ గీలించి
నాసాగ్ర విన్యస్త నయనుఁ డగుచు
హృదయ నాళంబులో నుదయార్క సమకాంతి
కలిగిన పద్మ కుట్మలము మిగుల

గీ. వికసితంబైన దానిగా వీక్ష చేసి
కర్ణికా మధ్యమంబునఁ గ్రమముతోడ
విమల చంద్రాగ్నిరవి మండలముల నిలిపి
తద్విభావసు మండల స్థానమందు. 296

వ. మఱియుఁ దప్త కాంచన సంకాశ దివ్య దేహుండును, కటిఘటిత రత్న ఘంటికా సమంచిత పీతాంబ రాలంకృతుండును, కమలాయత కుండల ద్వయ దీప్తి శ్యామలిత కపోల ద్వయ విరాజమాన వదనుండును, చంపక ప్రసూన సమాన నాసా లంబిత మౌక్తిక ధవళితాధరుండును, కౌస్తుభ శ్రీవత్స వనమాలాలంకృతుండును, బహువిధ రత్న విచిత్ర భూషా సమేతుండును, రత్న కిరీట దేదీప్యమానుండును, బాహు చతుష్కోపశోభితుండును, శంఖ చక్ర, గదా నందనాద్యనేకాయుధ ధరుండును, మరకతమణి నూపుర ద్వితయ ద్యుతి పిశంగీకృత పాదాబ్జుండును, కరుణారస పరిపూర్ణుండును, స్వానూంక నివాస కమలాలోకన కుతూహల పరితుష్ట హృదయుండును, కనక సింహాసన సమాసీనుండును, నైన నన్ను భావించి సంతసంబున ధ్యానంబు సేయవలయును.